
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 73
మంగళవారం 4-6-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'


మెక్సికోలో కొత్త చరిత్ర
అధ్యక్ష పీఠంపై షీన్‌బామ్. తొలి మహిళగా రికార్డు - 6లో


నమీబియా గెలుపు 'సూపర్'
టీ20 ప్రపంచకప్‌లో నమీబియా బోణీ. 'సూపర్ ఓవర్'లో ఒమన్‌పై విజయం. - 12లో


'ఎగ్జిట్'కు విరుద్ధంగా ఫలితాలు..
లోక్‌సభ ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నమైన ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆశాభావం వ్యక్తంచేశారు.
- వివరాలు 6లో


వారి ఆస్తులు జప్తు చేయండి..
ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితతోపాటు ఇతర నిందితుల ఆస్తులు జప్తు చేయాలని, కోర్టు విచారణ ప్రారంభించాలని ఈడీ కోరింది.
- వివరాలు 3లో


ఈవీఎంలను మార్చేశారు
తాను పోటీ చేసిన లోక్‌సభ స్థానంలో పోలింగ్ ముగిశాక ఈవీఎంలను మార్చేశారని ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భగేల్ ఆరోపించారు.
- వివరాలు 6లో


మాకొచ్చే సీట్లివిగో
లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి పలు రాష్ట్రాల్లో సాధించబోయే సీట్ల లెక్కలను కాంగ్రెస్ వర్గాలు విడుదల చేశాయి.
- వివరాలు 6లో

ఒక్కరోజులో పెరిగిన మదుపర్ల సంపద

కేంద్రంలో మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వమే వస్తుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో కదం తొక్కిన స్టాక్ మార్కెట్

2,507 పాయింట్ల పోల్‌వాల్ట్.. కొత్త రికార్డ్ 76,469కు సెన్సెక్స్

నిఫ్టీ 733 పాయింట్ల హైజంప్.. చరిత్రాత్మక గరిష్ఠం 23,264కు..

రూ. 14 లక్షల కోట్లు



→ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి కేంద్రంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయనుందనే ఎగ్జిట్ పోల్స్ అంచనా స్టాక్ మార్కెట్‌కు కొత్త జోష్ నిచ్చింది. అటు క్యూ4 జీడీపీ అంచనాలను మించి 7.8 శాతం వృద్ధి సాధించడం మార్కెట్‌కు ఉత్సాహాన్నిచ్చింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ సోమవారం 3.4 శాతం లాభాలతో కొత్త శిఖరాలకు పరుగులు తీశాయి. సెన్సెక్స్ ఏకంగా 2,507 పాయింట్లు ర్యాలీ చేసి చరిత్రాత్మక గరిష్ఠం 76,469 వద్ద నిలిచింది! నిఫ్టీ సైతం 733 పాయింట్లు జంప్ చేసి సరి కొత్త రికార్డ్‌తో 23,264 వద్ద ముగిసింది. సోమవారం ఇన్వెస్టర్ల సంపద రూ. 14 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో ట్రేడవుతున్న లిస్టెడ్ కంపెనీల విలువ విడిగా 5 ట్రిలియన్ డాలర్లను అధిగమించింది!!

- వివరాలు 13లో

సార్వత్రిక ఎన్నికల్లో ఓటెత్తిన పౌరులు

ఇది ప్రపంచ రికార్డ్.. ఓటర్లకు వందనం: సీఈసీ రాజీవ్‌కుమార్

ఈ సంఖ్య జీ7 దేశాల ఓటర్ల కంటే 1.5 రెట్లు ఎక్కువ..

2019తో పోలిస్తే రీపోలింగ్ సంఖ్య గణనీయంగా తగ్గింది

తొలిసారిగా కౌంటింగ్‌కు ముందే ప్రెస్‌మీట్

64.2 కోట్ల మంది..



→ లోక్‌సభ ఎన్నికల్లో 31.2 కోట్ల మంది మహిళలు సహా మొత్తంగా 64.2 కోట్ల మంది భారతీయ పౌరులు ఓటు హక్కు వినియోగించుకొని నూతన ప్రపంచ రికార్డు సృష్టించారని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ ప్రకటించారు. ఈ సంఖ్య జీ7 దేశాల ఓటర్ల కంటే 1.5 రెట్లు ఎక్కువని, 27 యూరోపియన్ యూనియన్ దేశాల ఓటర్ల కంటే 2.5 రెట్లు అధికమని చెప్పారు. ఈ ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్లందరికీ అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. దేశ చరిత్రలో తొలిసారి ఓట్ల లెక్కింపునకు ముందు తోటి కమిషనర్లతో సహా సీఈసీ సోమవారం ఢిల్లీలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై మాట్లాడారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

టాలీవుడ్ నటి హేమ అరెస్టు



బెంగళూరులో గత నెల 18న జరిగిన రేవ్ పార్టీ కేసులో తెలుగు నటి హేమను సోమవారం బెంగళూరు సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. రేవ్ పార్టీలో నటి హేమతోపాటు 86 మంది డ్రగ్స్ సేవించినట్లు అక్కడి పోలీసులు ప్రకటించడం తెలిసిందే.

- వివరాలు 3లో

అమెరికాలో హైదరాబాద్ యువతి మిస్సింగ్



అమెరికాలోని కాలిఫోర్నియా స్టేట్ వర్సిటీ సబ్ బెర్నార్డియాలో చదువుతున్న హైదరాబాదీ నితీషా కందుల (23) అదృశ్యమయ్యారు. గత నెల 28 నుంచి కనిపించని ఆమె కోసం లాస్ ఏంజిలెస్ పోలీసులు గాలిస్తున్నారు.

- వివరాలు 5లో

గ్రూప్-1 హాల్‌టికెట్లలో మార్పులు..



ఈ నెల 9న జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి అభ్యర్థుల హాల్‌టికెట్లలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. అభ్యర్థి కమ్యూనిటీ పక్కన క్రీమీలేయర్/నాన్ క్రీమీలేయర్ కనిపించేలా మారుస్తూ కొత్త హాల్ టికెట్లను టీఎస్‌పీఎస్సీవెబ్‌సైట్‌లో ఉంచింది.

- వివరాలు 14లో

లెక్క తేలేది నేడే..

ఉదయం 8 గంటల నుంచే లోక్‌సభ ఓట్ల లెక్కింపు షురూ..

ఏపీ, ఒడిశా అసెంబ్లీలు, ఉప ఎన్నికల కౌంటింగ్ కూడా..

ఎగ్జిట్ పోల్స్ నిజమవుతాయా?

ఇండియా కూటమికి అనుకూలంగా ఫలితాలు వస్తాయా?

ఉదయం 10.30 గంటలకల్లా ట్రెండ్స్ తెలిసే అవకాశం

మధ్యాహ్నానికి ఫలితాల సరళిపై స్పష్టత


సోమవారం హైదరాబాద్‌లోని ఏవీ కాలేజీలో కౌంటింగ్ ఏర్పాట్లు

→ 80 రోజులకుపైగా సాగిన సుదీర్ఘ ఎన్నికల యుద్ధం ఫలితాలేమిటో తేలిపోయే టైం వచ్చేసింది. హోరాహోరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎవరెవరి భవితవ్యం ఏమిటనే దానిపై మరికొన్ని గంటల్లో స్పష్టత రానుంది. దేశవ్యాప్తంగా మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలుకానుంది. తొలుత బ్యాలెట్ ఓట్లు, 8.30 గంటల నుంచి ఈవీఎంలలోని ఓట్ల కౌంటింగ్ చేపట్టనున్నారు. ఉదయం 10.30 గంటలకల్లా ట్రెండ్స్ తెలిసిపోనున్నాయి. మధ్యాహ్నానికల్లా ఫలితాల సరళిపై స్పష్టత వచ్చే అవకాశముంది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి హ్యాట్రిక్ కొట్టి మోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా నెహ్రూ రికార్డును సమం చేస్తారా? లేదంటే కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమి అనూహ్య ఫలితాలు సాధించనుందా? అన్న ప్రశ్నలకు సమాధానం లభించనుంది. - 2,6లో

'డబుల్' ఉత్కంఠ!

- లోక్‌సభ ఓట్ల లెక్కింపుపై ప్రధాన రాజకీయ పక్షాల్లో టెన్షన్
- పదికిపైగా స్థానాల్లో గెలుస్తామంటున్న కాంగ్రెస్
- మోదీ హవాతో మంచి రిజల్ట్స్ ఉంటాయంటున్న కమలనాథులు
- కనీస స్థానాల్లో గెలుపు కోసం కారు పార్టీ ఎదురుచూపులు

2లో

ఉత్కంఠకు నేడే తెర..

ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై నేటి మధ్యాహ్నానికి స్పష్టత

- ఓట్ల లెక్కింపు కోసం 33 చోట్ల 401 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు
- ఉదయం 8 గంటల నుంచే లెక్కింపు ప్రారంభం
- ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు..

- 10లో

నైరుతి వచ్చేసింది



అంచనా కంటే రెండు రోజుల ముందే తెలంగాణలోకి ప్రవేశం

వచ్చే ఐదు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం

బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం.. చల్లబడ్డ వాతావరణం.. తగ్గిన ఉష్ణోగ్రతలు

రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి వానలకు చాన్స్

నైరుతి సీజన్‌లో నెలవారీగా కురవాల్సిన సాధారణ వర్షపాతం ఇది.. (సెం.మీ.లలో)

నెల	వర్షపాతం
జూన్	12.94
జూలై	22.91
ఆగస్టు	21.74
సెప్టెంబర్	16.28
మొత్తం	73.86

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. వాతావరణ శాఖ ఈ నెల 5 నాటికి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని అంచనా వేసింది. కానీ వాతావరణ పరిస్థితులు కలసిరావడంతో సోమవారమే నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లోకి రుతుపవనాలు వచ్చేసినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వచ్చే 4,5 రోజుల్లో రాష్ట్రంలోని చాలా ప్రాంతాలకు రుతు పవనాలు విస్తరించే అవకాశం ఉందన్నారు.

గత ఏడాది కరువు ఛాయలతో..

గతేడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా జూన్ 22న రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఆ తర్వాత కూడా ఆశించిన స్థాయిలో వానలు పడలేదు. వర్షాల మధ్య తీవ్ర అంతరంతో చాలా ప్రాంతాల్లో కరువు ఛాయలు కనిపించాయి. పంటల సాగు, దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది. అంతకుముందు 2022 వానాకాలంలో రుతుపవనాలు జూన్ 8న ప్రవేశించాయి. ఆ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. సాధారణ వర్షపాతం కంటే దాదాపు 48శాతం అధికంగా నమోదయ్యాయి.

రెండు రోజుల పాటు వానలు

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సోమవారం కూడా కొనసాగింది. దాని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ వెల్లడించింది. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. చాలాచోట్ల సాధారణం కంటే 4 నుంచి 7 డిగ్రీల వరకు తక్కువగా నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. వచ్చే 2 రోజులు కూడా ఉష్ణోగ్రతలు తక్కువగానే ఉంటాయని పేర్కొంది.

ఫోన్ ట్యాపింగ్‌పై నేడు విచారణ



సుమోటోగా విచారణకు స్వీకరించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టనుంది. గత ప్రభుత్వ హయాంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాజాశరత్ ఫోన్ కూడా ట్యాపింగ్ చేశారంటూ ఓ పత్రికలో వచ్చిన వార్తను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టాలని నిర్ణయించింది. కేంద్ర హోం శాఖ, సీఎస్, డీజీపీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, ఇంటిలిజెన్స్ అడిషనల్ డీజీపీ, హైదరాబాద్ సీపీలను ప్రతివాదులుగా చేర్చాలని రిజి స్ట్రీని ఆదేశించింది. 'ఫోన్ ట్యాపింగ్, జీపీఎస్ లొకేషన్ నుంచి వివరాలు తెలుసుకొని రేవంత్‌రెడ్డి స్నేహితుడు గాలి అనిల్‌కుమార్ నుంచి రూ.90 లక్షలు, వినయ్‌రెడ్డి నుంచి రూ.1.95 కోట్లు, కోమటిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డి స్నేహితుడు వేణు నుంచి రూ.3 కోట్లు, జి.వినోద్ నుంచి రూ.50 లక్షలు, ఉత్తమ్ మిత్రుల నుంచి రూ.50 లక్షలు.. ఇలా పలువురి నుంచి ఎన్నికల సమ యంలో నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్పీ తిరుపతన్న తన వాంగ్మూలంలో చెప్పారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్ కాజా ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్టు ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు తన నేరాన్ని అంగీకరిస్తూ ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు.' అంటూ వచ్చిన కథనాన్ని హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది.


సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చౌల్లరామారంలో పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళా కూలీలు

సాగు సీజన్ షురూ

- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతాంగం
- ఇప్పటికే రాష్ట్రంలోకి ప్రవేశించిన రుతుపవనాలు
- సీజన్ ప్రారంభమైనట్టేనన్న వ్యవసాయ శాఖ
- 1.34 కోట్ల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా
- అత్యధికంగా 66 లక్షల ఎకరాల్లో వరి, ఈసారి ఏకంగా 60 లక్షల ఎకరాల్లో పత్తి!
- ఎరువులు సిద్ధం:మార్క్‌ఫెడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. దుక్కులు దున్నడం మొదలుపెట్టారు. మరికాస్త వర్షం పడితే చాలు వెంటనే విత్తనాలు చల్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడం, వచ్చే మూడు నాలుగు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో.. వానాకాలం వ్యవసాయ సీజన్ గతం కంటే ముందుగా ప్రారంభమైనట్లేనని వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ వానాకాలం సీజన్‌లో మిగతా 5వ పేజీలో ▶

నకిలీ విత్తనాలతో నష్టపోయాం

పరిహారం ఇచ్చే వరకూ కదిలేది లేదు

కొడంగల్‌లోని విత్తన దుకాణం ఎదుట అన్నదాతల ఆందోళన

- 5లో

ఇదండీ సంగతి


కేవలం పెళ్లి కాలేదు కాబట్టి చిన్నవాడని అనుకుంటున్నార్సార్!!

అసెంబ్లీ పాత భవనం పునరుద్ధరణ

ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్‌కు బాధ్యత.. రూ.40 కోట్లతో పనులు ప్రారంభం

ఒరిజినల్ రూపం తీసుకువచ్చే క్రమంలో అదనపు నిర్మాణాల తొలగింపు

పాత పద్ధతిలో డంగుసున్నం, కరక్కాయ, నల్లబెల్లం, రాతిపొడి మిశ్రమంతోనే పనులు

బడ్జెట్ సమావేశాల నాటికి సిద్ధమయ్యే చాన్స్!.. మండలిగా వినియోగించనున్న ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: శాసనసభ భవన సముదాయంలోని చారిత్రక నిర్మాణాన్ని పునరుద్ధరించే పనులు మొదలయ్యాయి. గతంలో ఆ భవనం శాసనసభగా సేవలు అందించింది. కాలక్రమంలో అది బాగా పాతబడిపోవటంతో కొత్త భవనాన్ని నిర్మించి శాసనసభను అందులోకి మార్చారు. అయితే రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు తీసుకున్న వెంటనే, శాసనసభ ప్రాంగణాన్ని పరిశీలించి.. పురాతన భవనాన్ని పునరుద్ధరించాలని ఆదేశించారు. పునరుద్ధరణ తర్వాత దాన్ని శాసనమండలిగా వినియోగించనున్నారు. ఇండో-పర్షియన్ నిర్మాణాలను పునరుద్ధరించటంలో గుర్తింపు పొందిన ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ (ఏకేటీసీ)కు పునరుద్ధరణ పనులు అప్పగించారు. ఇరానియన్ శైలిలో నిర్మించిన కుతుబ్‌షాహీ సమాధులను ఈ సంస్థే సొంత వ్యయంతో పునరుద్ధరిస్తోంది. ఢిల్లీలోని హుమయూన్ టూంబ్‌ను కూడా పునరుద్ధరించింది. కాగా, 1905లో చారిత్రక నిర్మాణం ఎలా ఉందో అలానే తీర్చిదిద్దనున్నారు. ఇందుకు రూ.40కోట్లు ఖర్చవుతుందని సమాచారం.

పాలరాతి తరహా మెరుపులు

ఈ భవన నిర్మాణ శైలి ప్రత్యేకంగా ఉంటుంది. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ 40వ పుట్టిన రోజుకు గుర్తుగా 1905లో ఈ భవనాన్ని నిర్మించారు. దీన్ని నాటి ప్రభుత్వ ధనంతో కాకుండా ప్రజల నుంచి విరాళాలు వసూలు మిగతా 3వ పేజీలో ▶



సచివాలయం ప్రధాన ద్వారం మూత

- ఆగ్నేయంలో ఉండటంతో వాస్తుదోషమని భావన
- ఇకపై పశ్చిమ గేట్ నుంచి వచ్చి ఈశాన్య గేట్ నుంచి వెళ్లనున్న సీఎం కాన్వాయ్

- 3లో

'డబుల్' ఉత్కంఠ

లోక్‌సభ ఓట్ల లెక్కింపుపై ప్రధాన రాజకీయ పక్షాల్లో ఉత్కంఠ
- పదికిపైగా స్థానాల్లో గెలుస్తామంటున్న కాంగ్రెస్
- మోదీ హవాతో మంచి రిజల్ట్స్ ఉంటాయంటున్న కమలనాథులు
- డబుల్ డిజిట్‌లో సీట్లు తమకంటే తమకే అంటున్న ఇరు పార్టీలు
- కనీస స్థానాల్లో గెలుపు కోసం కారు పార్టీ ఎదురుచూపులు
- జాతీయ స్థాయిలో ఏం జరుగుతుందన్న దానిపైనా తెలంగాణలో ఉత్కంఠ



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ఫలితాల వేళ తెలంగాణలో ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ జరిగిన 22 రోజుల తర్వాత జరుగుతున్న ఓట్ల లెక్కింపు కోసం రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పక్షాలు ఎదురు చూస్తున్నాయి. పోలింగ్ సరళి, ఎగ్జిట్ పోల్స్‌ను బట్టి.. రాష్ట్రంలో పోటీ రెండు జాతీయ పార్టీల మధ్యే జరిగిందన్న అంచనాలు వెలువడ్డాయి. దీంతో కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు కూడా మెజార్టీ సీట్లు తమకంటే తమకేనని.. డబుల్ డిజిట్ స్థానాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కచ్చితంగా పది స్థానాలు గెలుస్తామని కాంగ్రెస్.. పది కంటే ఎక్కువే గెలుస్తామని బీజేపీ నేతలు చెప్తున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ ఎన్ని స్థానాల్లో గెలుస్తామన్న దానిపై కచ్చితమైన లెక్కలు చెప్పకపోయినా.. కనీస స్థానాల్లో విజయం దక్కుతుందని ఆశిస్తోంది. మరోవైపు జాతీయ స్థాయిలో ఏ పార్టీ పరిస్థితి ఎలా ఉండబోతోందన్న దానిపైనా రాష్ట్రంలో చర్చ జరుగుతోంది.

12 సీట్లు కూడా రావొచ్చంటున్న కాంగ్రెస్

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో ఊపు మీదున్న కాంగ్రెస్ పార్టీ.. లోక్‌సభ ఎన్నికల్లోనూ సానుకూల ఫలితాలు వస్తాయనే అంచనాలో ఉంది. కనీసం తొమ్మిది, పది స్థానాల్లో గెలుస్తామన్న ధీమా ఆ పార్టీ నేతల్లో కనిపిస్తోంది. పోలింగ్ సరళిని బట్టి చూస్తే మరో రెండు, మూడు సీట్లు కూడా గెలుస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. దక్షిణ తెలంగాణలోని నల్లగొండ, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌తోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పూర్తి పట్టు సాధించిన వరంగల్, మహబూబాబాద్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు నల్లేరు మీద నడకేనని అంటున్నారు. సికింద్రాబాద్, ఆదిలాబాద్ స్థానాల్లోనూ విజయం సాధిస్తామని లెక్కలు వేస్తున్నారు. చేవెళ్ల, మల్కాజ్‌గిరి, జహీరాబాద్ లోక్‌సభ స్థానాల్లో బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదురైనా.. విజయ తీరం చేరుతామనే అంచనాలో ఉన్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ బలహీనపడటం, బీజేపీకి సంస్థాగత బలం లేకపోవడం, అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఎన్నికలు రావడంతో పెద్దగా ప్రజా వ్యతిరేకత లేకపోవడం, గ్రామీణ స్థాయిలో పార్టీకి ఉన్న పట్టు వంటివి అనుకూలిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మోదీ మేజిక్‌తో బీజేపీదే హవా అంటున్న కమలనాథులు

మోదీ మేజిక్‌తో తెలంగాణలోనూ బీజేపీ హవా కొనసాగుతుందని ఆ పార్టీ ముఖ్య నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లు గెలిచి సత్తా చాటుతామని అంటున్నారు. ఎగ్జిట్ పోల్స్‌లో వెలువడిన అంచనాలను మించి సీట్లు సాధిస్తామని చెబుతున్నారు. గత ఎన్నికల్లో గెలిచిన నాలుగు ఎంపీ సీట్లకు అదనంగా మరో ఆరేడు సీట్లు గెలుస్తామని అంటున్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ పార్టీలే ప్రభావం చూపాయని కమలనాథులు చెబుతున్నారు. కేంద్రంలో మళ్లీ మోదీ ప్రభుత్వం ఏర్పడుతుందనే అంచనాలు తమకు ఉపకరించాయని.. ఈ ఎఫెక్ట్‌తో పలు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ అయ్యాయని అంచనా వేస్తున్నారు.

ఎగ్జాక్ట్ పోల్స్ తమకే అనుకూలమంటూ బీఆర్‌ఎస్

లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్‌తో సంబంధం లేకుండా ఎగ్జాక్ట్ పోల్స్ ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని బీఆర్‌ఎస్ అంటోంది. బీఆర్‌ఎస్ ఒకట్రెండు స్థానాలకు మించి గెలిచే అవకాశం లేదని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నా.. బీఆర్‌ఎస్ మాత్రం అంతకంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎనిమిది లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలో బీఆర్‌ఎస్ ఆధిక్యత కనబర్చిందని.. అదే తరహాలో ఇప్పుడు ఫలితాలు ఉంటాయని అంచనా వేసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల తరహాలో ఇప్పుడు కాంగ్రెస్ అనుకూల ఓటింగ్ జరగలేదని.. అదే సమయంలో బీజేపీ భారీగా ఏమీ పుంజుకోలేదని బీఆర్‌ఎస్ నేతలు చెబుతున్నారు. బీఆర్‌ఎస్‌తో పోలిస్తే కాంగ్రెస్ ఓటు బ్యాంకుకే ఎక్కువగా గండి పడిందని పేర్కొంటున్నారు. అంతేగాకుండా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ 17 రోజుల పాటు చేసిన బస్సుయాత్ర కూడా ప్రభావం చూపిందని.. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఓటేసినవారిలో కొంత మేర తిరిగి అనుకూలంగా మారారని చెబుతున్నారు. కాంగ్రెస్, బీజేపీతో జరిగిన ముక్కోణపు పోటీ బీఆర్‌ఎస్‌కు అక్కడక్కడా అనుకూలిస్తుందనే అంచనా వేస్తున్నారు.

ఢిల్లీ పీఠం ఎవరిదో..?

లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ స్థాయి ఫలితాలు ఎలా ఉంటాయన్నదానిపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ఈసారి కూడా మోదీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ పేర్కొనడం ఓవైపు.. ఎగ్జిట్ పోల్స్ ఫెయిలవుతాయని, ఇండియా కూటమి గెలుస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన కామెంట్స్ మరోవైపు ఉత్కంఠ రేపుతున్నాయి. దేశవ్యాప్తంగా మోదీ ప్రభావం ఎలా ఉంటుంది? ఇండియా కూటమికి ఉన్న సానుకూలత లేంటి? ఏ రాష్ట్రంలో ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయనే అంశాలపై చర్చ జరుగుతోంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఫలితాలు ఎలా ఉంటాయన్నదానిపైనా తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఎడతెగని చర్చ నడుస్తోంది.

ఆ స్థానాలపై మరింత ఆసక్తి

తెలంగాణలోని నాలుగైదు నియోజకవర్గాల్లో ఫలితం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. బీజేపీ నేత, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ తరఫున ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన దానం నాగేందర్ తలపడుతున్న సికింద్రాబాద్ ఫలితంపై అందరి ఫోకస్ ఉంది. పీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరి.. ఎన్డీయే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే కేంద్ర మంత్రి అయ్యే చాన్స్ ఉందంటున్న బండి సంజయ్ బరిలో ఉన్న కరీంనగర్.. బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన నేతలు పోటీ చేస్తున్న జహీరాబాద్, నాగర్‌కర్నూల్, వరంగల్ తదితర స్థానాల్లో ఫలితాలపైనా ఆసక్తి ఉంది.

కౌంటింగ్ వేళ నిర్లక్ష్యం వద్దు: సీఎం

- అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులకు సూచన
- మంత్రులు, ఏఐసీసీ సెక్రటరీలు, ఎంపీ అభ్యర్థులతో జూమ్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: కౌంటింగ్ రోజున ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులు, కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా ఉండవద్దని, పోటాపోటీగా ఉంటాయని భావిస్తున్న చోట్ల మరింత అప్రమత్తంగా ఉండి కౌంటింగ్ పూర్తయ్యేంతవరకు కేంద్రాల్లోనే ఉండాలని స్పష్టం చేశారు. నేడు లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో సోమవారం సీఎం రేవంత్ ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఇంచార్జి మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శులతో జూమ్ ద్వారా సమావేశమయ్యారు. సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి దీపా దాస్‌మున్షీ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా పాల్గొన్నారు.

నిబద్ధత ఉన్న కార్యకర్తలనే ఏజెంట్లుగా

జూమ్ సమావేశంలో భాగంగా రేవంత్ మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నిబద్ధత కల కార్యకర్తలను మాత్రమే ఏజెంట్లుగా పంపాలని, సీనియర్ నేతలను కూడా కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. పోలైన ఓట్లతో 17సీ లిస్ట్ సరిపోలాలని, ఈవీఎంలో లెక్కించిన ఓట్లతో 17సీ లిస్టులోని ఓట్లు సరిపోలకపోతే వెంటనే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అన్ని విషయాలపై అవగాహన ఉన్న వారిని ఏజెంట్లు పంపేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఏజెంట్లంతా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అక్కడే ఉండేలా చూడాలని ఎంపీ అభ్యర్థులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు.

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

ఏజెంట్ల నియామకం, నేతల సన్నద్ధతపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆరా

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు, పార్టీ నేతల సన్నద్ధతపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆరా తీశారు. సోమవారం పలువురు పార్టీ నేతలకు కేసీఆర్ ఫోన్ చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా వ్యవహరించాల్సిన తీరుపై దిశానిర్దేశం చేశారు. లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా పార్టీ తరఫున పోలింగ్ ఏజెంట్ల నియామకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు చివరి రౌండ్ పూర్తయ్యే వరకు ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రంలోనే ఉండేలా చూసుకోవాలన్నారు. చాలా నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ప్రధాన ప్రత్యర్థిగా గట్టి పోటీనిస్తున్నందున ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. లెక్కింపు ప్రారంభానికి ముందే పార్టీ తరఫున నియమితులైన పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి చేరుకునేలా ఎంపీ అభ్యర్థులు సమన్వయం చేసుకోవాలని కేసీఆర్ సూచించారు.

ముగిసిన దశాబ్ది ఉత్సవాలు

మూడు రోజులపాటు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు సోమవారం ముగిశాయి. సిరిసిల్లలో కేటీఆర్ జాతీయ జెండాతోపాటు పార్టీ జెండా ఎగురవేశారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు, శ్రేణులు ఆస్పత్రుల్లో పండ్ల పంపిణీ, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రంలో ప్రజా పాలన లేదు

- ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్నది ప్రజా పాలన కాదని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పాలన అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో విమర్శించారు. నల్లగొండ పట్టణంలోని ఓ మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లో పదిరోజులుగా శవం ఉంటే ప్రభుత్వం నిద్రపోతున్నదా? అని మండిపడ్డారు. గతంలో కూడా నాగార్జునసాగర్‌లో వాటర్ ట్యాంక్‌లో కోతులు పడి చనిపోయినా ప్రభుత్వం పట్టించుకోలేదని, అది మరవకముందే ఇప్పుడు మరో సంఘటన జరిగిందని అన్నారు. సర్కారులో మళ్లీ అదే నిర్లక్ష్యం కనిపిస్తోందని విచారం వ్యక్తం చేశారు. 'కోతల్లేని కరెంటు ఇవ్వలేరు, కోతకొచ్చిన పంటలకు సాగునీరు ఇవ్వలేరు, కనీసం సురక్షిత మంచినీళ్లు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉంది' అని ధ్వజమెత్తారు. ప్రజారోగ్యాన్ని పూర్తిగా గాలికొదిలేసిన గలీజు పాలన నడుస్తోందన్నారు. మిషన్ భగీరథ పథకంతో దశాబ్దాల తాగునీటి తండ్లాటను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీర్చిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కనీసం నీటి ట్యాంకుల నిర్వహణ కూడా చేతకాని అసమర్థ స్థితిలో ఉందన్నారు. జలమే జగతికి మూలమని, కాంగ్రెస్ ప్రభుత్వం తీరు మారకుంటే ప్రజలు తరిమికొడతారని కేటీఆర్ హెచ్చరించారు.

రేవంత్ ఎన్నటికీ ఉద్యమకారుడు కాలేడు

- చరిత్రలో ఉద్యమద్రోహిగా నిలిచిపోతారు
- మరో పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కుట్ర... రేవంత్ పాలనలో తెలంగాణ పదం మాయం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జాతీయజెండా ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నడూ జై తెలంగాణ అనలేదని, ఆయన సీఎం కావొచ్చు కానీ.. ఎన్నటికీ తెలంగాణ ఉద్యమకారుడు కాలేరని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సోమవారం సిద్దిపేటజిల్లా పొన్నాల శివారులోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఉద్యమకారులను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యమకారులపై తుపాకి ఎక్కుపెట్టిన ద్రోహిగా రేవంత్‌రెడ్డి చరిత్రలో మిగిలిపోతారన్నారు. తెలంగాణ కోసం జైళ్లలో, పోలీసుల లాఠీదెబ్బలు, రహదారుల దిగ్బంధాలు, పోరాటాలు, త్యాగాలు చేసిన ఘనత మనకు మాత్రమే ఉందని చెప్పారు. రాష్ట్ర అవతరణ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పత్రిక ప్రకటనల్లో ఎక్కడా జై తెలంగాణ లేదని, బీఆర్‌ఎస్ హయాంలో ఇచ్చిన ప్రకటనల్లో పైభాగంలో జై తెలంగాణ, జైజై తెలంగాణ కచ్చితంగా ఉండేదన్నారు. అప్పట్లో సమైక్యాంధ్ర పాలనలో జై తెలంగాణ మాటను నిషేధించిందని, ఇప్పుడు రేవంత్ పాలనలో తెలంగాణ పదం మాయమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ సోయిని ఖతం చేస్తారని ఆరోపించారు. హైదరాబాద్‌ను మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా చేయాలని కొందరు ఆంధ్ర నాయకులు అంటున్నారని శైలజానాథ్, ఉండవల్లి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. కేసీఆర్ తెలంగాణకు శ్రీరామరక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బీజేపీకి 10 ఎంపీ సీట్లు ఖాయం: బండి సంజయ్



కరీంనగర్ టౌన్: కేంద్రంలో భారీ మెజారిటీతో అధికారంలోకి రావడంతో పాటు తెలంగాణలో 10 ఎంపీ స్థానాలను బీజేపీ గెలుచుకుంటుందని ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో రెండోసారి ఎంపీగా గెలుస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేస్తారని, తనకు కేంద్ర కేబినెట్‌లో అవకాశం ఉంటుందా? ఉండదా? అనేది పార్టీ నిర్ణయిస్తుందన్నారు. ఆయన సోమవారం సాయంత్రం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్ చిరునామా గల్లంతవుతుందని, కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితాలు రావని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వంపై కేసీఆర్ విషం కక్కుతున్నారు

- టీపీసీసీ నేతలు గజ్జెల కాంతం, సతీశ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌కు పరిపాలన సాధ్యం కాదంటూ రాష్ట్ర ప్రభుత్వం మీద మాజీ సీఎం కేసీఆర్ విషాన్ని కక్కుతున్నారని టీపీసీసీ నేతలు గజ్జెల కాంతం, సతీశ్ మాదిగ ధ్వజమెత్తారు. సోమవారం గాంధీభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ, కేసీఆర్ 130 ఏళ్ల కాంగ్రెస్ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. పేదలకు భూములు పంచింది, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. ఏడున్నర కోట్లు అప్పులు చేశామన్న భయం మాజీ సీఎం కేసీఆర్‌లో ఉందని, అందుకే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ఆయనను ఆహ్వానించినా రాలేదని అన్నారు. నిజమైన తెలంగాణ వాది అయితే ఆవిర్భావ వేడుకలకు రావాలి కాదా అని ప్రశ్నించారు. ఆహ్వానించిన అందరికీ కుర్చీలు వేశారని, కేసీఆర్‌కు కూడా కుర్చీ వేశారని వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఘన విజయం ఖాయం

- 94, 95 వద్ద ఆగదు.. 123 స్థానాలకు పైగానే గెలుచుకుంటుంది
- గతంలో వచ్చిన స్థానాల కంటే 10 సీట్లు పెరిగినా ఆశ్చర్యం లేదు
- స్వామి పరిపూర్ణానంద



హిందూపురం: 'ఏపీలో జగన్ కావాలనే వర్గం, జగన్ దిగిపోవాలనే వర్గం మధ్య మాత్రమే ఎన్నికలు జరిగాయి. పార్టీల మధ్య కాదు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ఘన విజయం ఖాయం. నాకున్న సమాచారం మేరకు జగన్ 123 అసెంబ్లీ స్థానాలకు పైగానే గెలుస్తారు' అని హిందూపురం నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి స్వామి పరిపూర్ణానంద అన్నారు. సోమవారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో మీడియాతో మాట్లాడారు. 'ఎగ్జిట్‌పోల్స్‌లో ఎవరు ఎన్ని రకాలుగా చెప్పినా కొన్ని సర్వేలు మాత్రం ప్రజాభీష్టాన్ని ప్రతిబింబించాయి. అందులో 'ఆరా' మస్తాన్ సర్వే ఒకటి. ఆరా చాలా క్రెడిబిలిటీ ఉన్న సంస్థ. గతంలో పలుసార్లు చాలా స్పష్టంగా సర్వే ఫలితాలు ఇచ్చింది. మస్తాన్ ఇంటర్వ్యూలలో చెప్పిన తీరు, విషయాలు చూస్తే.. ఆయన కొంత ఒత్తిడిలో వైఎస్సార్‌సీపీకి తక్కువ సీట్లు చూపించినట్లు కనిపించింది. 94, 95కు పైగా సీట్లు వస్తాయని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తుందనే ధోరణిలో మస్తాన్ చెప్పారు. కానీ వాస్తవ పరిస్థితులను చూస్తే వైఎస్సార్‌సీపీ గెలుపు 94, 95 స్థానాల వద్ద ఆగదు. 123 స్థానాలకు పైగా గెలిచే అవకాశముంది. గతంలో వచ్చిన స్థానాల కంటే పది స్థానాలు పెరిగినా ఆశ్చర్యం లేదు. మహిళా ఓటింగ్ శాతం పెరిగిందని ఆరా సర్వే సంస్థ చెప్పిన తర్వాతే.. మిగిలిన అన్ని సర్వే సంస్థలూ మహిళల ఓట్లే కీలకమన్న అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నాయి. దీన్ని బట్టి ఆరా మస్తాన్ ఎంత నిశితంగా పరిశీలన చేశారో అర్థం చేసుకోవచ్చు. హిందూపురంలో కూడా ఒక కొత్త పరిణామాన్ని చూస్తారు. ఈసారి ప్రత్యామ్నాయానికి ఓటు వేద్దామన్న ధోరణి కనిపించింది. నేను ఏ పార్టీ తరఫున మాట్లాడటం లేదు. ఎవరి పక్షమూ కాదు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా నా అభిప్రాయం వెల్లడిస్తున్నా' అని పరిపూర్ణానంద స్వామి చెప్పారు. కేంద్రంలో బీజేపీ సొంత బలంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు.

సంబరాలకు సిద్ధంకండి

పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధిస్తుందని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఎన్నికల సంఘం మంగళవారం ఓట్ల లెక్కింపు చేపడుతుందని.. వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని, ఉ.10.30 గంటల నుంచి సంబరాలకు సిద్ధంకావాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం సజ్జల మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇండియా టుడే–మై యాక్సిస్ ఎగ్జిట్ పోల్స్ బోగస్ అంటూ కొట్టిపారేశారు. ఆ సంస్థ జనసేన, బీజేపీకి ఎగ్జిట్ పోల్స్‌లో ఇచ్చిన స్థానాలు, ఓట్ల శాతమే అందుకు నిదర్శనమన్నారు. ఆ ఎగ్జిట్ పోల్స్‌లో 21 స్థానాల్లో పోటీచేసిన జనసేనకు ఏడు శాతం ఓట్లు వస్తాయని పేర్కొన్నారని.. ఈ లెక్కన ఒక్కో శాసనసభ స్థానంలో జనసేన అభ్యర్థికి 61 శాతం ఓట్లు రావాల్సి ఉంటుందని.. ఇది సాధ్యమయ్యే పనేనా? అంటూ ప్రశ్నించారు. బీజేపీ వ్యూహంలో భాగంగా దక్షిణాదిలో నాలుగు సీట్లు ఎక్కువ వచ్చినట్లు చూపించే ప్రయత్నంలో ఇది భాగమని చెప్పారు. బీజేపీ కూటమిలో టీడీపీ భాగస్వామి కాకపోయి ఉంటే.. ఇండియా టుడే–యాక్సిస్ మై ఇండియా ఈ రీతిలో ఎగ్జిట్ పోల్స్ వెల్లడించేదే కాదన్నారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు అరెస్టుపై రాష్ట్రంలో అసలు చర్చే జరగలేదని.. దానివల్ల టీడీపీకి ప్రజల్లో సానుభూతి వచ్చిందని ఆ సంస్థ పేర్కొనడం విడ్డూరమన్నారు. టైమ్స్ నౌ, దైనిక్ భాస్కర్ సహా రాష్ట్రంలోని పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉన్న సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధిస్తున్నట్లు తేల్చాయని సజ్జల గుర్తుచేశారు. ఆ సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌లో పేర్కొన్న స్థానాల కంటే వైఎస్సార్‌సీపీ అధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని స్పష్టంచేశారు.

ఎన్నికల్లో పట్టివేతలు @ రూ.200 కోట్లు

- నగదు రూ.99.16 కోట్లు స్వాధీనం
- 92.2 కిలోల బంగారం, 178.6 కిలోల వెండి పట్టివేత
- వెల్లడించిన డీజీపీ కార్యాలయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మార్చి 16 నుంచి జూన్ 3 వరకు నిర్వహించిన సోదాల్లో రూ.200,27,60,036 విలువైన నగదు, మద్యం, మత్తుపదార్థాలు, బంగారం, వెండి, ఇతర విలువైన పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో నగదు రూ.99,16,15,968 పట్టుబడినట్టు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 17 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో 466 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 89 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులలో తనిఖీలు కొనసాగాయి. సోదాల్లో రూ.11,48,00,955 విలువైన మద్యం పట్టుబడింది. రూ.14,52,53,412 విలువైన నార్కోటిక్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. 92.271 కిలోల బంగారం, 178.657 కిలోల వెండి పట్టుబడింది. ఇవికాకుండా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తెచ్చిన మరో రూ.11,91,06,661 విలువైన వస్తువులు ఉన్నాయి. ఇక 7,272 లైసెన్స్ కలిగిన ఆయుధాలను, మరో 20 లైసెన్స్‌లేని ఆయుధాలను జప్తు చేసినట్టు డీజీపీ కార్యాలయం ఆ ప్రకటనలో పేర్కొంది. కాగా, 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన సోదాల్లో నగదు, మద్యం, మత్తుపదార్థాలు, బంగారం, వెండి, ఇతర వస్తువులు కలిపి రూ.46.3 కోట్లు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించింది.



మాసబ్‌ట్యాంక్‌లోని పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

మరికొన్ని గంటలే..

రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్ల విజేతలపై నేడు మధ్యాహ్నానికి స్పష్టత
- ఉదయం 8కి పోస్టల్ బ్యాలెట్, 8.30కు ఈవీఎం ఓట్ల కౌంటింగ్ ప్రారంభం
- రాష్ట్రంలోని 34 ప్రాంతాల్లో మొత్తం 139 కౌంటింగ్ హాళ్లు సిద్ధం
- ఉదయం 10.30 గంటలకల్లా ట్రెండ్స్ తెలిసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏ పార్టీ ఎన్ని లోక్‌సభ సీట్లు సాధిస్తుందన్న ఉత్కంఠకు కొన్ని గంటల్లో తెరపడనుంది. మంగళవారం ఉదయమే ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. ఈ మేరకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ప్రకటించారు. గత నెల 13న రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు సాధారణ ఎన్నికలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరిగిన విషయంతెలిసిందే. కంటోన్మెంట్ సీటు ఓట్లను సైతం మంగళవారం లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. మొత్తంగా 525 మంది అభ్యర్థులు పోటీపడగా.. 2,18,14,025 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 65.67శాతం పోలింగ్ నమోదైంది.

అత్యధికంగా 24 రౌండ్లలో లెక్కింపు..

లోక్‌సభ ఓట్ల లెక్కింపు కోసం రాష్ట్రవ్యాప్తంగా 34 ప్రాంతాల్లో.. మొత్తం 139 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో 120 హాళ్లలో ఈవీఎం ఓట్లు, 19 హాళ్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. ఒక్కో అసెంబ్లీ స్థానానికి ఒక కౌంటింగ్ హాల్ ఉంటుంది. ఒక్కో హాల్‌లో 24 టేబుల్స్ ఉంటాయి. మహేశ్వరం స్థానం పరిధిలో 28 టేబుల్స్ ఏర్పాటు చేయాల్సి రావడంతో రెండు హాళ్లలో ఓట్లను లెక్కించనున్నారు. దీంతో ఈవీఎం ఓట్ల కౌంటింగ్ హాళ్ల సంఖ్య 120కి పెరిగింది. మొత్తం 10వేల మంది సిబ్బంది ఈ ప్రక్రియలో పాల్గొననున్నారు. చొప్పదండి, యాకుత్‌పుర, దేవరకొండ అసెంబ్లీ స్థానాల పరిధిలో పోలైన లోక్‌సభ ఓట్లను అత్యధికంగా 24 రౌండ్లలో లెక్కించనున్నారు. అర్మూరు, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ స్థానాల పరిధిలో పోలైన ఓట్లను అత్యల్పంగా 13 రౌండ్లలో లెక్కిస్తారు. చాలా స్థానాల పరిధిలో 18 నుంచి 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తికానుంది.

రౌండ్ల వారీగా ఫలితాల ప్రకటన..

ఒక్కో టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, ఒక ఏఆర్‌ఓ, ఇద్దరు సహాయకులు, అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లు ఉంటారు. ప్రతి రౌండ్ ఓట్ల లెక్కింపును మైక్రో అబ్జర్వర్ పర్యవేక్షిస్తారు. ఏకకాలంలో అన్ని టేబుళ్లలో నిర్వహించే లెక్కింపును ఒక రౌండ్‌గా పరిగణిస్తారు. అలా రౌండ్ల వారీగా లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతి రౌండ్ వివరాలను కేంద్రం నుంచి వచ్చిన పరిశీలకుడి పరిశీలనకు పంపిస్తారు. పరిశీలకుల ఆమోదం తర్వాత తదుపరి రౌండ్ లెక్కింపును ప్రారంభిస్తారు. అదే సమయంలో ఒక్కో రౌండ్ లెక్కింపు పూర్తయిన కొద్దీ.. స్థానిక ఆర్వో/ఏఆర్వో మీడియా రూమ్ వద్దకు వచ్చి ఫలితాలను ప్రకటిస్తారు. రౌండ్ల వారీగా ఫలితాలపై ఫారం–17సీ మీద కౌంటింగ్ ఏజెంట్ల సంతకాలు తీసుకుంటారు. ప్రతి శాసనసభ స్థానం పరిధిలో ర్యాండమ్‌గా ఐదు పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసి.. ఈవీఎంలలోని ఓట్లను, వీవీ ప్యాట్ స్లిప్పులను సరిపోల్చి చూస్తారు. ఎన్నికల ఫలితాలను ప్రదర్శించడానికి 78 ప్రాంతాల్లో స్క్రీన్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎన్నికల సంఘం అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే రానిస్తారు.

నేడు మద్యం షాపులు బంద్

లోక్‌సభ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం రోజున తెలంగాణలో మద్యం దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ఇక ఫలితాలు వచ్చిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పోలీసులు ముందుగా అనుమతిస్తే ర్యాలీలు చేసుకోవచ్చు.

ఉదయం 10.30 కల్లా ఆధిక్యతపై స్పష్టత!

మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. 2.18లక్షల పోస్టల్ బ్యాలెట్లు పోలైన నేపథ్యంలో లెక్కింపునకు ఎక్కువే సమయం పట్టే అవకాశం ఉంది. ఇక 8.30 గంటలకు ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఉదయం 10.30 గంటల కల్లా చాలా లోక్‌సభ స్థానాల్లో ఎవరు ఆధిక్యతలో ఉన్నారనేది తేలే అవకాశం ఉంది. మధ్యాహ్నం 12.30 గంటలకల్లా విజయావకాశాలపై స్పష్టత వచ్చే చాన్స్ ఉంది. పోటీ ఎక్కువగా ఉన్న స్థానాల్లో మాత్రం ఆద్యంతం ఉత్కంఠగా కౌంటింగ్ కొనసాగనుంది. కౌంటింగ్, ఫలితాల సరళిని https://results.eci.gov.in ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

ఫలితాల సరళి నిరంతర పర్యవేక్షణ

పార్టీ నేతలకు, కౌంటింగ్ ఏజెంట్లకు బీజేపీ దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఫలితాల సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు ఎక్కడైనా ఇబ్బందులుంటే లీగల్ టీమ్‌లు వెంటనే రంగంలోకి దిగేలా బీజేపీ చర్యలు చేపడుతోంది. మంగళవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలోని వార్ రూమ్ నుంచి ఈ మేరకు పర్యవేక్షించనుంది. టీవీ చానెళ్లలో వెలువడే ఫలితాలను వీక్షించేలా పార్టీ కార్యాలయంలో పెద్దటీవీలు, బిగ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. 17 ఎంపీ సీట్లలో కౌంటింగ్ ఏజెంట్లకు సోమవారం సాయంత్రానికల్లా శిక్షణ పూర్తిచేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా వ్యవహరించాల్సిన తీరు, ఏయే సందర్భాల్లో అభ్యంతరాలు లేవనెత్తాలి వంటి వాటిపై ఏజెంట్లకు అవగాహన కల్పించారు. ప్రత్యర్థి పార్టీల వారు గొడవలకు దిగినా, పోలింగ్ సిబ్బంది ఏకపక్షంగా వ్యవహరించినా, మార్గదర్శకాలను ఉల్లంఘించినా వెంటనే లీగల్‌సెల్ స్పందించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే, 50 మందితో 'ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ'ని ఏర్పాటు చేశారు. ఈ వ్యవహారాలన్నింటినీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పర్యవేక్షించనున్నారు. ఆయనతో పాటు రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ సోమవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో వార్‌రూం, లీగల్‌సెల్, అధికార ప్రతినిధులతో సమావేశమై ఆయా అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో పార్టీ నాయకులు కాసం వెంకటేశ్వర్లు యాదవ్, బంగారు శ్రుతి, ఎస్.ప్రకాష్‌రెడ్డి, వైఎల్ శ్రీనివాస్, ఎన్వీ సుభాష్, పోరెడ్డి కిషోర్‌రెడ్డి, జె.సంగప్ప, రచనారెడ్డి, టి.వీరేందర్‌గౌడ్, జి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.




బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కె.లక్ష్మణ్. చిత్రంలో బంగారు శ్రుతి తదితరులు

క్లుప్తంగా...

ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఎంత వరకు వచ్చింది?

- 'జీవో 111'పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: జీవో 111 స్థానంలో తీసుకొచ్చిన జీవో 69పై ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఎంత వరకు వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ పరిరక్షణ నిమిత్తం 1996లో 84 గ్రామాల పరిధిలో తీసుకొచ్చిన జీవో 111ను అమలు చేసేలా ఆదేశాలివ్వాలంటూ పర్యావరణవేత్త ప్రొ.జీవానందరెడ్డి 2007లో, ఆ తర్వాత ఇదే అంశంపై మరికొందరు దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణలోగా కమిటీ నివేదిక ఎప్పటిలోగా పూర్తవుతుందో చెప్పాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

ఫుడ్ సేఫ్టీ సిబ్బంది తక్కువ ఎందుకున్నారు?

- గత ప్రభుత్వంలో నియామకాల్లేవా?
- అధికారులను నిలదీసిన మంత్రి దామోదర
- కోడ్ పూర్తికాగానే ఆకస్మిక తనిఖీలు చేస్తానని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఫుడ్ సేఫ్టీ ఆఫీసులో తక్కువ సిబ్బంది ఎందుకున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను నిలదీశారు. సోమవారం ఆయన కోఠిలో టీజీ ఎంఎస్ ఐడీసీ, ఎయిడ్స్ కంట్రోల్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఫుడ్ సేఫ్టీలో నియమకాలు జరగలేదా? ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారు? అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. నకిలీ మందులు, కల్తీ ఆహారాన్ని అరికట్టకపోతే జనాల ప్రాణాలకు ముప్పేనని మంత్రి వ్యాఖ్యానించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని కొన్ని ఆసుపత్రుల్లో మందుల కొరత ఎందుకు ఉంది? ఆసుపత్రులు, ఫార్మసీలు సకాలంలో ఇండెంట్ ఇస్తున్నాయా? లేదా? సరఫరాలోనూ సమస్య ఉన్నదా? అంటూ దామోదర రాజనర్సింహ అధికారులను ప్రశ్నించారు. ఆసుపత్రులకు సకాలంలో మందులు లభించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను గుర్తించి వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ పూర్తికాగానే ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలు, హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేస్తానన్నారు. ఈ సమీక్షలో ఉన్నతాధికారులు క్రిస్టినా చొంగ్తూ, కర్ణన్ పాల్గొన్నారు.



సచివాలయం ఈశాన్య గేట్

సచివాలయం ప్రధాన ద్వారం మూత

- ఆగ్నేయంలో ఉండటంతో వాస్తుదోషమని భావన
- ఇకపై పశ్చిమ గేట్ నుంచి వచ్చి ఈశాన్య గేట్ నుంచి వెళ్లనున్న సీఎం కాన్వాయ్
- 9వ అంతస్తుకు సీఎం చాంబర్ మార్పు వార్తలను తోసిపుచ్చిన సీఎంఓ


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయం ప్రధాన ద్వారాన్ని ఇకపై వినియోగించరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రధాన ద్వారం ఆగ్నేయం వైపు ఉండటంతో వాస్తు దోషమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు సచివాలయం ప్రధాన ద్వారం గుండానే రాకపోకలు జరిపేవారు. అయితే ఇకపై సీఎం కాన్వాయ్ పశ్చిమ ద్వారం నుంచి లోపలికి ప్రవేశించాలని, ఈశాన్య గేట్ నుంచి బయటకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, సీఎం కార్యాలయాన్ని ఆరో అంతస్తు నుంచి తొమ్మిదో అంతస్తుకు మార్పు చేయాలని నిర్ణయించారని వచ్చిన వార్తలను మాత్రం సీఎం కార్యాలయ వర్గాలు తోసిపుచ్చాయి. ఇప్పటి వరకు అలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించాయి. అయితే, 9వ అంతస్తులో కొత్తగా సీఎం చాంబర్‌ను ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించినట్టు చర్చ జరుగుతోంది.

250 మంది కళాకారులు 3,500 కళాఖండాలు

7 నుంచి 9వ వరకు హైదరాబాద్ వేదికగా ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్

- సింగపూర్, ఢిల్లీ, ముంబై, గుర్గావ్‌కు చెందిన గ్యాలరీలు
- 40 నగరాలకు చెందిన కళాకారుల ప్రదర్శనలు..
- లైవ్ మ్యూజిక్, ఫ్యాషన్ షోలు అదనపు ఆకర్షణ..


సాక్షి, హైదరాబాద్: దేశంలోనే ప్రతిష్టాత్మకమైన 'ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్'కు హైదరాబాద్ వేదికగా మారనుంది. ప్రతీ ఏటా ముంబై, బెంగళూరు వేదికగా నిర్వహించే ఈ అద్భుత కళా ప్రదర్శనను ఈ ఏడాది నగరంలో ఏర్పాటు చేసేందుకు సర్వం సన్నద్ధం చేశారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నగరంలోని మెహదీపట్నం కింగ్స్ కోహినూర్ (క్రౌన్) కన్వెన్షన్ వేదికగా కళా ప్రదర్శన జరగనుందని ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్ వ్యవస్థాపకులు రాజేంద్ర తెలిపారు. ఈ ఆర్ట్ ఫెస్ట్‌లో సింగపూర్‌తో పాటు దేశంలోని ఢిల్లీ, బెంగళూరు, గుర్గావ్, హైదరాబాద్, బరోడా, నాగ్‌పూర్, కలకత్తా వంటి 40 నగరాలకు చెంది న 250 మంది ఆర్టిస్టులు వారి ఆర్ట్ వర్క్స్‌ను ప్రదర్శించనున్నారని వెల్లడించారు. ఇందులోని 3,500 కళా ఖండాల ప్రదర్శన కోసం ప్రత్యేకంగా 30 గ్యాలరీలు, 100 ఎయిర్ కండిషన్డ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నామని వివరించారు.



భారతీయ కళా పరిణామక్రమాన్ని తెలిపే..

2011 నుంచి ప్రతిష్టాత్మకంగా 25 ఎడిషన్‌లను నిర్వహించిన 'ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్'ను ఈ సారి చరిత్రాత్మక, సాంస్కృతిక వైభవమున్న నగరంలో 'చార్మినార్ సిటీ'మిషన్(బృందం)తో ఏర్పాటు చేస్తున్నామని రాజేంద్ర పేర్కొన్నారు. ప్రతీ రోజు సాయంత్రం 3:30 నుంచి 5 గంటల వరకు ఫ్యాషన్ షోలు, లైవ్ మ్యూజిక్ వంటి కార్యక్రమాలు అలరించనున్నాయి. రాత్రి 6 నుంచి 7:15 వరకు 12 వేల సంవత్సరాల భారతీయ కళా పరిణామ క్రమాన్ని, వైభవాన్ని తెలిపే చలన చిత్రం 'ది ఎటర్నల్ కాన్వాస్'ను ప్రదర్శించనున్నారు. ఈ ఫెస్టివల్‌లో అతిపెద్ద పెయింటింగ్ మార్కెట్‌కు శ్రీకారం చుట్టనున్నారు. ప్రఖ్యాత కళాకారులు జోగెన్ చౌదరి, మను పరేఖ్, కిషన్ ఖన్నా, శక్తి బర్మన్, సీమా కోహ్లీ, పరేష్ మైతీ, యూసుఫ్ అరక్కల్, ఎస్‌జీ వాసుదేవ్, అంజోలీ మీనన్, అతుల్ దోడియా, లక్ష్మా గౌడ్, టీ.వైకుంఠం, లక్ష్మణ్ ఏలే, అశోక్ భౌమిక్, లాలూ ప్రసాద్ షా, గురుదాస్ షెనాయ్ తదితరుల కళాఖండాలు ప్రదర్శనలో ఉంటాయి. ఆర్ట్స్‌బ్రీజ్ ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, స్నేహ ఆర్ట్స్ వంటి సంస్థలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

చిలుకూరు బాలాజీ సన్నిధిలో గవర్నర్



గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు వాక్ పుస్తకాన్ని అందజేస్తున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: తెలంగాణ, జార్ఖండ్, పాండిచ్చేరి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సోమవారం ఉదయం చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు రంగరాజన్ ఆయకు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూలమాలతో సన్మానించి, స్వామివారి పట్టు వస్త్రం, ఆశీర్వచనం అందించారు. ఆధ్యాత్మిక క్షేత్రాల గురించి తెలియజేసే వాక్ పుస్తకాన్ని అందజేశారు. చిలుకూరు బాలాజీ విశిష్టతను వివరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో సుందరేశ్వరస్వామికి గవర్నర్ రాధాకృష్ణన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిమ్స్ వైద్యులు భేష్: గవర్నర్

- ఇటీవల ఆదివాసీ యువకుడి గుండెల్లో గుచ్చుకున్న బాణం తొలగింపు
- డైరెక్టర్, వైద్యులకు గవర్నర్ సత్కారం



నిమ్స్ కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్వరరావును సత్కరిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్

లక్డీకాపూల్: ఇటీవల ఆదివాసీ యువకుడి గుండెల్లోకి చొచ్చుకుపోయిన బాణం తొలగించి ప్రాణాలు కాపాడిన నిమ్స్ కార్డియోథొరాసిక్ వైద్య బృందాన్ని గవర్నర్ రాధాకృష్ణన్ ఘనంగా సత్కరించారు. ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ ప్రాంతంలో గోతి కోయ తెగకు చెందిన పదిహేడేళ్ల సోది నందకు ప్రమాదశాత్తూ బాణం గుండెలోకి దూసుకుపోయింది. ప్రాణాపాయ స్థితిలో నిమ్స్ హాస్పిటల్‌కు వచ్చిన అతనికి అతి తక్కువ సమయంలోనే వైద్యులు శస్త్ర చికిత్స చేసి ప్రాణం పోశారు. విషయం తెలుసుకున్న గవర్నర్.. నిమ్స్ వైద్య బృందంతో రాజ్‌భవన్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నిమ్స్ ఉపకులపతి ప్రొఫెసర్ నగరి బీరప్ప, కార్డియోథొరాసిక్ హెచ్‌ఓడీ అమరేశ్వరరావు మాలెంపాటి, సీనియర్ డాక్టర్ గోపాల్ తదితర వైద్య బృందాన్ని పిలిపించుకొని సన్మానించారు. ఈ సందర్భంగా నిమ్స్ వైద్యుల సేవలను గవర్నర్ ప్రశంసించారు.

నిమ్స్‌పై ఉన్న నమ్మకాన్ని రుజువు చేశారు: ఎక్స్ లో సీఎం కితాబు

ఆదివాసీ యువకుడి శస్త్ర చికిత్స విజయవంతంపై ముఖ్యమంత్రి, నిమ్స్ చైర్మన్ రేవంత్ రెడ్డి ఎక్స్ లో స్పందించారు. 'గిరిజన యువకుడు సోది నంద ఛాతీ భాగంలో దిగిన బాణాన్ని చాకచక్యంగా, అత్యంత నిపుణతతో తొలగించి నిండు ప్రాణం కాపాడిన నిమ్స్ వైద్య బృందానికి నా అభినందనలు. సామాన్య ప్రజల్లో నిమ్స్ దవాఖాన పట్ల ఉన్న నమ్మకాన్ని మరోసారి రుజువు చేశారు. భవిష్యత్‌లో నిమ్స్ మరింత విస్తృతంగా వైద్య సేవలు అందించి, పేదల దేవాలయంగా పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను'' అని సీఎం పేర్కొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, హైదరాబాద్: వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కోరింది. భూపరిపాలన ప్రధాన కమిషనర్, వీఆర్ఏల సమస్యలపై ఏర్పాటైన కమిటీ చైర్మన్ నవీన్ మిత్తల్‌ను ట్రెసా ప్రతినిధులు సోమవారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మిత్తల్‌ను కలిసిన వారిలో ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షుడు కె.నిరంజన్ రావు తదితరులున్నారు.

అసెంబ్లీ పాత భవనం పునరుద్ధరణ

▶ మొదటి పేజీ తరువాయి

చేసి నిర్మించారు. అందుకే అప్పట్లో దీన్ని పబ్లిక్ హాలు, టౌన్‌హాలుగా పిలిచేవారు. ప్రజల సందర్శనకు వీలుగా ఉన్న పబ్లిక్ గార్డెన్‌ను ఆనుకుని దీన్ని నిర్మించటం విశేషం. రాజస్తాన్ రాజమహళ్లలోని కొన్ని నమూనాలు, కొన్ని పర్షియన్ నమూనాలు మేళవించి అద్భుత శైలిలో దీన్ని నిర్మించారు. డంగు సున్నం, కరక్కాయ, నల్లబెల్లం, గుడ్డు సొన, రాతి పొడిలతో కూడిన సంప్రదాయ మిశ్రమాన్ని దీనికి వినియోగించారు. కానీ పాలరాతితో నిర్మించిన తరహాలో కనిపించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వారసత్వ కట్టడం అయినందున కూల్చివేసేందుకు వీల్లేకపోవడంతో పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అదనపు నిర్మాణాల తొలగింపు: ఈ భవనానికి గతంలోనే పలుమార్లు మరమ్మతులు చేశారు. అవసరానికి తగ్గట్టుగా అదనపు నిర్మాణాలు కూడా జోడించారు. పైకప్పు లోపలి వైపు అదనపు చేరికలు ఉన్నాయి. దీంతో ఇప్పుడు ఒరిజినల్ రూపురేఖలు వచ్చేలా ఆయా అదనపు చేరికలను తొలగించే పనులు కొనసాగుతున్నాయి. చారిత్రక వారసత్వ భవనాల పునరుద్ధరణలో సిమెంటును వినియోగించరు. అప్పట్లో ఏ మిశ్రమంతో భవనాన్ని నిర్మించారో అదే తరహా మిశ్రమంతోనే పనులు కొనసాగిస్తారు. ఇప్పుడు శాసనసభ భవన పునరుద్ధరణలోనూ అదే పద్ధతి అవలంభించనున్నారు. ఈ పను లు చాలా జాగ్రత్తగా చేయాల్సి ఉన్నందున పునరుద్ధరణకు చాలా సమయం పడుతుందని అంటున్నారు. అయితే వచ్చే బడ్జెట్ సమావేశాల నాటికి దాన్ని సిద్ధం చేసే లక్ష్యంతో పనులు నిర్వహిస్తున్నట్టు తెలిసింది.

తదుపరి జూబ్లీహాలు పునరుద్ధరణ: దీని తర్వాత జూబ్లీహాలును కూడా పునరుద్ధరించనున్నారు. 1913లో ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పబ్లిక్‌గార్డెన్‌లో అంతర్భాగంగా దీన్ని నిర్మించారు. నిజాం ప్రభుత్వంలోని ప్రజాపనుల విభాగం ఇంజినీర్ అయిన అలీ నవాబ్ జంగ్ బహదూర్ ఆధ్వర్యంలో దీని నిర్మాణం కొనసాగింది. ఇందులో నిజాం సమావేశాలు, సదస్సులు నిర్వహించేవారు. ఆయన పట్టాభిషేకం జరిగి 25 సంవత్సరాలు పూర్తయినప్పుడు ఇదే భవనంలో రజతోత్సవాలను నిర్వహించారు. అప్పటి నుంచే దీనిపేరు జూబ్లీహాలుగా మారింది. అప్పుడు ఇందులో ఏడో నిజాం రాజచిహ్నంతో బంగారు పూత పూసిన సింహాసనాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. ఆయన దానిపై కూర్చుని ప్రజలను కలిసేవారంటారు. తర్వాత ఆ సింహాసనాన్ని పురానా హవేలీ మ్యూజియంకు తరలించారు. ఇప్పటికీ ఆ సింహాసనం ఉన్న వేదిక అక్కడ ఉంది. కాగా జూబ్లీ హాలు చాలా ఏళ్లపాటు నగరంలో సమావేశాలకు ఉపయోపడింది. తర్వాత కొంతకాలం దాన్ని శాసనమండలిగా కూడా వినియోగించారు.

టాలీవుడ్ నటి హేమ అరెస్టు

- రేవ్ పార్టీ కేసులో అదుపులోకి తీసుకున్న బెంగళూరు పోలీసులు
- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్
- డ్రగ్స్ సరఫరా చేసిన బెంగళూరు వాసి ఇమార్ షరీఫ్ కూడా అరెస్టు



ఆస్పత్రిలో బురఖాలో నటి హేమ

బనశంకరి (బెంగళూరు): బెంగళూరు నగరంలో గత నెల 18వ తేదీన జరిగిన రేవ్ పార్టీ కేసులో తెలుగు నటి హేమను సోమవారం బెంగళూరు సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం స్థానిక కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. పార్టీ జరుగుతున్న ఫామ్‌హౌస్‌పై దాడి చేసిన పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అలాగే వివిధ రకాల మాదక ద్రవ్యాలను కూడా స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. కాగా పార్టీలో సుమారు 150 మంది పాల్గొనగా, డ్రగ్స్ తీసుకున్నారనే అనుమానంతో రక్త పరీక్షలు చేయించారు. ఇందులో నటి హేమతో పాటు 86 మంది డ్రగ్స్ సేవించినట్లుగా తేలిందని పోలీసులు ప్రకటించడంతో కలకలం రేగింది. అయితే హేమ తాను ఆ పార్టీలో పాల్గొనలేదని, డ్రగ్స్ సేవించలేదని పేర్కొంటూ వీడియోలు విడుదల చేసి తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే విచారణకు హాజరు కావాలంటూ రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. అయితే రెండుసార్లూ అనారోగ్యం పేరిట ఆమె హాజరుకాలేదు. దీంతో ఈ నెల 3న రావాలంటూ మూడోసారి నోటీసులు జారీ చేశారు.

బురఖా ధరించి: హేమ సోమవారం సీసీబీ ఎదుట హాజరయ్యారు. అయితే ఆమె తనను ఎవరూ గుర్తు పట్టకుండా బురఖా ధరించి వచ్చారు. కాగా అధికారులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో హేమను అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. సాయంత్రం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచారు. ఇలావుండగా రేవ్ పార్టీకి డ్రగ్స్ సరఫరా చేసిన బెంగళూరు డీజే హళ్లి నివాసి ఇమార్ షరీఫ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఇతని వద్ద 40 ఎండీఎంఎ డ్రగ్స్ మాత్రలు లభించాయని తెలిపారు.

లిక్కర్ స్కామ్ నిందితుల ఆస్తులు జప్తు చేయండి

ప్రత్యేక కోర్టును కోరిన ఈడీ

- ఈ ఆర్థిక నేరంలో కవిత భాగస్వామ్యం రూ.292.8 కోట్లు అని ఆరోపణ
- తదుపరి విచారణ జూలై 3కు వాయిదా
- సీబీఐ కేసులో 7 వరకు జ్యుడీషియల్ కస్టడీ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన ఆర్థిక నేరంలో బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భాగస్వామ్యం రూ.292.8 కోట్లు అని ఈడీ ఆరోపించింది. ఈ కుంభకోణంలో మొత్తంగా రూ.1,100 కోట్ల ఆర్థిక నేరం జరిగిందని పేర్కొంది. కవితతో పాటు ఇతర నిందితుల ఆస్తులు జప్తు చేయాలని, కోర్టు విచారణ ప్రారంభించాలని కోరింది. కవిత, చరణ్‌ప్రీత్ సింగ్, ప్రిన్స్‌కుమార్, అరవింద్ సింగ్, దామోదర్ శర్మలపై ఈడీ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీటును సోమవారం రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా పరిగణనలోకి తీసుకున్నారు. దీనిపై విచారణను జూలై 3కు వాయిదా వేశారు. అప్పటివరకు కవిత తీహార్ జైలులో ఉండనున్నారు. మరోవైపు లిక్కర్ స్కామ్‌పై సీబీఐ కేసు విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి.. కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 7 వరకు పొడిగించారు. 7న సీబీఐ చార్జిషీటు దాఖలు చేయనుంది. ఉదయం ఈడీ కేసు విచారణకు కవిత భౌతికంగా హాజరుకాగా మధ్యాహ్న సీబీఐ కేసుకు వర్చువల్‌గా హాజరయ్యారు. ఈడీ కేసులో కోర్టుకు హాజరైన సమయంలో కవిత జై తెలంగాణ, జై భారత్ నినాదాలు చేశారు. భర్త, పిల్లల్ని కలవడానికి కోర్టు అనుమతించడంతో వారితో కవిత కొద్దిసేపు మాట్లాడారు.

కవితపై అభియోగాలు

ఈడీ అనుబంధ చార్జిషీటులో నిందితులపై తీవ్రమైన అభియోగాలు మోపింది. కుంభకోణంలో కవిత కీలక వ్యక్తి (కింగ్‌పిన్)గా ఉన్నారని ఆరోపించింది. సౌత్‌గ్రూపు ప్రతినిధులతో కలిసి ఆప్ నేతలతో కుమ్మక్కయ్యారని తెలిపింది. కవిత డిజిటల్ ఆధారాలు ధ్వంసం చేశారని, ఫోన్లలోని సమాచారం డిలీట్ చేశారని పేర్కొంది. ఫార్మాట్ చేసిన ఫోన్లకు సంబంధించి ఎలాంటి సమాచారం కవిత చెప్పలేదని ఆరోపించింది. సాక్షులను ప్రభావితం చేసే చర్యలకు కూడా కవిత పాల్పడ్డారని పేర్కొంది. కాగా కవిత గతంలో ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను కూడా ఈడీ అనుబంధ చార్జిషీటులో పొందు పరిచింది.

గొర్రెల కేసు... సీబీఐకి!

గతంలోనే కోరిన కాగ్?

- అక్రమాలు తేలడంతో అప్పట్లోనే కేంద్రానికి లేఖ
- కేంద్రం ఇబ్బంది పెడుతోందంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిన అధికారులు
- ఆ ఇద్దరి అరెస్టుతో పశుసంవర్ధక శాఖలో కలకలం
- ఏసీబీ టార్గెట్ ఇంకా ఎవరోనని ఆందోళన



సాక్షి, హైదరాబాద్: సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం అమలులో తీవ్ర అవకతవకలు జరిగాయని, అక్రమాలను విచారించి ఈ పథకంలో జరిగిన కుంభకోణాన్ని వెలికితీసే బాధ్యతను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి అప్పగించాలని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గతంలోనే కోరినట్టు తెలిసింది. ప్రతి యేటా నిర్వహించే ఆడిట్‌లో భాగంగా ఈ అవకతవకలను గుర్తించిన కాగ్ ఈ మేరకు రెండుసార్లు లేఖ రాసిందనే విషయం తాజా గా వెలుగులోకి వచ్చింది. ఈ కుంభకోణంలో పాత్ర ఉందంటూ పశుసంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్. ఎస్. రాంచందర్, అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఓఎస్డీ కళ్యాణ్‌కుమార్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అరెస్టు చేయడంతో ఆ శాఖ వర్గాల్లో కాగ్ రాసిన లేఖలపై చర్చ జరుగుతోంది. ఈ పథకం కోసం జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) రెండో విడత రుణాన్ని నిలిపివేసేందుకు కూడా ఈ లేఖలే కారణమని ఆ శాఖ ఉన్నతస్థాయి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

కాగ్ లేఖతోనే మలి విడత రుణానికి బ్రేక్

వాస్తవానికి, సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేసేందుకు ఎన్‌సీడీసీ రుణంపైనే తెలంగాణ ప్రభుత్వం ఆధారపడింది. ఇందుకోసం తొలివిడతలో భాగంగా రూ.4వేల కోట్ల రుణాన్ని ఎన్‌సీడీసీ మంజూరు చేసింది. ఈ రుణంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులు కలిపి సుమారు 4లక్షల మంది లబ్ధిదారులకు ఇప్పటివరకు గొర్రెలను పంపిణీ చేశారు. గొర్రెల పంపిణీలో ఏం జరిగిందనేది పక్కన పెడితే ఎన్‌సీడీసీ నుంచి తీసుకున్న రుణాన్ని మాత్రం తెలంగాణ ప్రభుత్వం ఠంచన్‌గా చెల్లించింది. ప్రతి వాయిదాను వడ్డీతో సహా ఎన్‌సీడీసీ ఖాతాలో జమ చేసింది. ఈ భరోసాతోనే రెండో విడత పంపిణీ కోసం కూడా తెలంగాణ ప్రభుత్వం ఎన్‌సీడీసీని రూ.4వేల కోట్ల రుణం అడిగింది. ఇందుకు ఎన్‌సీడీసీ బోర్డు కూడా ఆమోదం తెలిపింది. మరో 15 రోజుల్లో ఈ మేరకు నిధులు తెలంగాణ ఖజానాకు జమ అవుతాయనే అభిప్రాయానికి కూడా ప్రభుత్వం వచ్చింది. కానీ, మరోమారు బోర్డు అనుమతి తీసుకోవాలంటూ మెలిక పెట్టింది ఎన్‌సీడీసీ. ఇలా మెలిక పెట్టడానికి సీబీఐ దర్యాప్తు కోరుతూ కాగ్ రాసిన లేఖే కారణమని ఇప్పుడు ఆ శాఖ అధికారులు చెపుతున్నారు. తదుపరి బోర్డు సమావేశంలో మళ్లీ అనుమతి తీసుకునేందుకు అప్పటి ఉన్నతాధికారులు రెండు, మూడు రోజులు ఢిల్లీలోనే మకాం వేసి ఎన్‌సీడీసీ అధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో అసలు విషయాన్ని మరుగున పెట్టిన పశుసంవర్ధక శాఖ అధికారులు అప్పటి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించారని తెలుస్తోంది.

అమిత్ షా బృందం అడ్డుకుందంటూ చెప్పుకొచ్చి..

2024 ఎన్నికలకు ఏడాది ముందు రుణం ఇచ్చి గొర్రెలు పంపిణీ చేస్తే సదరు లబ్ధిదారులు బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తారన్న భావనతోనే కేంద్ర సహకార శాఖ బాధ్యతలు నిర్వహిస్తోన్న అమిత్‌షా బృందం ఈ నిధులు రాకుండా అడ్డుకుంటోందని అప్పటి ప్రభుత్వ పెద్దలకు పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు నివేదించినట్టు తెలుస్తోంది. ఇక పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారి రాంచందర్, మాజీ మంత్రి ఓఎస్డీ కళ్యాణ్ అరెస్టుతో ఆ శాఖలో కలకలం రేపింది. అరెస్టు చేసిన ఇద్దరినీ ఏసీబీ కస్టడీకి అడుగుతుందన్న సమాచారంతో ఎప్పుడు ఏసీబీ అధికారులు ఎవరి వద్దకు వస్తారోనని అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

'క్రూయిజ్'కు పెరుగుతున్న క్రేజ్

గడిచిన ఆర్థిక సంవత్సరంలో 4.70 లక్షల మంది పర్యటన

- 2019-20తో పోలిస్తే దేశీయంగా 85 శాతం పెరిగిన ప్రయాణాలు
- రూ.45వేల కోట్లతో వివిధ రకాల క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి ప్రణాళిక
- విశాఖలో రూ.100 కోట్లతో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్

సాక్షి, అమరావతి: పర్యాటకుల్లో రోజురోజుకు పెరుగుతున్న ఆసక్తి, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రణాళికల ఫలితంగా క్రూయిజ్ పర్యాటకం దేశంలో ఆల్‌టైమ్ రికార్డులు సృష్టిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 4.70 లక్షల మంది క్రూయిజ్‌లో ప్రయాణించడమే ఇందుకు నిదర్శనం. ఇది కరోనా ముందు 2019–20లో 4.20 లక్షల మంది క్రూయిజ్ ఫుట్‌ఫాల్‌తో పోలిస్తే గణనీయమైన పెరుగుదలను చూపిస్తోంది. ఈ క్రమంలోనే 2041 నాటికి 40లక్షల మందిని క్రూయిజ్‌లో పర్యటించేలా కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రణాళిక రూపొందిస్తోంది. లోతైన సముద్ర క్రూయిజ్‌లు, తీర ప్రాంత క్రూయిజ్‌లు, రివర్ క్రూయిజ్‌లు, యాచ్ క్రూయిజ్‌లలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం రూ.45 వేల కోట్ల పెట్టుబడితో రివర్ క్రూయిజ్ టూరిజంను అభివృద్ధి చేయాలని చూస్తోంది. ప్రస్తుతం కోర్డెలియా, కోస్టా క్రూయిజ్ వంటి క్రూయిజ్ లైన్లు ప్రస్తుతం అరేబియా సముద్రంలో దేశీయ విహార యాత్రలను నిర్వహిస్తున్నాయి.



క్రూయిజ్ పర్యటనలు ఇలా..


ముంబై, గోవా, న్యూ మంగళూరు, కొచ్చి, విశాఖ పోర్టులకు అంతర్జాతీయ క్రూయిజ్ షిప్‌ల రాక పెరుగుతోంది. దేశీయ క్రూయిజ్‌లు ముంబై–గోవా, ముంబై–డయ్యూ, ముంబై–కొచ్చి, ముంబై–లక్ష ద్వీప్, ముంబై–హై సీస్, చెన్నై–వైజాగ్ మార్గాల్లో అందుబాటులో ఉన్నాయి. నది క్రూయిజ్ టూరిజం కోసం తొమ్మిది జలమార్గాలను గుర్తించారు. వాటిలో గంగనదిపై వారణాసి–హల్దియా, బ్రహ్మపుత్రలోని ధుబ్రి–సాదియా మార్గాలున్నాయి. గుజరాత్ తీర్థయాత్ర పర్యటనలు, పశ్చిమ తీర సాంస్కృతిక, సుందరమైన పర్యటనలు, సౌత్ కోస్ట్ ఆయుర్వేద వెల్నెస్ పర్యటనలు, తూర్పు తీర వారసత్వ పర్యటనలు వంటి థీమ్–ఆధారిత పర్యాటక సర్క్యూట్‌లను అభివృద్ధి చేయాలని కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ యోచిస్తోంది.

దేశీయంగా పెరుగుదల..

గడిచిన ఆర్థిక సంవత్సరంలో 80 శాతం మంది దేశీయంగానే ప్రయాణించారు. ఇందులో 29వేల మంది మాత్రమే అంతర్జాతీయ పర్యటనలు చేశారు. ఇప్పటికీ అంతర్జాతీయ క్రూయిజ్ టూరిజం ఇంకా కోవిడ్‌కు మునుపటి స్థాయిలో చేరకపోవడంతో విదేశీ పర్యాటకులు తక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే దేశీయ పర్యాటకులలో క్రూయిజ్‌లకు ఆదరణ పెరుగుతోంది. 2019–20లో 50 శాతం దేశీయ, 50 శాతం అంతర్జాతీయ క్రూయిజ్ పర్యటనలు నమోదయ్యాయి. వాటితో పోలిస్తే తాజాగా దేశీయ పర్యాటకులు దాదాపు 85శాతం పెరిగారు. సింగపూర్ వంటి దేశాలలో క్రూయిజ్ పరిశ్రమకు భారతీయ పర్యాటకులు కీలకంగా ఉన్నారు. అయితే అబుదాబి కూడా భారతీయ పర్యాటకులను తన క్రూయిజ్ ఆఫర్‌లకు ఆకర్షించడానికి ప్రయత్నిస్తోంది.

అందుబాటులో విశాఖ అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్..

దక్షిణ భారతదేశంలో కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే దేశీయ, అంతర్జాతీయ క్రూయిజ్ టూరిజం అందుబాటులో ఉంది. విశాఖలో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పర్యాటకులకు విశేష సేవలందిస్తోంది. సుమారు రూ.100 కోట్లతో నిర్మించిన విశాఖ అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ సుమారు 2వేల మంది ప్రయాణికులకుపైగా సామర్థ్యం ఉన్న నౌకలకు వసతి కల్పిస్తోంది.



కింద పడటమే వైఫల్యం కాదు. పడ్డచోటే నిలిచిపోతేనే అది వైఫల్యం అవుతుంది.
– సోక్రటీస్

సాక్షి
మంగళవారం, 4 జూన్ 2024

సంబరాలు... సవాళ్ళు...

దేశవ్యాప్తంగా ఎన్నికలు ముగిశాయి. ఇక, కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. వరుసగా మూడోసారి కూడా మోదీ సారథ్యంలోని బీజేపీయే పగ్గాలు చేపడుతుందని అంచనాలు వినిపిస్తున్న వేళ ఓట్ల లెక్కింపుతో అసలైన ఫలితాలు ఇవాళ రానున్నాయి. అయితే, ఎన్నికలు ముగింపు దశలో ఉండగానే జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) గత శుక్రవారం వెలువరించిన దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) గణాంకాలు ఆసక్తికరమైన చర్చ రేపుతున్నాయి. జీడీపీ వృద్ధి దాదాపు 7.8 శాతం ఉండవచ్చని తొలుత అందరూ భావించినా, వాస్తవంలో అది 8.2 శాతానికి చేరింది. అంతకు ముందు ఏడాది (2022–23) సాధించిన 7 శాతంతో పోలిస్తే ఇది గణనీయమైన మెరుగుదల. పైగా, వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాలుగా మన ఆర్థిక వ్యవస్థ 7 శాతం, అంతకు మించి పెరిగిందన్న మాట. దీంతో ప్రపంచంలో అత్యంత వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తోందని నిపుణుల మాట. ఇది విశేషమే... కాదనలేం. కానీ, ఈ ఏడాది కూడా ఇదే పురోగతిని నిలబెట్టుకోవడానికి ఏం చేయాలి? అలాగే, దేశాన్ని వేధిస్తున్న నిరుద్యోగం తదితర సమస్యల మాటేమిటి?

నిజానికి, దేశ వాస్తవిక జీడీపీ ఇటు అధికారిక, అటు ప్రైవేట్ అంచనాలన్నిటినీ అధిగమించి ఆశ్చర్యపరిచింది. కోవిడ్ దెబ్బ కొట్టిన తర్వాత, అందులోనూ ప్రపంచమంతా నత్తనడక నడుస్తున్నప్పుడు వృద్ధిలో ఈ రకమైన గణాంకాలు వచ్చాయంటే, అనేక ఆటుపోట్లను భారతీయ గృహవ్యవస్థ, వ్యాపారాలు తట్టుకొని దృఢంగా నిలబడడమే కారణం. అలాగే, ప్రధానంగా నిర్మాణ, వస్తూత్పత్తి రంగాల పుణ్యమా అని కూడా గడచిన 2023–24 ఆర్థిక సంవత్సరంలో మన ఆర్థికవ్యవస్థ అనుకున్న దాని కన్నా మెరుగైన వృద్ధిని సాధించినట్టు విశ్లేషణ. ప్రైవేట్ పెట్టుబడులు వేగం పుంజుకోకున్నా, ప్రాథమిక వసతి సౌకర్యాల కల్పనలో ప్రభుత్వ పెట్టుబడులు ఆర్థిక వృద్ధిలో సింహభాగానికి కారణమని చెబుతున్నారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక ప్రైవేట్ పెట్టుబడులు పెరుగుతాయని భావిస్తున్నారు. మొత్తం మీద వచ్చే సర్కారుకు ఈ అంకెలు, ఇటీవల భారతీయ రిజర్వ్ బ్యాంక్ బదలాయించిన మిగులు నిధుల లాంటివి కొంత సౌకర్యాన్నిచ్చే అంశాలు. అక్కడ నుంచి సమతూకం నిండిన ఆర్థికాభివృద్ధి వైపు ఎలా నడిపించాలన్నది కీలకమైన అంశం.

గమనిస్తే... ఆర్థిక వృద్ధిలో మెరుగుదల ఏడేళ్ళ పాటు నిదానంగా సాగింది. దానికి కొత్త ఊపునిచ్చేందుకు మోదీ సర్కార్ ఏటా రైల్వే, రోడ్లు, పట్టణ రవాణా, వాటర్‌వర్క్స్, రక్షణ ఉత్పత్తులపై ఏటా రూ. 11 లక్షల కోట్లు ఖర్చు పెడుతోంది. దీనివల్ల లక్షలాది ఉద్యోగాలు రావాలి. కానీ, వాస్తవ పరిస్థితులు మాత్రం కొంత భిన్నంగా ఉన్నాయి. దేశంలో నిరుద్యోగ సమస్య ఇప్పటికీ ప్రబలంగా కనిపిస్తోంది. దానికి తోడు ఆర్థిక వ్యత్యాసం, ద్రవ్యోల్బణం సామాన్యుల్ని వేధిస్తున్నాయి. ఉదాహరణకు భవన నిర్మాణ రంగంలో నూటికి 80 మంది ఉండే నైపుణ్య రహిత కార్మికుల సగటు రోజు వారీ కూలీ సైతం అనేక రాష్ట్రాల్లో జాతీయ సగటు కూలీ కన్నా తక్కువే ఉందని విశ్లేషణలు తేల్చాయి. మహిళా శ్రామికుల కూలీలైతే మరీ కనాకష్టం. ప్రభుత్వ లెక్కల ప్రకారమే... మన దేశ తలసరి ఆదాయం, మరో మాటలో నికర జాతీయ ఆదాయం 2014–15లో రూ.72,805 ఉండేది. అది కేవలం 3.83 శాతం వార్షిక చక్రవృద్ధి రేటుతో 2022–23లో రూ.98,374కు చేరింది. వాస్తవిక ద్రవ్యోల్బణ ప్రభావాన్ని గనక పరిగణనలోకి తీసుకుంటే, ఈ వృద్ధి రేటు అసలైతే ఇంకా తక్కువే ఉంటుంది. అది అటుంచితే – విద్య, ఆరోగ్యం, ప్రజారవాణా, కాలుష్యం వగైరా అంశాల్లో సగటు జనాభా జీవన ప్రమాణాలు మెరుగుపడలేదు. సరికదా ఇంకా దిగజారాయి. అదే విషాదం.

ఇంకా చెప్పాలంటే, ప్రపంచంలోని అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరణ అనే నినాదంలో గర్వించడానికి తగిన అంశాలు కొన్నే కనిపిస్తున్నాయి. ప్రపంచ దేశాల తలసరి ఆదాయం జాబితాలో 2018లో మనం 153వ స్థానంలో ఉండేవాళ్ళం. అప్పటితో పోలిస్తే, మనం మెరుగుపడి 144వ స్థానానికి చేరాం. కానీ, ఇప్పటికీ మనం అడుగునే ఉన్నామని మర్చిపోలేం. సాధించిన కొద్దిపాటి మెరుగుదల దేశ ప్రజల్ని దారిద్ర్యం నుంచి బయటపడేయడానికి చాలదు. నాణ్యమైన జీవన ప్రమాణాలకూ సరిపోదు. 2029 నాటికి గానీ మన దేశం తలసరి ఆదాయంలో ఉజ్బెకిస్తాన్, పాపువా న్యూ గినియా, అంగోలా లాంటి దేశాలను అధిగమించలేదని గుర్తించాలి. కాబట్టి, కొత్త ప్రభుత్వానికి తన ముందున్న సవాలేమిటో స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

భారత జనాభాలో ఇప్పటికీ అధిక శాతం గ్రామీణ, బస్తీ ప్రాంతాల్లోనే నివసిస్తోంది. వారి కష్టనష్టాలు, జీవన పరిస్థితులు స్టాక్ మార్కెట్ల విజృంభణను చూసి చప్పట్లు కొట్టే వర్గాలకు పెద్దగా తెలియవు. తాజా ఎన్నికల దయతో నిరుద్యోగం, ఆర్థిక అసమతౌల్యం, ద్రవ్యోల్బణం లాంటివి మళ్ళీ కనీసం చర్చకైనా వచ్చాయి. 'గ్రామీణ ప్రాంతాల్లోని దురవస్థల' ప్రస్తావన జరిగింది. అందుకే, గడచిన నాలుగు త్రైమాసికాలను కలిపి తీసిన ఆఖరి లెక్కలు పైకి సంతోషం రేపుతున్నా, క్షేత్రస్థాయిలోని ఇలాంటి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేయకపోతే కష్టమే. ఇప్పటి లెక్కలతో తృప్తిపడి, ఉదాసీనంగా వ్యవహరించకుండా సవాళ్ళను ఎదుర్కొంటూ ముందడుగు వేయాలి. అందుకోసం ఆర్థిక విధానాలను నిర్ణయించే ప్రభుత్వ యంత్రాంగం దీర్ఘకాలిక దృష్టితో వ్యవహరించాలి. ప్రజల నైపుణ్యాలను పెంచి, వారిని మరింత ఉద్యోగార్హులుగా తీర్చిదిద్దడంపై దృష్టిపెట్టాలి. అందుకు తగ్గ సంస్కరణలు చేపట్టాలి. అప్పుడే ఏటికేడు ఈ వృద్ధి అంకెలు స్థిరపడతాయి. సామాన్యుల జీవితాలు నిలబడతాయి. లేదంటే 'వికసిత భారత్' మాటల్లో, లెక్కల్లోనే మిగిలిపోతుంది.

మండేలా పార్టీకి ఎందుకీ ఎదురుదెబ్బ?

విశ్లేషణ



టంకశాల అశోక్

1994లో స్థాపితమైనప్పటినుంచీ 30 ఏళ్లపాటు అప్రతిహతంగా దక్షిణాఫ్రికాను ఏలిన 'ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్'(ఏఎన్‌సీ) తొలిసారి పూర్తి మెజారిటీని అందుకోలేకపోయింది. ఇప్పటికీ అత్యధిక సీట్లు గెలుచుకున్న పార్టీ అదే అయినప్పటికీ(400కు 159) క్రమంగా తగ్గుతున్న ఓట్ల శాతం ప్రజల్లో పెరుగుతున్న నిరాదరణకు రుజువు. వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ నెల్సన్ మండేలా నెలకొల్పిన ఈ పార్టీ ప్రభుత్వాల అధినేతల అవినీతి, అసమర్థ పాలన ప్రజల్లో అసంతృప్తికి కారణమయ్యాయి. ఒకప్పుడు మొత్తం ఆఫ్రికాలోనే మొదటి స్థానంలో ఉండిన ఆర్థిక వ్యవస్థ నైజీరియా తర్వాత రెండవ స్థానానికి పడిపోయింది. ఈ పరిణామాలను గమనించినప్పుడు ఈరోజున ఏఎన్‌సీ తన మెజారిటీని కోల్పోవటంలో ఆశ్చర్యం కనిపించదు.

దక్షిణాఫ్రికాలో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) పార్టీ ఓటమి ఆశ్చర్యంగా తోచవచ్చుగానీ, ముందుగా ఊహించనిదేమీ కాదు. శ్వేతజాతీయుల వర్ణ వివక్ష వ్యవస్థ (అపార్థీడ్) మీద సుదీర్ఘ ఉద్యమం విజయవంతమైన తర్వాత 1994లో అధికారానికి వచ్చిన ఏఎన్‌సీ, తన వైఫల్యాల కారణంగా ప్రజాదరణను కోల్పోవటం ఒక దశాబ్ద కాలమైనా తిరగకముందే మొదలైంది. ఇప్పటికి సరిగ్గా 16 సంవత్సరాల క్రితం 2003 జూన్‌లో నేను దక్షిణాఫ్రికాను సందర్శించే నాటికే ఈ అసంతృప్తి వివిధ వర్గాలలో కనిపించసాగింది. కానీ ఆ తర్వాత మరొక అయిదేళ్లు జీవించి ఉండిన నెల్సన్ మండేలా గానీ, తన ఉద్యమ సహచరులుగా పోరాటాలు జరిపి ప్రభుత్వ నాయకత్వాలలోకి వచ్చినవారు గానీ పరిస్థితిని సరిదిద్దలేదు. దేశాధ్యక్ష పదవిని 1999లో వదులుకున్న మండేలా ఏకాంత జీవితంలోకి వెళ్ళిపోగా, ప్రభుత్వాలను నడిపినవారు అవినీతి మార్గాలను పట్టారు. ఉద్యమ కాలంలో హామీ ఇచ్చిన జనరంజక పాలనను, సంస్కరణలను కాగితాలపై తప్ప ఆచరణలో చూపించింది స్వల్పం. అందుకు ప్రజల నిరసన కనిపించటం కొంతకాలం క్రితమే మొదలుకాగా, ఇపుడది 30 ఏళ్ళలో మొదటిసారిగా అసలు మెజారిటీయే కోల్పోయింది.

దక్షిణాఫ్రికా గురించి బయటికి బాగా ప్రచారం పొందిన సమస్య వర్ణ వివక్ష. అటు వివక్ష తెల్లవారు పాలించిన ఇతర ఆఫ్రికన్ వలస దేశాలలో కూడా ఉండగా, ఇక్కడ దానిని చట్టబద్ధంగా వ్యవస్థీకృతం చేశారు. అదే సమయంలో దేశంలోని భూమి, గనులు, పరిశ్రమలు, వ్యాపారాలు, ఉద్యోగాల వంటి సమస్త వనరులు తెల్లవారి అధీనంలోనే ఉండిపోయాయి. అటువంటి స్థితిలో, అపార్థీడ్ వ్యవస్థ రద్దయినప్పటికీ ఈ వనరులపై తెల్లవారి ఆధిపత్యం పోయి, ఆర్థిక సంస్కరణలు జరిగి, నల్లవారికి తమ జనాభాకు తగినట్లు అవకాశాలు లభిస్తే తప్ప పేదరికం పోదు, అపార్థీడ్ వ్యతిరేక పోరాటానికి నిజమైన సార్థకత లభించదు. వాస్తవానికి ఉద్యమకాలంలో ఈ లక్ష్యాలన్నీ ఏఎన్‌సీ అజెండాలో ఉన్నవే. ఆ పార్టీపై తమ సొంత ఆలోచనలతో పాటు వివిధ ప్రజాస్వామిక దేశాలు, సోషలిస్టు దేశాల అభ్యుదయ భావాల ప్రభావాలు ఉండేవి. కానీ అధికారానికి వచ్చిన అనంతరం ఎక్కువ కాలం గడవకుండానే పరిస్థితులు మరొకవిధంగా మారసాగాయి. నిర్మొహమాటంగా చెప్పుకోవాలంటే మండేలా స్వయంగా అధ్యక్షునిగా ఉండిన 1994–99 కాలంలో సైతం ప్రభుత్వ బాధ్యులలో పలువురి తీరు మారటం, మండేలా తన మెతకదనం వల్ల నిస్సహాయునిగా మిగిలిపోవటం జరిగింది. ఆయన తన శేష జీవితం అయిదేళ్లు ఒంటరిగా గడపటం అందువల్లనేనన్నది కొందరి పరిశీలకుల అభిప్రాయం.

అపార్థీడ్ వ్యవస్థ రద్దయిన మాట నిజం. అందువల్ల నల్లవారు స్వేచ్ఛగా తిరగగలగటంతో పాటు బీచ్‌లు, క్లబ్బులు, హోటళ్ల వంటి ప్రదేశాలలోకి వారి ప్రవేశంపై నిషేధాలు తొలగిపోయాయి. పోలీస్ నిర్బంధాలు లేని కొత్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నల్లవారి పిల్లలకు విద్యావకాశాలు లభించటం మొదలైంది. కొంత వైద్యం, చదువులతో పాటు ఉద్యోగాలలో రిజర్వేషన్లు వచ్చాయి. నల్లవారికి తెల్లవారు తమ వ్యాపారాలలో చిన్న చిన్న ఉద్యోగాలు ఇవ్వసాగారు. అపార్థీడ్‌తో పాటు తమ రాజ్యం పోయిందనీ, అందువల్ల కొన్ని రాజీలు తప్పవనీ వారికి అర్థమైంది. నల్లవారు కూడా కొద్దిస్థాయిలో వ్యాపారాలు మొదలుపెట్టారు. పెద్ద హోదా గల ప్రభుత్వ ఉద్యోగాలు కొన్నింటిని తెల్లవారికి, నల్లవారికి మధ్య రొటేట్ చేయసాగారు. ఈ మార్పులు నల్లవారిలో ఒక చిన్న మధ్యతరగతి సృష్టికి అవకాశం కల్పించాయి. ఈ విధంగా వారికి క్రమంగా ఆత్మవిశ్వాసం రావటం మొదలైంది. అపార్థీడ్ రద్దువల్ల ఇప్పుడు రాజకీయాధికారమంతా తమదే కావటం సరేసరి.



ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ సారథి, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా

ఇటువంటివి సానుకూల పరిణామాలని వేరే చెప్పనక్కరలేదు. కానీ ఇక్కడ గమనించవలసిన ముఖ్యమైన విషయాలు మూడున్నాయి. ఒకటి, యథాతథంగా నల్లవారి సమస్యలతో, వారి జనాభాతో పోల్చినపుడు ఈ మార్పులు చాలా స్వల్పం. రెండవది, మొదట చెప్పుకున్నట్లు ఆర్థిక వనరులన్నీ, ఆర్థిక కార్యకలాపాలన్నీ అత్యధిక భాగం తెల్లవారి అధీనంలోనే ఉండిపోవటం. ఉదాహరణకు నేనక్కడ ఉండినపుడు చూసిన అధికారిక ప్రచురణల ప్రకారం, గ్రామీణ భూములు నల్లవారి నుంచి తెల్లవారి చేతిలోకి అపార్థీడ్ రద్దయిన తర్వాత సైతం ఇంకా బదిలీ అవుతూనే ఉన్నాయి. నల్లవారికి తమ వ్యవసాయం కోసం ఎటువంటి సహాయాలు లభించకపోవటం, గ్రామాలలో ఇతరత్రా ఉపాధి అవకాశాలు సన్నగిల్లటంతో వారు భూములు అమ్ముకొని, పొట్ట పోసుకునేందుకు నగరాలకు తరలిపోతున్నారు. నేను స్టెల్లెన్ బాష్ అనే నగరం వద్ద గల ఒక షాంటీ టౌన్‌ను చూశాను. నగరంలో నల్లవారు రోజంతా పనులు చేసుకుని సాయంత్రానికి వెళ్లిపోయి ఉండే ప్రాంతాన్ని షాంటీ టౌన్ అంటారు. అక్కడ అన్ని నివాసాలు, ఆ ప్రాంతం చుట్టు కట్టే కంచె అన్నీ ఇనుప రేకులతోనే. కొన్ని వేలమంది నివసిస్తారు. స్టెల్లెన్ బాష్‌కు దక్షిణాఫ్రికాలో గాంధీజీ కార్యకలాపాలతోనూ సంబంధం ఉండేది. ఇటువంటి టౌన్‌షిప్‌లు గతంలోనూ ఉండగా, అపార్థీడ్ ముగిసిన తర్వాత ఇంకా పెరుగుతున్నాయి. నల్లవారు అధికారానికి వచ్చిన తర్వాత, టూరిజానికి ప్రోత్సాహం పేరిట ఒక్కొక్క కంపెనీకి వేలకు వేల హెక్టార్లు స్థానిక తెల్లవారికి, విదేశీయులకు దీర్ఘకాలపు లీజుకు అప్పగించారు. ఆ భూములన్నీ స్థానిక తెగలవి. వారు భూములు కోల్పోయి ఈ కంపెనీలలో కూలీలుగా పని చేస్తున్నారు. ఇది నా ప్రత్యక్షానుభవం. దేశానికి ఉత్తర ప్రాంతాలలో విస్తారమైన భూములు ఆ విధంగా నల్లవారికి నష్టమయ్యాయి. నేను చూసిన ఉదాహరణ ఇండియాకు చెందిన విజయ్ మాల్యా 20,000 ఎకరాలకు పైగా భూమిలో నిర్వహిస్తున్న మబులా లాడ్జ్ రిసార్ట్. దాని వివరాలు అనేకం ఉన్నా ఇక్కడ అప్రస్తుతం.

ఇక మూడవ విషయం, ప్రభుత్వ నేతల అదుపులేని అవినీతి. అది చాలదన్నట్లు అసమర్థ పాలన. వీరంతా ఉద్యమ కాలపు అగ్రనేతలే. రెండు ఉదాహరణలు చూడండి. స్వయంగా మండేలా భార్య విన్నీ మండేలా ఉద్యమకాలం నుంచే అవినీతికి పాల్పడి, అపార్థీడ్ రద్దు తర్వాత జైలుకు వెళ్లింది. ప్రస్తుత అధ్యక్షుడు సిరిల్ రామఫోసాకు ముందు అధ్యక్షుడిగా ఉండిన జేకబ్ జుమా కూడా జైలుకు వెళ్లినవాడే. ఇతర పదవులలో ఉన్నవారి సంఖ్యకు లెక్కలేదు. ప్రస్తుత అధ్యక్షుడు వ్యక్తిగతంగా అవినీతిపరుడు కాకున్నా ఆ సమస్యను అరికట్టలేదు. మొత్తంమీద వీరందరి అసమర్థ పాలన కారణంగా విద్యుత్, మంచి నీళ్లు, విద్యావైద్యాలు, తీవ్ర నిరుద్యోగం, వివిధ పౌర సదుపాయాల సమస్యలు పెరగటం మొదలైంది. ఆర్థిక వ్యవస్థ కూడా బలహీనపడుతుండటం వల్ల, ఒకప్పుడు మొత్తం ఆఫ్రికాలోనే మొదటి స్థానంలో ఉండిన వ్యవస్థ కొన్నేళ్ల క్రితమే నైజీరియా తర్వాత రెండవ స్థానానికి పడిపోయింది. ఈ పరిణామ క్రమాలను గమనించినపుడు ఈరోజున ఏఎన్‌సీ తన మెజారిటీని కోల్పోవటంలో ఆశ్చర్యం కనిపించదు.

ఏఎన్‌సీ ఓట్లశాతం 57.5 (2019) నుంచి 40.2కు తగ్గింది. 400 బలం గల నేషనల్ అసెంబ్లీలో సీట్ల సంఖ్య 230 నుంచి 159కు పడిపోయింది. కనుక ఇతరులతో పొత్తు తప్పదు. రెండవ స్థానంలో గల డెమోక్రటిక్ అలయన్స్ తెల్లవారిది. అందువల్ల విధానాల సమస్య ఉంటుంది. మూడవ స్థానంలో గల మాజీ అధ్యక్షుడు జేకబ్ జుమా(ఏఎన్‌సీ తరఫున దేశాధ్యక్షుడిగా ఉండిన జుమా మద్దతుతో కొత్త పార్టీ ఏర్పడింది) అవినీతి కేసులో జైలుకు వెళ్లినవాడు. అనగా, ప్రభుత్వ ఏర్పాటుకు పొత్తులు కూడా సమస్య కానున్నాయన్నమాట. అంతిమంగా తేలుతున్నది దక్షిణాఫ్రికా ప్రజల సమస్యలు సమీప భవిష్యత్తులో తీరేవి కాదని!

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆగదు పోరు



ఎగ్జిట్ ఫలితాలు దిగ్భ్రమకు గురిచేస్తున్నాయి. నమ్మశక్యంగా లేవు. మనం గొంతెత్తాం, పోరాడాం. మా నాన్నలాంటి సీనియర్ సిటిజన్ మనుమల్ని చైతన్యవంతం చేయడానికి రోడ్ల మీద తిరిగాడు. రాహుల్ గాంధీ, ఆయన సహచరులు వేలాది మైళ్లు నడిచారు. ఏమైనా ఈ స్ఫూర్తి కొనసాగుతుంది.

– రాఖీ త్రిపాఠీ, అసోసియేట్ ప్రొఫెసర్

ఆధునికత బాటలో...



తన పాఠశాల పాఠ్య పుస్తకాల్లోంచి చాలా వరకు పాలస్తీనా మ్యాపును సౌదీ అరేబియా తొలగించిందని వార్త. అలాగే జిహాద్ మీద ఉన్న హింసాత్మక వివరణలను కూడా! చూస్తుంటే సౌదీ అరేబియా, యూఏఈ పాలకులు తమ మతంలోంచి ఛాందస వాదాన్ని ఏరివేయడంలో కృతనిశ్చయులుగా ఉన్నట్టున్నారు.

– అరవింద్ విర్‌మానీ, ఆర్థికవేత్త

తింటే చాలదు, వండాలి!



ఇండియాలోని ప్యాకేజ్డ్ ఫుడ్ ప్రపంచంలోనే అత్యంత నాసిరకమైనది. ప్రపంచవ్యాప్తంగా నాలుగు లక్షల ఉత్పత్తుల మీద చేసిన ఒక అధ్యయనం ఇండియాలోని ప్యాకెజ్డ్ ఫుడ్‌లో అధిక మొత్తంలో చక్కెర, ఉప్పు ఉన్నట్టు కనుగొంది. ఇంట్లో తినడం, ఇంట్లో వండుకుని తినడం – రెండూ వేర్వేరని గమనించండి.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

ప్రాక్టికల్ మనుషులు



ప్రతి సంవత్సరం నేను సోకాల్డ్ మూడో ప్రపంచ దేశాలు, ప్రత్యేకించి అర్మేనియా, ఉక్రెయిన్‌లో ఒక్క నెలైనా గడుపుతాను. వాళ్లు ఎప్పుడూ యుద్ధభయంలో ఉంటారు. అయినప్పటికీ వాళ్లు ఈ పాశ్చాత్య దేశాల్లో ప్రతిదానికీ మూలుగుతూవుండే వాళ్లలా ప్రవర్తించరు.

– కాన్‌స్టంటిన్ కిసిన్, సెటైరిస్ట్

సరైన నిర్ణయం



జూన్ 4 మధ్యాహ్నం నుంచి పశ్చిమ బెంగాల్‌లో హింస మొదలవుతుంది. ఇది తెలిసే ఎన్నికల కమిషన్ 40 వేలకు పైగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలను రప్పిస్తోంది. విపరీతమైనదే, కానీ సరైన నిర్ణయం.

– సందీపన్ దేవ్, కాలమిస్ట్

ఇన్ బాక్స్

చరిత్రకు వెలుగులు అద్దాలి!

'తెలంగాణ' అంటేనే అలుపులేని పోరాట రూపం. అనేక పోరాటాలు, త్యాగాలు, మార్పులు ఇక్కడి ప్రజలకు కొత్తేం కాదు. వాటన్నింటి ప్రతిఫలమే నేడు తెలంగాణలో స్వపరిపాలన. 76 ఏళ్ల క్రితం తెలంగాణ స్వతంత్ర రాజ్యం. దానిలో దోపిడీ, పీడనలు తీవ్రమవటంతో తెలంగాణ మొత్తం అగ్ని కెరటమై ఎగిసిపడింది. ఆనాడు రావి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో తొలుత సత్యాగ్రహం జరిగింది. ఆపై అది సాయుధ రైతాంగ పోరాట రూపంగా మారి నిజాం నిర్బంధ పాలనకు బీటలువారేలా చేసింది. వేలాదిగా దున్నే వాళ్లకు భూమిని దగ్గర చేసింది.



హైదరాబాద్ రాష్ట్రం ఏర్పాటైన వెంటనే ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ 'ముల్కీ ఉద్యమం' షురు అయ్యింది. ఆపై 1956లో హైదరాబాద్ స్టేట్ ఆంధ్రప్రదేశ్‌లో విలీనం తర్వాత కూడా తెలంగాణ ఆశలు, ఆకాంక్షలు పూర్తిగా నెరవేరనే లేదు. ఫలితంగా మలి తెలంగాణ ఉద్యమం నడిచింది. ప్రజా ఉద్యమాల కారణంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో అందరికీ సమాన అవకాశాలు, సంపద పంపిణీలో తరతమ భేదం లేని పారదర్శక విధానం అత్యవసరం. లేకపోతే మళ్లీ ప్రజలు ఉద్యమిస్తారని తెలంగాణ చరిత్ర హెచ్చరిస్తోంది.

అప్పట్లోనే రావి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో 'హరిజన సేవక్ సంఘ్' ఏర్పడింది. వందకు పైగా పాఠశాలలు, రెండు వసతి గృహాలు నడిపారు. తనకు వారసత్వంగా సంక్రమించిన భూమిలో 20 ఎకరాలను మాత్రమే ఉంచుకుని మిగిలిన ఐదు వందల ఎకరాలను 'భూదాన ఉద్యమా'నికి ముందే రావి నారాయణరెడ్డి పేదలకు పంచారు. మూడు సార్లు 'ఆంధ్రమహాసభ'కు అధ్యక్షునిగా వ్యవహరించిన నారాయణరెడ్డి ఆధ్వర్యంలోనే సాయుధ పోరాటానికి పిలుపు వెలువడింది. 1952 తొలి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి దేశంలోనే అత్యధిక మెజారిటీతో విజయం సాధించారాయన. చట్టసభల్లో ప్రజావాణిని ప్రతిభావంతంగా వినిపించారు. వయసు మీద పడగానే స్వచ్ఛందంగా రాజకీయాల నుండి విరమించుకున్నారు. వారసులు ఎవరికీ పదవుల కోసం సిఫారసు చేయలేదు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో తెలంగాణ మట్టిమనుషుల కోసం చివరివరకు పరితపించిన రావి నారాయణరెడ్డి స్ఫూర్తిని ఈ తరాలకు అందించాల్సిన అవసరం ఉంది. ఆయన జీవితం, సాయుధ రైతాంగ పోరాట అంశాలను పాఠ్యాంశాలుగా చేర్చి తెలంగాణ చరిత్రకు కొత్త వెలుగులు అద్దాల్సిన అవశ్యకత ఉంది.

– రావి ప్రతిభారెడ్డి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ సభ్యులు
(నేడు రావి నారాయణరెడ్డి జయంతి)

స్నేహం... బాలు చేవ్రాలు!

సందర్భం



డా॥ పైడిపాల

తెలుగు జాతి గర్వించదగిన గాన గంధర్వునిగా, బహుముఖ కళా పారీణునిగా బాలును ఎరగని వాళ్ళుండరు. ఆయన నేపథ్య గాయకునిగా, అద్వితీయునిగా రాణించిన కాలంలో సాటి గాయకుల కెవరికీ అవకాశాలు రాకుండా చేస్తున్నారని కొందరు అసూయాపరులు ఆరోపణలు చేసినా, 'పాడుతా తీయగా' కార్యక్రమ వీక్షకులను బాలు వ్యక్తిత్వం, హృదయ సంస్కారం ముగ్ధుల్ని చేశాయి. ఆయన అంతరంగం స్నేహ పారిజాతమని ఆ పరిమళాల్ని శ్వాసించి పరవశించిన ఆత్మీయ మిత్రులకు మాత్రమే తెలుసు.

మాంగల్య బంధం కంటే స్నేహబంధం పటిష్ఠమైనదనీ, అది ఎప్పటికీ ఇగిరిపోని గంధం అనీ బాలు అభిప్రాయపడేవారు. స్నేహం చేసేముందు అవతలి వ్యక్తి గురించి పూర్తిగా తెలుసుకోవాలనీ, స్నేహం కుదిరిన తర్వాత మిత్రునిలో లోపాలు బయటపడినా వాటిని సరిదిద్దాలి కాని ఏకంగా ఆ బంధాన్ని తెంచుకోకూడదనీ బాలు స్నేహ ధర్మానికి భాష్యం చెప్పేవారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా నిజ జీవితంలో స్నేహాన్ని ఒక పవిత్ర బంధంగా, పారాయణ గ్రంథంగా పాటించిన మనస్వి ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం.

బాలు ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగినా, ఎక్కి వచ్చిన నిచ్చెన మెట్లనూ, చిన్న నాటి నేస్తాలనూ మర్చిపోలేదు. అందుకు ఆయన కృతజ్ఞతా పూర్వకంగా చేయి అందించిన బీవీ మురళి, ఎమ్ విఠల్‌రావు, వై కామేశ్వర రావు, శ్యామ్, డా॥ వై.దివాకర్ వంటి సహచరులు ప్రత్యక్ష సాక్షులు. 1964లో మద్రాసు ఆంధ్రా క్లబ్‌లో జరిగిన లలిత సంగీతం పాటల పోటీలో పాల్గొనడానికి బాలు ఇష్టపడకపోయినా... చెప్పకుండా ప్రవేశ రుసుము చెల్లించి బాలుకి ప్రథమ బహుమతి రావడానికీ, కోదండపాణి వంటి వారి దృష్టిలో పడటానికీ కారకుడు; 1966 డిసెంబరు 15వ తేదీన 'విజయా గార్డెన్స్'లో తన మొట్టమొదటి సినిమా పాట రికార్డింగ్‌కు సైకిలు మీద తోడుగా వచ్చి ప్రోత్సహించిన తన రూమ్మేట్ బీవీ మురళిని కోదండపాణి ఆడియో లాబ్‌లో ఆడియో అసిస్టెంట్‌గా నియమించడమే కాకుండా ఎన్నో వేదికల మీద అతని సహాయాన్ని గుర్తు చేసుకునేవారు. రంగస్థలం మీద సహ నటులైన శ్యామ్‌ను స్టూడియో మేనేజర్ గానూ, వై. కామేశ్వరరావును 'పాడతా తీయగా'లో అసిస్టెంట్ గానూ, కొన్ని చిత్రాలలో నటుడి గానూ అవకాశాలు కల్పించి వారి ఉపాధికి తోడ్పడ్డారు. విఠల్‌ను పీఏగా పెట్టుకోవడమే కాకుండా తన ఇంటికి దగ్గర్లో అతనికో ఇల్లు కట్టించడంతో పాటు అనేక విధాలుగా ఆదుకున్నారు. 'ఈటీవీ' వారి వార్షికోత్సవ సంగీత కార్యక్రమంలో తను మెచ్చిన రాంప్రసాద్‌ను 'పాడుతా తీయగా' కార్యక్రమానికి పరిశోధకునిగా చివరి వరకు కొనసాగించారు.

బాలు స్నేహ ప్రీతి బాల్యమిత్రులకే పరిమితం కాలేదు. స్టూడియో నిర్మాణానికి సహకరించిన ప్రాణమిత్రుడు బిల్డర్ రాధాకృష్ణన్ ఆకస్మికంగా జూన్ 1వ తేదీన చనిపోతే ఆనాటి నుంచి బాలు తన పుట్టినరోజును (జూన్ 4వ తేదీ) అట్టహాసంగా జరుపుకోవడం మానేశారు. ఎమ్వీఎల్, వై. కామేశ్వరరావు వంటి ఆప్తమిత్రుల అవసాన దశలలో వారిని బతికించడానికి హాస్పిటల్స్‌కు సంబంధించిన మొత్తం ఖర్చులను భరించారు. ఎమ్వీఎల్ చనిపోయిన తరువాత కూడా అతని స్నేహ బృందాన్నీ, నూజివీడునూ మర్చిపోకుండా అనేక స్మారక కార్యక్రమాలకు హాజరయిన స్నేహశీలి, ఆత్మ బంధువు బాలు.

1990లో మద్రాసు విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిగా పరిచయమైన ఈ వ్యాసకర్త సిద్ధాంత గ్రంథం 'తెలుగు సినిమా పాట చరిత్ర'ను అయాచితంగా, ఐచ్ఛికంగా స్పాన్సర్ చేసి ప్రచురించడమే కాకుండా దానికి విస్తృత ప్రాచుర్యాన్ని కలిగించారు బాలు. స్వల్ప పరిచయం స్నేహంగా మారడానికీ, ఈ వ్యాసకర్తకు సినీగేయ సాహిత్య పరిశోధకునిగా గుర్తింపు రావడానికీ బాలు సహృదయతే కారణం. నంది పురస్కారాల నందుకున్న వ్యాసకర్త రెండు సిద్ధాంత గ్రంథాలనూ స్పాన్సర్ చేసిన బాలు స్నేహ వాత్సల్యాన్ని ఈ రచయిత మర్చిపోలేడు. వెన్నెలకంటి ప్రతిభను గుర్తించి అతనిని సినీరంగంలో ప్రోత్సహించడం, డా॥ పీఎస్ గోపాలకృష్ణ రచనలు 'మన ఘంటసాల', తన జీవిత చరిత్ర 'జీవన గానాలు'కు బాసటగా నిలవడం బాలు ఉత్తమాభిరుచికి నిదర్శనాలు.



1993 ఫిబ్రవరిలో హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో ఘంటసాల విగ్రహావిష్కరణ సందర్భంగా లక్షలు వెచ్చించి మద్రాసు చిత్ర పరిశ్రమలోని తన మిత్రులందరినీ హైదరాబాద్‌కు తరలించి సత్కరించడం బాలు మైత్రీ యానంలో ఓ మైలురాయి.

బాలుది బాలుడి మనస్తత్వం. ఆ విషయాన్ని ఘంటసాల విగ్రహావిష్కరణ సభలో అతని కన్నీళ్లు రుజువు చేశాయి. బాలు సంగీత సత్కార వేదికల మీద ఎన్నో సార్లు తన అంతిమ క్షణాల గురించి ప్రస్తావించేవారు. తనను నూరేళ్ల వరకు మృత్యువు సమీపించదనీ, మళ్లీ తనకు జన్మంటూ ఉంటే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగానే పుట్టాలనీ, అప్పుడు కూడా తన మిత్రులు, అభిమానులు తనతో ఉండాలని కోరుకుంటున్నాననీ అనేవారు. పసి మనస్సును తలపించే ఆ మహోన్నత మూర్తి పుట్టినరోజున ఆయన ఆత్మకు అంజలి ఘటిద్దాం. అంతటి మహనీయుని సమకాలికులుగా పుట్టినందుకు, ఆయన స్నేహ సంపదను పంచుకున్నందుకు జన్మ ధన్యమైందని గర్విద్దాం.

వ్యాసకర్త సినీగేయ పరిశోధకులు | 99891 06162
(నేడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం జయంతి)

మొర వినేవాడు

కష్టాలు మనలను కమ్మేసినప్పుడు మనసు అతలాకుతలం అవుతుంది. మనోధైర్యం సడలిపోతుంది. మన బాధను, మనో వేదనను పంచుకునేందుకు ఒకరు కావాలనిపిస్తుంది. మన వారనుకునే వారికి మన గోడు చెప్పుకుంటాం. కొంచెం ఊరట చెందుతాం. ఆ సమయంలో భగవంతుడు ఎప్పటి కన్నా బాగా గుర్తుకువస్తాడు. దైవం ఒక్కడే మన మొర వినేవాడు, బాధ తీర్చేవాడు అనే నమ్మకంతో మన వేదన నివేదిస్తాం. తోటి మనుషులతో పూర్తిగా చెప్పుకోలేని బాధను నిస్సంకోచంగా దైవానికి మొర పెట్టుకుంటాం.



భాగవతం అష్టమ స్కంధంలోని గజేంద్ర మోక్షం ఘట్టంలో గజరాజు సరస్సులో క్రీడించే సమయంలో ఆ మడుగులో ఒక మొసలి గజరాజును ఒడిసి పట్టుకుంటుంది. ఏనుగూ, మొసలీ ఒకదాన్ని మించి ఒకటి ఓడించాలని పోరాటం చేశాయి. ఏనుగు పోరాడి పోరాడి అలసిపోయింది. 'ఇంక నాకు సాధ్యం కాదు. నేను ఎవరిని ప్రార్థించాలి? నన్ను ఎవరు కాపాడతారు? దిక్కులేని నా మొర వినే పుణ్యాత్మునికి నమస్కరిస్తాను' అంటుంది. ఆ పుణ్యాత్ముడు ఎవరు? భగవంతుడే! 'అందరి పట్ల సమభావం కలవాడూ, దుర్జనుల చేత చిక్కిన సజ్జనులను సాయపడేవాడూ, దీనుల మొర వినేవాడూ నా మొరను వింటాడు' అంటుంది.

నీవు తప్ప నాకు దిక్కు లేదు; ఆదుకొమ్మని నిండు మనసుతో ప్రార్థిస్తే భగవంతుడు ఉన్నవాడు ఉన్నట్లే వచ్చేస్తాడని అనటానికి గజేంద్ర మోక్ష పద్యాలే ప్రబల నిదర్శనం. భయంతో స్వాధీనం తప్పి కాపాడమన్న గజేంద్రుని మొర విన్నాడు. తక్షణమే వచ్చి గజేంద్రుని కాపాడాడు. ఈ మొర అనే పదం ఈ ఘట్టంలో చాలా సార్లు కనిపిస్తుంది.

మొర అంటే ఆర్తితో ప్రార్థించటం. మొరలో వేదన ఉండాలి. భక్తి, నమ్మకం ఉండాలి. అప్పుడే మన కష్టాలూ, బాధలూ తొలగుతాయి.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.9.03 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** భరణి రా.10.05 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.8.26 నుండి 9.57 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.56 వరకు తదుపరి రా.10.50 నుండి 11.34 వరకు, **అమృతఘడియలు:** సా.5.36 నుండి 7.09 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.27.

సోమవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్ఠం
ఆదిలాబాద్	40.3
భద్రాచలం	36.5
రామగుండం	36.5
నిజామాబాద్	36.1
నల్లగొండ	34.5
మెదక్	33.8
ఖమ్మం	33.2
హైదరాబాద్	32.6
దుండిగల్	32.0
హకీంపేట్	32.0
హనుమకొండ	31.0
మహబూబ్‌నగర్	29.1



నకిలీ విత్తనాలతో నష్టపోయాం

- పరిహారం ఇచ్చే వరకూ కదిలేది లేదు
- కొడంగల్‌లోని విత్తన దుకాణం ఎదుట అన్నదాతల ఆందోళన


కొడంగల్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న రైతులు

దుద్యాల్: నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్ నమోదు చేస్తామని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నా ఫర్టిలైజర్ దుకాణదారులు పట్టించుకోవడం లేదని అన్నదాతలు కన్నెర్ర చేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన వందలాది మంది రైతులు సోమవారం కొడంగల్ పట్టణంలోని ఓం ట్రేడింగ్ కంపెనీ ఫర్టిలైజర్ దుకాణం ఎదుట బైఠాయించారు. యజమానితో వాగ్వాదానికి దిగారు. యజమాని అక్కడ నుంచి వెళ్లిపోవడంతో అంబేడ్కర్ చౌరస్తాలో భారీ ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పి నమ్మించి తమకు నాసిరకం వరి విత్తనాలు అంటగట్టారన్నారు. తీరా పంట పండిన తర్వాత 12- 15 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని, దీంతో కనీసం పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం వరి విత్తనాలతో ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపోయామని, తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు శంకర్‌రాథోడ్ అక్కడకు చేరుకున్నారు. విచారణ చేపట్టి తప్పు ఎక్కడ జరిగిందో తెలుసుకొని రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. విత్తనాలు కొనుగోలు చేసినవారు సంబంధిత బిల్లులతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. దీంతోవారు శాంతించారు. అన్నదాతల ఆందోళనతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

అమెరికాలో హైదరాబాద్ యువతి మిస్సింగ్

- కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీలో ఎంఎస్ చదువుతున్న నితీషా



సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ సబ్ బెర్నార్డియాలో (సీఎస్‌యూఎస్‌బీ) విద్యనభ్యసిస్తున్న హైదరాబాద్ యువతి నితీషా కందుల (23) అదృశ్యమయ్యారు. గత నెల 28వ తేదీ నుంచి కనిపించకుండాపోయిన నితీషా కోసం లాస్‌ఏంజెల్స్ పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఎల్‌ఏపీడీ) ముమ్మరంగా గాలిస్తోంది. నగరానికి చెందిన నితీషా మాస్టర్స్ డిగ్రీ కోసం అక్కడకు వెళ్లారు. ఆమెను చివరగా కాలిఫోర్నియాలో కారు డ్రైవ్ చేస్తుండగా చూసినట్టు కొందరు స్నేహితులు ఎల్‌ఏపీడీకి వాంగ్మూలం ఇచ్చారు. గత నెల 30న ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. నితీషా తప్పిపోయిన సమయంలో 2021 మోడల్‌కు చెందిన టయోటా కరోలాను నడుపుతున్నట్టు అక్కడి అధికారులు ప్రకటించారు.

వరుస ఉదంతాలతో కలకలం

- ఇటీవల కాలంలో భారతీయులకు సంబంధించి అమెరికాలో చోటు చేసుకుంటున్న వరుస ఉదంతాలు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి.
- గత నెలలో భారతీయ విద్యార్థి రుపేష్ చంద్ర చింతకింద, మార్చిలో హైదరాబాద్ నాచారం ప్రాంతానికి చెందిన విద్యార్థి మహ్మద్ అబ్దుల్ అరఫత్ అదృశ్యమై శవాలుగా తేలారు.
- అమెరికా వెళ్లిన క్లాసికల్ డ్యాన్సర్ అమర్నాథ్ ఘోష్‌ను సెయింట్ లూయిస్‌లో ఆగంతకులు కాల్చి చంపారు.
- సమీర్ కామత్.. ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఇండియానాలో అనుమానాస్పద స్థితిలో మరణించారు. వీరితో పాటు వివేక్ తనేజా, అకుల్ దావన్ మరణాలు సైతం అంతుచిక్కకుండా ఉన్నాయి.

క్లుప్తంగా...

టీకా వికటించి చిన్నారి మృతి!


అనిశ్రీ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): టీకా వేయించుకున్న చిన్నారి అనారోగ్యంతో మృతి చెందింది. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన బుర్క రాకేశ్-రిషిత దంపతుల నాలుగు నెలల వయసున్న కుమార్తె అనిశ్రీకి పీహెచ్‌సీలో నాలుగు రోజుల క్రితం టీకా వేయించారు. టీకా వేసిన తర్వాత జ్వరం రాగా.. ఆదివారం విరోచనాలు మొదలయ్యాయి. సోమవారం ఉదయం పరిస్థితి విషమించడంతో.. చిన్నారిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందింది. టీకా వికటించడంతోనే తమ కూతురు చనిపోయిందని తల్లిదండ్రులు తెలిపారు. దీనిపై వైద్యాధికారిణి స్రవంతిని వివరణ కోరగా.. టీకాతో చిన్నారి మరణించలేదని, వేడిని తట్టుకునే శక్తి లేకపోవడంతోనే చనిపోయి ఉంటుందని స్పష్టం చేశారు.

చెక్‌పోస్టు బీట్ అధికారిపై దాడి

మంచిర్యాల జిల్లాలో ఘటన


గాయపడ్డ సాయికుమార్

జన్నారం: ఇరువర్గాల మధ్య జరుగుతున్న గొడవను వారించబోయిన ఫారెస్ట్ బీట్ అధికారిపై కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపర్చారు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా జన్నారం పరిధి లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ కథనం ప్రకారం.. జన్నారం అటవీ డివిజన్ తపాలపూర్ చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉన్న ఫారెస్ట్ బీట్ అధికారి సాయికుమార్‌కు ఆదివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో ఒకరు ఫోన్ చేసి కారు యాక్సిడెంట్ చేసి వస్తోందని, చెక్‌పోస్టు వద్ద ఆపాలని కోరాడు. అనంతరం ఓ కారు రావడంతో సాయికుమార్ చెక్‌పోస్టు వద్ద ఆపి తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో తాళ్లపేట్ వైపు నుంచి బైక్‌లపై కొందరు వ్యక్తులు వచ్చి కారులో ఉన్న వారితో గొడవ పడ్డారు. కాగా, గొడవ పడవద్దని బీట్ అధికారి వారిని వారించారు. దీంతో ఆగ్రహానికి గురైన దండేపల్లి మండలం మేదరిపేటకు చెందిన ఆడే శ్రావణ్‌కుమార్, తీగల ఉదయ్‌తోపాటు మరికొందరు సాయికుమార్‌పై దాడి చేసి గాయపర్చారు. అడ్డుగా వెళ్లిన వాచర్‌ను కూడా కొట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాధాకిషన్‌రావుకు మాతృవియోగం

కరీంనగర్ క్రైం: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు తల్లి సరోజినీదేవి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడుతున్న ఆమెను రాధాకిషన్‌రావు కోర్టు అనుమతితో ఏప్రిల్ 21న ఆస్పత్రికి వచ్చి పరామర్శించారు. ఆమె మృతదేహాన్ని స్వస్థలం స్టేషన్ ఘన్‌పూర్ మండలం పాలకుంటకు తరలించినట్లు తెలిసింది.

సాగు సీజన్ షురూ

▶ మొదటి పేజీ తరువాయి

1.34 కోట్ల ఎకరాల్లో పంటల సాగు జరుగుతుందని అంచనా వేసింది. గతేడాది వానాకాలం సీజన్‌లో 1.26 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవగా.. ఈసారి 8 లక్షల ఎకరాల్లో అధికంగా పంటల సాగు జరుగుతుందని పేర్కొంది. ఈ మేరకు ఇటీవలే పంటల సాగు ప్రణాళికను విడుదల చేసింది. అత్యధికంగా 66 లక్షల ఎకరాల్లో వరి, ఆ తర్వాత 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని తెలిపింది. గతేడాది వరి 65 లక్షల ఎకరాల్లో, పత్తి 44.77 లక్షల ఎకరాల్లో సాగు అయ్యింది. ఈసారి పత్తి మరో 15.23 లక్షల ఎకరాల్లో సాగయ్యేలా రైతులను ప్రోత్సహించనున్నారు. వరి కంటే ఎక్కువగా పత్తిని ప్రోత్సహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఆ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

విత్తన ప్రణాళిక ఖరారు

సాగుకనుగుణంగా విత్తన ప్రణాళికను కూడా వ్యవసాయ శాఖ ఖరారు చేసింది. ఈ వానాకాలం సీజన్‌కు 19.39 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని నిర్ణయించారు. అందులో అత్యధికంగా 16.50 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలే కావడం గమనార్హం. పత్తి విత్తనాలు 54 వేల క్వింటాళ్లు, సోయాబీన్ విత్తనాలు 1.49 లక్షల క్వింటాళ్లు అందుబాటులోకి తెస్తారు. మొక్కజొన్న విత్తనాలు 48 వేల క్వింటాళ్లు, కంది విత్తనాలు 16,950 క్వింటాళ్లు, వేరుశనగ విత్తనాలు 13,800 క్వింటాళ్లు, పెసర విత్తనాలు 4,480 క్వింటాళ్లు సిద్ధం చేశారు. అలాగే జొన్న, సజ్జ, రాగి, మినుములు, ఆముదం, పొద్దు తిరుగుడు విత్తనాలను కూడా సిద్ధం చేయాలని నిర్ణయించారు. కొందరు రైతులు ఇప్పటికే విత్తనాలు కొనుగోలు చేయగా, మరికొందరు విత్తనాలు, ఎరువుల కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు సిద్ధంగా ఉన్నాయని మార్క్‌ఫెడ్ వెల్లడించింది.

వ్యవ'సాయానికి'సన్నాహాలు

ఈ వానాకాలం సీజన్ నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు స్థానంలో రైతుభరోసా ద్వారా పెంచిన పెట్టుబడి సాయం అందజేయనుంది. ఎకరాకు రూ.7,500 చొప్పున ఇవ్వనుంది. అయితే సాగయ్యే భూములకే ఇవ్వాలని, సీలింగ్ విధించాలని నిర్ణయించారు. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు ఖరారు చేసే పనిలో వ్యవసాయశాఖ నిమగ్నమైంది. కౌలుదారులకు కూడా రైతు భరోసా ఇవ్వనున్నారు. ఇక రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీని ఆగస్టు 15వ తేదీ నాటికి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు కూడా ఖరారు దశలో ఉన్నాయి. మరోవైపు ఈ వానాకాలం సీజన్ నుంచే రైతులకు పంటల బీమాను కూడా పునరుద్ధరించనున్నారు.

33 మందిపై కేసులు: మంత్రి తుమ్మల

అనుమతి లేకుండా పత్తి విత్తనాల ప్యాకెట్లు విక్రయిస్తున్న 33 మందిపై కేసులు పెట్టి రూ. 2 కోట్ల విలువగల 118.29 క్వింటాళ్ళ విత్తనాలను స్వాధీనం చేసుకున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారని తెలిసి ఇద్దరు డీలర్లపై కేసులు పెట్టామని వెల్లడించారు. పత్తి విత్తనాలు మార్కెట్లలో అందుబాటులో ఉన్నాయని రైతులందరూ అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటివరకు 84.43 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లను సరఫరా చేశామని, అందులో రైతులు ఇప్పటికే 25.10 లక్షల ప్యాకెట్లు కొనుగోలు చేశారన్నారు.

కన్న తండ్రే ఉసురు తీశాడు..

- కూతురికి కూల్ డ్రింక్‌లో విషం కలిపి తాగించిన నాన్న
- నాలుగు రోజులుగా మృత్యువుతో పోరాడి మృతి


చిన్నారి నిఖిత(ఫైల్)

వెల్దుర్తి (తూప్రాన్): తండ్రే కన్న కూతురి పాలిట కాలయముడయ్యాడు. అభం శుభం తెలియని చిన్నారికి కూల్ డ్రింక్‌లో విషం కలిపి తాగించాడు. దీంతో అస్వస్థతకు గురైన ఆ బాలిక నాలుగు రోజులుగా ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి చివరికి కన్ను మూసింది. ఈ విషాద ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి పంచాయతీ పరిధి శేరీలలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నవతా గౌడ్, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఇక్కిరి శ్రీశైలం, సౌందర్య దంపతులకు కుమారుడు వరుణ్, కూతురు నిఖిత (9) ఉన్నారు. నిఖిత స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి పూర్తి చేసింది. గురువారం మధ్యాహ్నం సమయంలో శ్రీశైలం కూతురికి బలవంతంగా విషం కలిపిన కూల్ డ్రింక్‌ను తాగించాడు. చిన్నారి వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున చిన్నారి మృతిచెందింది. తన కూతురు మరణానికి భర్తే కారణమని నిఖిత తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రాణాలు తీసిన ప్రహరీ

గోడకూలి ఇద్దరు చిన్నారుల దుర్మరణం

వలస కుటుంబీకుల్లో విషాదం • బాబుల్‌రెడ్డి నగర్‌లో ఘటన


మృతిచెందిన నూర్జహాన్, అఫియా (ఫైల్)


గాయాలతో చికిత్స పొందుతున్న చిన్నారులు

మైలార్‌దేవ్‌పల్లి: ఆడుతూ పాడుతూ సరదాగా గడుపుతున్న చిన్నారులను ప్రహరీ కబళించింది. అప్పటి వరకు గోడ వారగా కూర్చుని ముచ్చట్లు పెడుతున్న పిల్లలపై అప్పటికే వర్షం కారణంగా నాని శిథిలమైన ప్రహరీ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా..పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, స్థానికులు తెల్పిన మేరకు..బిహార్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ నజీమ్ రెయిన్, భార్య లాడ్లీ కాతూన్, మహమ్మద్ అక్బర్, భార్య జాహిదా కాతూన్, మహమ్మద్ అఫ్జల్, భార్య నజీదా కాతూన్‌లు వారి పిల్లలతో కలిసి ఉపాధి కోసం నగరానికి వలస వచ్చారు. వీరంతా నాలుగేళ్లుగా బాబుల్ రెడ్డినగర్‌లోని డాక్టర్ అనంతం ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. లేబర్ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. రేకులతో ఉన్న ఇంటిలో ఐదు రూములు ఉన్నాయి. చుట్టు ప్రహరీ ఉంది. అది పూర్తిగా శిథిలావస్థలో ఉంది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గోడ పూర్తిగా తడిచిపోయింది. సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో మూడు కుటుంబాలకు చెందిన ఐదుగురు చిన్నారులు గోడ పక్కనే కూర్చొని ఉన్నారు. ఇంతలో అకస్మాత్తుగా గోడ కూలి ఆ చిన్నారులపై పడింది. చిన్నారుల అరుపులు, భారీ శబ్దం వినపడగానే ఇంట్లో ఉన్న వారంతా బయటకు వచ్చి శిథిలాలను తొలగించి చూడగా..మహమ్మద్ నజీమ్ రెయిన్ కూతురు నూర్జహాన్ (10), మహమ్మద్ అక్బర్ కూతురు అఫియా(8)లు అప్పటికే విగత జీవులయ్యారు. ఇక నజీమ్ రెయిన్ మరో కూతురు నజీమా(8), కుమారుడు మహ్మద్(5), మహ్మద్ అఫ్జల్ కూతురు అఫ్రిదా(7)లు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు చిన్నారులను చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. రాత్రి కురిసిన వర్షానికి గోడ నానింది. దీంతో 6 అడుగుల ఎత్తు, 30 అడుగుల పొడవుగా ఉన్న సిమెంట్ ప్రహరీ ఒక్కసారిగా చిన్నారులపై పడింది. గతంలో గోడ మధ్యలో గ్యాప్ రావడంతో ఇంటి యజమాని డాక్టర్ అనంతం గుప్తకు అనేక మార్లు అద్దెకు ఉంటున్న వారు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. కాగా శిథిలావస్థకు చేరిన ఇళ్లు, ఇతర నిర్మాణాలు ఏవైనా ఉంటే వెంటనే తమకు సమాచారం అందించాలని జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ ప్రజలను కోరారు. గోడ కూలి ఇద్దరు చిన్నారులు దుర్మరణం చెందడం దురదృష్టకరమని, ఇలాంటి ఘటనలు జరగకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు.

బాబుల్ రెడ్డినగర్ లోని గోడ కూలిన ప్రదేశం



మంచినీటి ట్యాంక్‌లో మృతదేహం

- అదే నీటిని తాగిన పలు వార్డుల ప్రజలు
- దుర్వాసన రావడంతో మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు
- నల్లగొండ పట్టణంలో భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు


మృతదేహం లభించిన వాటర్ ట్యాంక్ (ఇన్‌సెట్‌లో) వంశీకృష్ణ (ఫైల్)

నల్లగొండ టూటౌన్ : మంచినీటివాటర్‌ట్యాంక్‌లో మృతదేహం తేలియా డుతూ కనిపించింది. నల్లగొండ పాతబస్తీతోపాటు ఇందిరమ్మ కాలనీకి తాగునీటి సరఫరా జరిగే మున్సిపల్ వాటర్‌ట్యాంక్ ఇదే కావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మృతదేహం పాతబస్తీకి చెందిన ఆవుల వంశీకృష్ణదిగా గుర్తించారు. వంశీకృష్ణ వాటర్‌ట్యాంక్‌లో ఎప్పుడు పడిపోయాడో అన్న విషయంపై స్పష్టత లేదు. మంచినీటిలో దుర్వాసన వస్తుందని స్థానికుల సమాచారంతో మున్సిపల్ సిబ్బంది వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి చూడగా నీటిలో మృతదేహం కనిపించినట్టు తెలిసింది.

నీరు తాగిన ప్రజల ఆందోళన

నల్లగొండ పట్టణంలోని 26, 27, 28 వార్డుల్లోని కాలనీలకు, 12వ వార్డులో కొంతభాగం వరకు ఈ ట్యాంకు నుంచే తాగునీటి సరఫరా జరుగుతోంది. గతంలో నాగార్జునసాగర్‌లోని వాటర్ ట్యాంక్‌లో కోతులు మృతి చెందిన సంఘటన మరువకముందే నల్లగొండలోని ఈ ఘటన వెలుగు చూడడంతో కలకలం రేగింది.

జూన్ ఒకటిన ట్యాంక్ తనిఖీ చేశాం: కలెక్టర్ హరిచందన

వాటర్‌ట్యాంక్‌ను గత నెల 30, ఈ నెల ఒకటవ తేదీన మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేసిన తర్వాతనే నీటిని విడుదల చేశారని నల్లగొండ కలెక్టర్ హరిచందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పుడు వాటర్ ట్యాంక్‌లో మృతదేహం లేదని, సోమవారం ఉదయం ట్యాంక్ శుభ్రం చేయడానికి మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేయగా శవం కనిపించిందన్నారు. దీనిపై ప్రాథమిక వైద్య విచారణలో మృతదేహం రెండు, మూడు రోజులదని, అక్కడక్కడా గాయాలు ఉన్నట్టు గుర్తించారని తెలిపారు. ట్యాంక్ ద్వారా తాగునీటి సరఫరా అవుతున్న 50 ఇళ్ల వద్దకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెళ్లారని, ఇప్పటి వరకు ఎవరికీ.. ఎలాంటి అనారోగ్య సమస్యలు రాలేదని తెలిపారు.

వంశీకృష్ణ తప్పిపోయాడంటూ మే 25న ఫిర్యాదు

నల్లగొండలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ఆవుల వంశీకృష్ణ ఇంటి నుంచి తప్పిపోయినట్టు ఆయన తండ్రి ఆవుల వెంకటేశ్వర్లు మే 25న ఫిర్యాదు చేశారని వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మే 24న అర్ధరాత్రి ఇంట్లో నుంచి పెద్ద ఎత్తున కేకలు వేస్తూ వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. వంశీకృష్ణ మానసిక వ్యాధి కారణంగా మందులు వాడుతున్నట్టు తెలిపారు. సోమవారం వంశీకృష్ణ వాటర్ ట్యాంక్‌లో శవమై తేలినట్టు గుర్తించామని, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

నరక యాతన

- సెల్లార్ గోడ కూలి.. శిథిలాల్లో ఇరుక్కున్న కూలీ
- 8 గంటలు శ్రమించి బయటికి తీసిన ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది



కుత్బుల్లాపూర్: ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్ గోడ కూలి..శిథిలాల్లో కార్మికుడు ఇరుక్కుపోయాడు. దాదాపు 8 గంటల పాటు శ్రమించి ఎన్డీఆర్‌ఎఫ్ బృందం అతన్ని బయటకు తీశారు. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సుచిత్ర వెన్నెలగడ్డలోని యూనియన్ బ్యాంక్ వెనుక వీధిలోని సాయిరామ్ బృందావన అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో వరదనీరు చేరడంతో గత ఐదు రోజులుగా మురికి కాలువ పనులు చేపడుతున్నారు. కొండయ్య అనే మేస్త్రీ ఆధ్వర్యంలో మహబుబాబాద్ జిల్లా పూర్వి మండలం, నేరేడు గ్రామానికి చెందిన బానవత్‌రెడ్డి (35), గణేష్, ఎల్లయ్య, కుమార్, రాజులతో కలిసి కాలువ తవ్వే పనులు చేపట్టారు. సోమవారం గోడ తవ్వి ఇనుప చువ్వలు ఏర్పాటు చేసే క్రమంలో సైడ్ వాల్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ప్రమాదాన్ని గమనించి నలుగురు కార్మికులు తప్పించుకోగా, బానవత్‌రెడ్డిపై మాత్రం శిథిలాలు పడిపోయాయి. అతన్ని రక్షించేందుకు తోటి కార్మికులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న ఎన్డీఆర్‌ఎఫ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఆర్‌ఎఫ్‌ఓ ప్రసన్నకుమార్, ఎస్‌ఎఫ్‌ఓ సుధాకర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12.45 నుండి ఎమర్జెన్సీ ఆఫీసర్ సర్దార్ నేతృత్వంలోని 25 మంది సిబ్బంది బానవత్‌రెడ్డిని ప్రాణాలతో కాపాడేందుకు యత్నించారు. ఎట్టకేలకు రాత్రి 9 గంటల ప్రాంతంలో గోడ వ్యర్థాలను తొలగించి సురక్షితంగా బయటకు తీశారు. అతన్ని స్థానికంగా ఉన్న సృజనా ఆస్పత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా అతని ఆరోగ్య పరిస్థితిని ఇప్పుడే చెప్పలేమని, శరీరానికి అయిన గాయాలు ఎక్స్‌రే, స్కానింగ్‌లు తీసిన తర్వాతే చెప్పగలమని వైద్యులు పేర్కొన్నారు.

మందు పాతర పేలి వ్యక్తి మృతి

- మరో నలుగురికి తప్పిన ప్రమాదం
- వంట చెరుకు తేవడానికి వెళ్లగా ఘటన
- పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు బాంబు అమర్చి ఉంటారని అనుమానం


మందు పాతర పేలుడులో మరణించిన యేసు, పక్కన కొడుకు రమేష్ (ఇన్‌సెట్‌లో) యేసు మృతదేహం

వాజేడు: వంట చెరుకు కోసం అడవికి వెళ్లిన వ్యక్తి మందుపాతరకు బలయ్యాడు. ఈ సంఘటన ములుగు జిల్లా వాజేడు మండల పరిధి కొంగాల గ్రామ సమీపాన చోటుచేసుకుంది. జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇల్లెందుల యేసు (55), ఇల్లెందుల రమేశ్, ఇల్లెందుల ఫకీర్, ఇల్లెందుల పాల్గుణ, అరికెల్ల లక్ష్మయ్య సోమవారం ఉదయం ఏడు గంటలకు వంట చెరుకు తేవడానికి కొంగాల గ్రామ సమీప గుట్ట పైకి వెళ్లారు. కాలిబాటన వెళ్తున్న క్రమంలో ఇల్లెందుల యేసు ముందు నడుస్తున్నాడు. అతడి కాలు దారిలో ఏర్పాటు చేసిన మందు పాతరపై పడటంతో పెద్ద శబ్దంతో పేలింది. ఈ ధాటికి యేసు ఎగిరిపడి వెంటనే ప్రాణాలను వదిలాడు. వెనుక నడుస్తున్న రమేశ్, ఫకీర్, పాల్గుణ, లక్ష్మయ్య భారీ శబ్దానికి భయపడి అక్కడి నుంచి కిందకి పరుగులు తీశారు. కొంత సమయం తరువాత వచ్చి చూడగా యేసు మృతి చెంది ఉన్నాడు. విషయాన్ని బంధువులకు, పోలీసులకు తెలియజేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు వాజేడు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదయినట్లు జిల్లా ఎస్పీ శబరీశ్ తెలిపారు.

పోలీసులే లక్ష్యంగా అమర్చారా?

పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఈ బాంబ్ అమర్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మావోయిస్టులు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను వ్యతిరేకించిన క్రమంలో పోలీసులు దండకారణ్య ప్రాంతంలో భారీ ఎత్తున కూంబింగ్ చేపట్టారు. ఈ సమయంలో పోలీసులకు, మావోలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో పలువురు మావోలు మృతిచెందారు. దీనికి ప్రతీకార చర్యగా ఈ బాంబును అమర్చి ఉంటారని భావిస్తున్నారు.

అమాయకులు బలవుతున్నారు..

మావోయిస్టులు సిద్ధాంతాలను మరిచి అమరుస్తున్న మందు పాతరలకు అమాయకులు బలవుతున్నారని ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ అన్నారు. మావోయిస్టు పార్టీ తెలంగాణలో ప్రాబల్యం కోల్పోయిందని, ఈ క్రమంలో వారు ఉనికిని చాటుకోవడానికి అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్నారని విమర్శించారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇల్లెందుల యేసు ఉదయం వంట చెరుకు తేవడానికి వెళ్లి మందు పాతరకు బలయ్యాడని, ఈ ఘటనపై కేసు నమోదయినట్లు తెలిపారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన మావోయిస్టులపై, వారికి సహకరించే సానుభూతిపరులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

భార్య తనను పట్టించుకోవడం లేదని..

- మామ, బావమరిదిపై కత్తితో దాడి
- డిఫెన్స్ ఉద్యోగి ఘాతుకం

అత్తాపూర్: భార్య పుట్టింటి వారి మాటలు వింటూ తనను పట్టించుకోవడం లేదని మతిస్థిమితం కోల్పోయిన ఓ డిఫెన్స్ ఉద్యోగి మామ, బావమరిదిపై కత్తితో దాడి చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి. వెంకటరామిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్లా డీఎల్‌ఆర్‌ఎల్‌లో లేత్ మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి 20 ఏళ్ల క్రితం ఎం.ఎం పహాడి ప్రాంతానికి చెందిన సలీం ఖాన్ కుమార్తె ఫర్హానా బేగంతో వివాహం జరిగింది. గతంలో వరకట్న వేధింపుల కేసులో అబ్దుల్లా జైలుకు వెళ్లి వచ్చినాడు. ఫర్హానా తన తల్లిదండ్రులు చెప్పిన మాటలు వింటూ కుటుంబ విషయాల్లో తనకు సహకరించడం లేదని కోపం పెంచుకున్న అతను ఆదివారం రాత్రి ఎం.ఎం పహాడిలో ఉన్న సలీం ఖాన్ ఇంటికి వెళ్లి అతడితో పాటు బావమరిది మాజిద్ ఖాన్‌పై కత్తితో దాడిచేసి పరారయ్యాడు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. నిందితుడు అబ్దుల్లాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మెక్సికోలో కొత్త చరిత్ర



- అధ్యక్ష పీఠంపై షేన్‌బామ్
- తొలి మహిళగా రికార్డు

మెక్సికో సిటీ: మెక్సికో చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అంతా ఊహించినట్టుగానే అధికార మోరెనా వామపక్ష కూటమి అభ్యర్థి క్లాడియా షేన్‌బామ్ (61) ఘనవిజయం సాధించారు. 200 ఏళ్ల స్వతంత్ర మెక్సికో చరిత్రలో దేశ అధ్యక్ష పీఠమెక్కనున్న తొలి మహిళగా రికార్డు సృష్టించారు. యూదు మూలాలున్న తొలి ప్రెసిడెంట్ కూడా ఆమే కానున్నారు! షేన్‌బామ్‌కు ఇప్పటికే దాదాపు 60 శాతం ఓట్లు లభించినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ''ప్రత్యర్థులిద్దరూ నాకిప్పటికే ఫోన్ చేసి అభినందించారు. ఓటమిని అంగీకరించారు. దేశానికి తొలి అధ్యక్షురాలిని కాబోతున్నా'' అంటూ చిరునవ్వులు చిందించారు. ''ఇది నేను ఒంటరిగా సాధించిన విజయం కాదు. తల్లులు మొదలుకుని కూతుళ్లు, మనవరాళ్ల దాకా దేశ మహిళలందరి విజయమిది'' అన్నారు. విపక్ష కూటమి మహిళకే అవకాశమిచ్చింది. రెండు ప్రధాన పార్టీల నుంచీ మహిళలే తలపడటమూ మెక్సికో చరిత్రలో ఇదే తొలిసారి. విపక్ష కూటమి అభ్యర్థి సోచిల్ గాల్వెజ్‌కు 28 శాతం, మరో ప్రత్యర్థి జార్జ్ అల్వారిజ్ మైనేజ్‌కు 10 శాతం ఓట్లు వచ్చినట్టు ఈసీ పేర్కొంది. షేన్‌బామ్ నూతన చరిత్ర లిఖిస్తున్నారంటూ అధ్యక్షుడు ఆంద్రెజ్ మాన్యుయెల్ లోపెజ్ అబ్రేడర్ అభినందించారు. ఆరేళ్ల పదవీకాలంలో ఆయన పలు చరిత్రాత్మక నిర్ణయాలతో ప్రజల మనసు గెలుచుకున్నారు. షేన్‌బామ్ విజయంలో లోపెజ్ పాపులారిటీదే ప్రధాన పాత్ర. ఒకసారికి మించి అధ్యక్ష పదవిలో కొనసాగేందుకు మెక్సికో రాజ్యాంగం అనుమతించదు. దాంతో ఆయన రెండోసారి బరిలో దిగలేకపోయారు. 2018లో లోపెజ్ గెలిచినప్పటి మాదిరిగా ఈసారి ప్రజల్లో పెద్దగా హర్షాతిరేకాలు వ్యక్తం కాకపోవడం విశేషం. అధ్యక్ష పదవితో పాటు పాటు 9 రాష్ట్రాల గవర్నర్లు, 128 మంది సెనేటర్లు, 500 మంది కాంగ్రెస్ ప్రతినిధులు, వేలాది మేయర్లు, స్థానిక సంస్థల ప్రతినిధి పదవులకు కూడా ఎన్నికలు జరిగాయి. వాటి ఫలితాలపై ఆసక్తి నెలకొంది. మొత్తం 32 గవర్నర్ పదవుల్లో మెరేనా పార్టీకి 23 ఉన్నాయి.

లా డాక్టోరా...

షేన్‌బామ్ విద్యార్హతలు అన్నీ ఇన్నీ కావు. ఎనర్జీ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేశారు. అందుకే ఆమెను అభిమానులు ముద్దుగా 'లా డాక్టోరా' అని పిలుచుకుంటారు. పర్యావరణవేత్తగా చాలా పేరుంది. నోబెల్ శాంతి బహుమతి పొందిన ఐరాస పర్యావరణ శాస్త్రవేత్తల బృందంలో షేన్‌బామ్ సభ్యురాలు. రాజధాని మెక్సికో సిటీ మేయర్‌గా చేసిన తొలి మహిళ కూడా ఆమే. షేన్‌బామ్ తాత, అమ్మమ్మ హిట్లర్ హోలోకాస్ట్ హింసాకాండను తప్పించుకోవడానికి యూరప్ నుంచి మెక్సికో వలస వచ్చారు. షేన్‌బామ్ మెక్సికో సిటీలోనే పుట్టారు. 2000లో రాజకీయ అరంగేట్రం చేశారు.

షేన్‌బామ్‌కు సవాళ్లెన్నో...

షేన్‌బామ్ అక్టోబర్ 1న అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమెకు సవాళ్ల స్వాగతమే లభించనుంది. మహిళలపై హింసకు మెక్సికో ప్రపంచంలోనే పెట్టింది పేరు. ఈ సమస్యను రూపుమాపాల్సి ఉంది. సంక్షేమ పథకాలతో లోపెజ్ బాగా ఆకట్టుకున్నా అడ్డూ అదుపూ లేదని వ్యవస్థీకృత హింస, గ్యాంగ్ వార్లు, డ్రగ్ ట్రాఫికింగ్, పెట్రో ధరల పెరుగుదల తదితరాల కట్టడికి పెద్దగా చేసిందేమీ లేదన్న అసంతృప్తి ప్రజల్లో బాగా ఉంది. వీటిపై కొత్త అధ్యక్షురాలు దృష్టి పెట్టాలని వారు భావిస్తున్నారు. ప్రస్తుత పథకాలన్నింటినీ కొనసాగిస్తూనే దేశాన్ని పీడిస్తున్న అన్ని సమస్యలనూ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని షేన్‌బామ్ ప్రకటించారు. ఏ తారతమ్యాలూ లేకుండా ప్రజలందరినీ ఒకేలా చూస్తానన్నారు.

టిక్.. టిక్.. టిక్

మోదీ 3.0నా, ఇండియా కూటమా?



- సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నేడే
- ఏపీ, ఒడిశా అసెంబ్లీ ఫలితాలు కూడా
- ఉదయం 8 నుంచి కౌంటింగ్ షురూ
- మధ్యాహ్నానికల్లా స్పష్టత వచ్చే అవకాశం

న్యూఢిల్లీ: దేశమంతా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న క్షణాలు రానేవచ్చాయి. 80 రోజులకు పైగా ఏడు విడతల్లో సాగిన సుదీర్ఘ సార్వత్రిక ఎన్నికల క్రతువు తుది దశకు చేరింది. మంగళవారం ఫలితాలు వెలువడనున్నాయి. కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి హ్యాట్రిక్ కొట్టి నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా నెహ్రూ రికార్డును సమం చేస్తారా? లేదంటే కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమి అనూహ్యమేమైనా చేసి చూపించనుందా? సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్న ఈ ప్రశ్నలకు మరికొన్ని గంటల్లో సమాధానం లభించనుంది. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశాల్లో అసెంబ్లీ స్థానాలకు కూడా ఓట్ల లెక్కింపు జరగనుంది. ఏకగ్రీవమైన సూరత్ మినహా 542 లోక్‌సభ స్థానాలు, ఏపీలో 175, ఒడిశాలో 147 అసెంబ్లీ స్థానాల్లో విజేతలెవరో తేలనుంది. కౌంటింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుంది. మధ్యాహ్నానికల్లా ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఎన్డీఏ హ్యాట్రిక్ ఖాయమని శనివారం వెలువడ్డ ఎగ్జిట్ పోల్స్ ముక్త కంఠంతో పేర్కొనడం, విపక్ష కూటమి వాటిని తిరస్కరించడం తెలిసిందే. ఎన్నడూ లేని స్థాయిలో ఈ దఫా పోలింగ్ అనంతరం కూడా కేంద్ర ఎన్నికల సంఘంపై, ఈవీఎంలపై విపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టాయి. ఎగ్జిట్ పోల్స్‌ను 'మోదీ మీడియా పోల్'గా అభివర్ణించాయి. ఎగ్జిట్ పోల్స్ ముసుగులో అసలు ఫలితాలు ఎలా ఉండాలో అధికార యంత్రాంగానికి మోదీ స్పష్టమైన సంకేతాలిస్తున్నారంటూ దుయ్యబట్టాయి. ఈసీ స్వతంత్ర ప్రతిపత్తిని, దేశ ఎన్నికల ప్రక్రియను న్యూనత పరిచేందుకు విపక్షాలు మతిలేని ప్రయత్నాలు చేస్తున్నాయంటూ అధికార బీజేపీ ఎదురుదాడికి దిగింది. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగియాన్న ఆరోపణలకు ఆధారాలుంటే ఇవ్వాలంటూ విపక్షాలను కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ నిలదీశారు! దాంతో పోలింగ్ ప్రక్రియ జూన్ 1నే ముగిసినా రాజకీయ వేడి మాత్రం అలాగే కొనసాగింది. ఈ నేపథ్యంలో అందరి కళ్లూ కౌంటింగ్‌పైనే కేంద్రీకృతమయ్యాయి...

హోరాహోరీ పోరు...

ఈసారి ఎన్నికలు అత్యంత హోరాహోరీగా సాగాయి. ప్రచారం ముందెన్నడూ లేనివిధంగా ప్రధానంగా మతం, కులాల ప్రాతిపదికగా సాగింది. వరుసగా మూడో విజయం కోసం బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి సర్వశక్తులూ ఒడ్డగా, పదేళ్ల మోదీ పాలనకు తెర దించడమే లక్ష్యంగా విపక్షాలు కాంగ్రెస్ సారథ్యంలో ఇండియా కూటమిగా బరిలో దిగాయి. బీజేపీ తరఫున మోదీ అన్నీ తానై ప్రచారం చేశారు. కాంగ్రెస్ వస్తే సంపద పన్ను తదితరాల పేరిట జనం ఆస్తులు లాక్కుంటుందని ప్రతి ఎన్నికల సభలోనూ ఆరోపణలు గుప్పించారు. చివరికి హిందూ స్త్రీల మెళ్లో పుస్తెలనూ లాక్కుంటారన్నారు. విపక్షాలు కూడా గట్టిగానే ఎదురు దాడికి దిగాయి. ముస్లింలకు మతాధారిత రిజర్వేషన్లను రద్దు చేస్తామన్న బీజేపీ ప్రకటనను అందిపుచ్చుకున్నాయి. రిజర్వేషన్లను మొత్తానికే ఎత్తేస్తారని, రాజ్యాంగాన్నే సమూలంగా మార్చేస్తారని ఊరూవాడా హోరెత్తించాయి. దాంతో ప్రచార పర్వం ఆసాంతం అక్షరాలా కురుక్షేత్రాన్ని తలపించింది. ఎన్డీఏకు 400 పై చిలుకు, బీజేపీకి సొంతగానే 370 స్థానాలొస్తాయని మోదీ, ఆ పార్టీ నేతలు పేర్కొనగా; ఇండియా కూటమికి 295 స్థానాలు ఖాయమని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్‌గాంధీ చెప్పుకొచ్చారు. లోక్‌సభలో మెజారిటీకి 272 సీట్లు అవసరం.

ఆ సీట్లపై ఆసక్తి...

ఈసారి పలు లోక్‌సభ స్థానాల్లో ఫలితాలపై ఎనలేని ఆసక్తి నెలకొంది. వాటిలో టాప్‌లో ఉన్నది రాహుల్‌గాంధీ పోటీ చేసిన రాయ్‌బరేలీ అంటే అతిశయోక్తి కాదు. యూపీలో గాంధీల కంచుకోట అమేథీలో 2019లో ఆయన తొలిసారి ఓటమి చవిచూడటం తెలిసిందే. ఈసారి మరో కంచుకోట రాయ్‌బరేలీలో నెగ్గుతారా లేదా అన్నది ఆసక్తికరం. సిట్టింగ్ స్థానమైన కేరళలోని వయనాడ్‌లో కూడా సీపీఐ అభ్యర్థి అన్నీ రాజా నుంచి రాహుల్ గట్టి పోటీ ఎదుర్కొన్నారు. అక్కడి ఫలితంపైనా ఉత్కంఠే నెలకొంది. మాజీ సీఎంలు భూపేశ్ భగెల్, చరణ్‌జీత్‌సింగ్ చన్నీ, ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ కూతుళ్లు మీసా భారతి, రోహిణీ ఆచార్య, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సులే గెలుస్తారో లేదో చూడాలి.

పోలింగ్ తర్వాత ఈవీఎంలను మార్చేశారు

భగెల్ తీవ్ర ఆరోపణలు

- నేను పోటీ చేసిన రాజ్‌నంద్‌గావ్‌లో జరిగింది
- చాలా స్థానాల్లో ఇలాగే చేశారు
- ఈసీకి ఫిర్యాదు చేస్తామన్న ఛత్తీస్ మాజీ సీఎం



న్యూఢిల్లీ: పోలింగ్ ప్రక్రియ ముగిసి ఫలితాల వెల్లడికి సర్వం సిద్ధమైనా ఎన్నికల సంఘంపై, ఈవీఎంల పనితీరుపై విపక్షాల ఆరోపణల పరంపర కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో కాంగ్రెస్ నేత, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగెల్ సోమవారం రాత్రి తీవ్ర ఆరోపణలు చేశారు. తాను పోటీ చేసిన రాజ్‌నంద్‌గావ్ లోక్‌సభ స్థానంలో పోలింగ్ ముగిశాక పలుచోట్ల ఏకంగా ఈవీఎంలనే మార్చేశారని పేర్కొన్నారు! ''పలు బూత్‌ల్లో ఈవీఎం బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ల సీరియల్ నంబర్లు పోలింగ్ తర్వాత మారిపోయాయి. ఫామ్ 17సీలో పొందుపరిచిన సమాచారమే ఇందుకు రుజువు. దీని వల్ల వేలాది ఓట్లు ప్రభావితమవుతాయి'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇందుకు సాక్ష్యాలంటూ ఈవీఎంల తాలూకు తొలి నంబర్లు, మారిన నంబర్లతో కూడిన వివరాలను పోస్ట్ చేశారు. ''ఇలా మార్చిన ఈవీఎం నంబర్ల తాలూకు జాబితా చాలా పెద్దది. అందరికీ తెలియాలని చిన్న జాబితా మాత్రమే పోస్ట్ చేస్తున్నా'' అని తెలిపారు. ''ఇది చాలా సీరియస్ అంశం. ఇలా నంబర్లను ఎందుకు మార్చాల్సి వచ్చింది?'' అని ఈసీని ఉద్దేశించి భగెల్ ప్రశ్నించారు. చాలా లోక్‌సభ స్థానాల నుంచి ఇలాంటి ఫిర్యాదులే వస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేస్తున్నాం. నంబర్లను ఏ పరిస్థితుల్లో మార్చాల్సి వచ్చిందో ఈసీ బదులివ్వాల్సిందే. దీనివల్ల ఆయా స్థానాల్లో ఎన్నికల ఫలితంపై ప్రభావం పడితే అందుకు ఎవరిది బాధ్యత?'' అంటూ మండిపడ్డారు. పోలింగ్ అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశవ్యాప్తంగా 150 జిల్లాల కలెక్టర్లకు నేరుగా ఫోన్ చేసి బెదిరింపులకు దిగారంటూ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆదివారం ఆరోపించడం తెలిసిందే. పుకార్లు వ్యాప్తి చేయొద్దని, రుజువులుంటే ఇవ్వాలని సీఈసీ రాజీవ్‌కుమార్ స్పందించారు.

మాకొచ్చే సీట్లు ఇవిగో

- జాబితా వెల్లడించిన కాంగ్రెస్ వర్గాలు
- ఇండియా కూటమికి 295 ఖాయమని ధీమా

న్యూఢిల్లీ: ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై కాంగ్రెస్, విపక్షాలతో కూడిన ఇండియా కూటమి ఆగ్రహజ్వాలలు చల్లారడం లేదు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని దాదాపుగా శనివారం విడుదలైన సర్వేలన్నీ పేర్కొనడం తెలిసిందే. ఎన్డీఏ హీన పక్షం 350 స్థానాలు దాటుతాయని అవి తెలిపాయి. ఇండియా కూటమికి 92 నుంచి గరిష్ఠంగా 200 లోపే వస్తాయని ఎగ్జిట్ పోల్స్ చెప్పడంపై కూటమి పార్టీలన్నీ తీవ్రంగా మండిపడ్డాయి. తమ అంచనా ప్రకారం ఇండియా కూటమికి 295 సీట్లు ఖాయమని, ఎన్డీఏకు 235 లోపే వస్తాయని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మూడు రోజులుగా పదేపదే చెబుతున్నారు. పలు రాష్ట్రాల్లో ఇండియా కూటమి సాధించబోయే లోక్‌సభ స్థానాల సంఖ్యను కూడా కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

రాష్ట్రం	ఇండియా కూటమి గెలిచే స్థానాలు
ఉత్తరప్రదేశ్ (80)	40
తమిళనాడు (39)	39
బిహార్ (40)	25
మహారాష్ట్ర (48)	24
పశ్చిమబెంగాల్ (42)	24
కేరళ (21)	20
కర్నాటక (28)	16
పంజాబ్ (13)	13
జార్ఖండ్ (14)	10
మధ్యప్రదేశ్ (29)	7
రాజస్తాన్ (25)	7
హరియాణా (10)	7
ఛత్తీస్‌గఢ్ (11)	5
ఢిల్లీ (7)	4
పుదుచ్చేరి (1)	1
చండీగఢ్ (1)	1

నోట్: బ్రాకెట్లోనివి ఆయా రాష్ట్రాల్లోని మొత్తం స్థానాలు

ఓటర్లకు వందనం

సార్వత్రిక ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటేసి ప్రపంచ రికార్డ్ సృష్టించారు

- 2019తో పోలిస్తే రీపోలింగ్ సంఖ్య గణనీయంగా తగ్గింది
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ వ్యాఖ్య
- తొలిసారిగా కౌంటింగ్‌కు ముందే ప్రెస్‌మీట్

జమ్మూకశ్మీర్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జమ్మూకశ్మీర్‌లో నాలుగు దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా గరిష్ఠంగా 58.58 శాతం పోలింగ్ నమోదైంది. కశ్మీర్ లోయలో గరిష్ఠంగా 51.05 శాతం రికార్డయింది. సెప్టెంబర్ 30లోపు జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశించింది. అందుకే అక్కడ త్వరలోనే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలు తలకెత్తుకుంటాం. ఇవి నిజంగా అత్యంత సంతృప్తికరమైన క్షణాలు అని అన్నారు.

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో మొత్తంగా 64.2 కోట్ల మంది భారతీయ పౌరులు ఓటు హక్కును వినియోగించుకుని నూతన ప్రపంచ రికార్డును సృష్టించారని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ ప్రకటించారు. దేశ చరిత్రలో తొలిసారి ఓట్ల లెక్కింపునకు ముందు తోటి కమిషనర్లతో సహా సీఈసీ సోమవారం ఢిల్లీలో పత్రికాసమావేశం ఏర్పాటుచేసి పలు అంశాలపై మాట్లాడారు.

జీ7 దేశాల ఓటర్ల కంటే 1.5 రెట్లు ఎక్కువ

'' 31.2 కోట్ల మంది మహిళలుసహా 64.2 కోట్ల మంది ఓటేశారు. ఈ సంఖ్య జీ7 దేశాల ఓటర్ల కంటే 1.5 రెట్లు ఎక్కువ. 27 యురోపియన్‌యూనియన్ దేశాల ఓటర్ల కంటే 2.5 రెట్లు ఎక్కువ. ఈ ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్లందరికీ అభినందనలు'' అంటూ సీఈసీ వేదికపై లేచి నిలబడి ఓటర్లకు అభినందనలు తెలిపారు. ''ఎన్నికల సిబ్బంది జాగ్రత్త, అప్రమత్తత వల్లే తక్కువ చోట్ల మాత్రమే రీపోలింగ్ చేపట్టాల్సి వచ్చింది. 2019లో 540 చోట్ల రీపోలింగ్ జరిగితే ఈసారి 39 మాత్రమే జరిగాయి'' అని పేర్కొన్నారు.

మా గురించి మాట్లాడుకోరు

'' 1.5 కోట్ల పోలింగ్, భద్రతా సిబ్బంది పోలింగ్ పర్వంలో పాల్గొన్నారు. 4 లక్షల వాహనాలను వినియోగించాం. 135 ప్రత్యేక రైళ్లలో సిబ్బంది, బలగాలను తరలించాం. 1,692 సార్లు హెలికాప్టర్లను వాడాం. కరెన్సీ కట్టలు, ఉచిత తాయిలాలుగా పంపిణీచేస్తున్న వస్తువులు, మద్యం, మత్తుపదార్థాలు సహా రూ.10,000 కోట్లు సీజ్‌చేశాం. ఇంత చేస్తే ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూల జాడ లేదంటూ 'లాపతా జెంటిల్‌మెన్' అని మీమ్స్ వేస్తున్నారు. మేం ఎక్కడికీ పోలేదు. మీ ముందే ఉన్నాంకదా. ఎప్పుడూలేనంతగా ఎన్నికలవేళ 100 పత్రికా ప్రకటనలు, అడ్వైజరీలతో అందర్నీ చైతన్యపరిచాం. మమ్మల్ని చూశాకైనా 'లా పతా జెంటిల్‌మెన్ ఆర్ బ్యాక్' అని మీమ్స్ మారుస్తారేమో. విరబూసిన పువ్వులనే చూస్తారుగానీ తోటమాలిని ఎవరూ పట్టించుకోరు. ప్రజాస్వామ్యంలో గెలుపుఓటములనే అందరూ పట్టించుకుంటారుగానీ సమర్థవంతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించిన మా గురించి ఎవరూ మాట్లాడుకోరు'' అని అన్నారు.


విలేకరుల సమావేశంలో సీఈసీ రాజీవ్ కుమార్

దమ్ముంటే నిరూపించండి

'' ఎన్నికలను విదేశీ శక్తులు ప్రభావితం చేసే ప్రమాదముందని, వాటిని అడ్డుకునేందుకు మేం ఎప్పుడో సిద్ధమయ్యాం. తీరాచూస్తే ఇక్కడి విపక్షాలే అనవసర ఆరోపణలు చేస్తున్నాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రభావితం చేయనున్నారని రిటర్నింగ్ అధికారులపై విపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి. దమ్ముంటే మీ ఆరోపణలను సాక్ష్యాధారాలతో నిరూపించండి. పుకార్లు వ్యాపించజేసి అనుమాన మేఘాలు కమ్ముకునేలా చేయకండి. రిటర్నింగ్ అధికారులుగా పనిచేసే జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్‌లపై మీరు చేస్తున్న ఆరోపణలను నిరూపిస్తే కౌంటింగ్‌కు ముందే వారిపై కఠిన చర్యలకు మేం సిద్ధం' అని అన్నారు.

ఎన్నికల తర్వాత హింసనూ అడ్డుకుంటాం

'' ఎన్నికల కోడ్ ముగిసినా సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలు కొనసాగుతాయి. ఫలితాలు వచ్చాక ఎన్నికల తర్వాత హింసను అడ్డుకునే లక్ష్యంగా తొలిసారిగా ఈ పద్ధతిని అమలుచేస్తున్నాం. ఎన్నికల వేళ ఘర్షణ ఘటనలు చోటుచేసుకున్న పశ్చిమ బెంగాల్, మణిపూర్, ఆంధ్రప్రదేశ్‌సహా పలు రాష్ట్రాల్లోని సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరిస్తాం. రాష్ట్రాలు, కేంద్ర పరిశీలకుల సూచనలు, సలహాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నాం. ఏపీ, బెంగాల్‌లలో ఓట్ల లెక్కింపు తర్వాత 15 రోజులపాటు, యూపీ, ఒడిశా, సిక్కిం, అరుణాచల్‌లో రెండు రోజులపాటు బలగాలు కొనసాగుతాయి'' అని సీఈసీ వివరించారు.

ఎలక్షన్ బీట్

ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌కు విరుద్ధంగా ఉంటాయి: సోనియా

న్యూఢిల్లీ: ఇటీవల వెల్లడైన లోక్‌సభ ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నమైన ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు. డీఎంకే దిగ్గజం, దివంగత ఎం.కరుణానిధి శత జయంతి సందర్భంగా సోమవారం ఢిల్లీలోని డీఎంకే కార్యాలయానికి విచ్చేసి ఆయనకు సోనియా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎగ్జిట్ పోల్స్‌పై సోనియా మాట్లాడారు. '' ఫలితాలపై మేం పూర్తి ఆశావహ దృక్పథంతో ఉన్నాం. ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌కు విరుద్ధంగా వస్తాయని భావిస్తున్నాం. జూన్ 4వ తేదీదాకా ఫలితాలు వెల్లడయ్యేదాకా మనందరం వేచి ఉండాల్సిందే. ఏమౌతుందో చూద్దాం'' అని వ్యాఖ్యానించారు. మోదీ మూడోసారి ప్రధాని అవుతారని, ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని పలు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించిన నేపథ్యంలో కాంగ్రెస్ సహా విపక్షాల 'ఇండియా' కూటమి ఆ ఎగ్జిట్ పోల్స్‌ను ఊహాత్మకమైనవిగా కొట్టిపారేశాయి. 'ఇవి ఎగ్జిట్ పోల్స్ కావు. మోదీ మీడియా పోల్స్' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడం తెల్సిందే.

ఎగ్జిట్ పోల్స్‌లో విశ్వసనీయత ఎంత?

ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యలు

లక్నో: ఎన్డీఏ కూటమి అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమంటూ ఫలితాలిచ్చిన పలు ఎగ్జిట్ పోల్స్ విశ్వసనీయతపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అనుమానం వ్యక్తంచేశారు. సోమవారం లక్నోలో పత్రికాసమావేశంలో ఆయన మాట్లాడారు. ''ఎన్డీఏ సంపూర్ణ మెజారిటీతో విజయం సాధిస్తుందని పలు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చూస్తుంటే అనుమానమొస్తోంది. వీటిని ఎలా విశ్వసించాలి?. ఫలితాల వెల్లడివేళ బీజేపీ అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు ఎగ్జిట్ పోల్స్ ప్రయత్నిస్తున్నాయి' అని ఆరోపించారు.

ఎస్‌కేఎం శాసనసభాపక్ష నేతగా తమాంగ్

గ్యాంగ్‌టక్: సిక్కిం క్రాంతికారీ మోర్చా(ఎస్‌కేఎం) శాసనసభా పక్ష నేతగా ప్రేమ్ సింగ్ తమాంగ్ ఎన్నికయ్యారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో ఆ పార్టీ అసెంబ్లీలోని 32 సీట్లకు గాను 31 సీట్లను కైవసం చేసుకోవడం తెల్సిందే. ఆదివారం రాత్రి సీఎం తమాంగ్ అధికార నివాసంలో జరిగిన శాసనసభాపక్ష సమావేశానికి మొత్తం 31 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఎస్‌కేఎం సెక్రటరీ జనరల్ అరుణ్ ఉప్రెటి శాసనసభా పక్ష నేతగా తమాంగ్ పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యే సోనమ్ లామా బలపరిచారు. అనంతరం ఎమ్మెల్యేలతో కలిసి తమాంగ్ గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను కలిశారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు.

ఓట్ల లెక్కింపు వేళ బీజేపీ నేతల భేటీ

నడ్డా నివాసంలో సమావేశానికి అమిత్ షా, రాజ్‌నాథ్, బీఎల్ సంతోష్ హాజరు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పనితీరు, మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపునకు చేపట్టాల్సిన చర్యలపై బీజేపీ అగ్ర నేతలు చర్చించారు. సోమవారం బీజేపీ చీఫ్ జేపీ నడ్డా నివాసంలో జరిగిన సమావేశానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, సీనియర్ నేత బీఎల్ సంతోష్ తదితరులు హాజరయ్యారు. పోలింగ్ శాతం, బలాలు, బలహీనతలపై విశ్లేషించారు. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే మీడియాతో మాట్లాడారు. 'లోక్‌సభ ఎన్నికలపైన, కొన్ని రాష్ట్రాల్లో పార్టీ బలాలు, బలహీనతలపై సమీక్ష జరిపాం. ఓటింగ్ శాతం, కొన్ని చోట్ల తక్కువ ఓటింగ్ నమోదుకు కారణాలపై సమగ్రంగా చర్చించాం. రాష్ట్రాల్లో కౌంటింగ్ సన్నాహాలు, అలాగే ఫలితాలు వెలువడ్డాక విజయోత్సవాల నిర్వహణపైనా చర్చించాం. హరియాణాలో బీజేపీ పరిస్థితి బాగాలేదని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. త్వరలో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నడ్డా, అమిత్ షా మాజీ సీఎం ఖట్టర్‌తో ప్రత్యేకంగా చర్చించారు' అని తావ్డే తెలిపారు.

హిమాచల్‌లో సుఖు సర్కార్ సేఫ్!

- ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేల రాజీనామాలకు ఆమోదం
- 68 మంది అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 34

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో రాజకీయ అస్థిరతకు తాత్కాలికంగా తెరపడింది. ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు ప్రభుత్వం ఊపిరిపీల్చుకుంది. ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు కే.ఎల్.ఠాకూర్, హోషియార్ సింగ్, ఆశిష్ శర్మలు మార్చి 22న రాజీనామా చేయగా, స్పీకర్ కుల్దీప్‌సింగ్ పథానియా సోమవారం వాటిని ఆమోదించారు. తొలుత కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన ఈ ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు.. ఫిబ్రవరిలో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేశారు. బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్ గెలుపునకు దోహదపడ్డారు. మెజారిటీ ఉండి కూడా కాంగ్రెస్ తమ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీని గెలిపించుకోలేకపోయింది. అప్పటి నుంచి బీజేపీ హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి పావులు కదుపుతోంది. ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడగా.. వారు బీజేపీలో చేరి ఆ పార్టీ గుర్తుపై ఉప ఎన్నికల్లో పోటీచేశారు. మంగళవారం ఫలితాలు వెలువడనున్నాయి. హిమాచల్ అసెంబ్లీ బలం 68 కాగా... తొమ్మిది మంది పోను ప్రస్తుతం 59గా ఉంది. కాంగ్రెస్‌కు 34 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 25 మంది సభ్యులున్నారు. మంగళవారం వెలువడే ఉప ఎన్నికల ఫలితాల్లో ఆరింటికి ఆరు స్థానాలు బీజేపీ నెగ్గినా వారి బలం 31 మాత్రమే అవుతుంది. ఈ పరిస్థితుల్లో గనక ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేల బలం కూడా తోడైతే బీజేపి 34కు చేరుకునే అవకాశాలుండేవి. అలా కాకుండా సరిగ్గా ఫలితాలకు ముందు రోజు ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ఆమోదించడంతో మళ్లీ ఉప ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చేదాకా సుఖు ప్రభుత్వం కొంతకాలం ఊపిరిపీల్చుకున్నట్లే. అదీ మళ్లీ తాజాగా ఫిరాయింపులేవీ జరగకుండా ఉంటే!

కశ్మీర్‌లో లష్కరే కీలక కమాండర్ హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో పుల్వామా జిల్లాలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాక్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా కీలక కమాండర్ రియాజ్ దార్ అలియాస్ సత్తార్ హతమయ్యాడు. కశ్మీర్ వ్యాలీ ఆపరేషనల్ కమాండర్‌గా వ్యవహరించే ఇతడి మృతి దక్షిణ కశ్మీర్‌లో లష్కరేకు కోలుకోలేని దెబ్బగా భద్రతా దళాలు పేర్కొన్నాయి. సోమవారం కార్డన్ సెర్చ్ సందర్భంగా ఉగ్రవాదులు దాగున్న ఇంటికి నిప్పంటుకుంది. ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. ఒకరిని లష్కరే తోయిబా కశ్మీర్ వ్యాలీ ఆపరేషనల్ కమాండర్ రియాజ్ దార్ అలియాస్ సత్తార్‌గా, మరొకరిని రయీస్ దార్‌గా గుర్తించారు. 2015 నుంచి లష్కరేలో పనిచేస్తున్న సత్తార్‌కు గ్రెనేడ్ దాడులు, లక్షిత హత్యలు వంటి 20కి పైగా ఉగ్ర ఘటనలతో సంబంధముంది. కొన్నేళ్లుగా బలగాల కళ్లు గప్పి తిరుగుతున్న సత్తార్ పై రూ.10 లక్షలు, రయీస్‌పై రూ.5 లక్షల రివార్డున్నట్టు కశ్మీర్ ఐజీపీ వీకే బిర్ది చెప్పారు.

జూలై-సెప్టెంబర్‌కల్లా లా నినో

60 శాతం అవకాశాలు ఉన్నాయన్న ప్రపంచ వాతావరణ సంస్థ

న్యూఢిల్లీ: రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, అసాధారణ వాతావరణ పరిస్థితులను మోసుకొచ్చిన 2023-24 ఎల్‌నినో సీజన్ ఈసారి జూలై-సెప్టెంబర్‌కల్లా లా నినోగా మారొచ్చని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) తాజా కబురు చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ వరసగా 11వ నెల(ఏప్రిల్) అత్యుష్ణ నెలగా రికార్డులకెక్కింది. సముద్రజలాల ఉపరితల ఉష్ణోగ్రతలూ గత 13 నెలలుగా అత్యధిక స్థాయిల్లో నమోదవుతున్నాయని డబ్ల్యూఎంఓ పేర్కొంది. మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు వేడిగా ఉండటంతో సంభవించే ఎల్‌నినో పరిస్థితులే దీనంతటికీ కారణమని డబ్ల్యూఎంఓ తెలిపింది. అడవుల నరికివేత, కాలుష్యం వంటి మానవ కార్యకలాపాలకు తోడు హరిత వాయువులు ఈ పరిస్థితులకు ప్రధాన కారణంగా నిలిచాయి. ఇంకా కొనసాగుతున్న ఎల్‌నినో కారణంగా భారత్, పాకిస్తాన్‌సహా దక్షిణాసియాలోని కోట్లాది మంది జనం దారుణమైన వేడిని చవిచూశారు. అయితే జూలై-సెప్టెంబర్‌కల్లా ఎల్‌నినో తగ్గిపోయి లా నినో వచ్చేందుకు 60 శాతం అవకాశముందని, ఆగస్ట్-నవంబర్ కల్లా అయితే 70 శాతం అవకాశముందని డబ్ల్యూఎంఓ తాజాగా అంచనావేసింది. ఈసారి మళ్లీ ఎల్‌నినో పుంజుకునే అవకాశాలు లేవని తేల్చిచెప్పింది. ఎల్‌నినో కారణంగా భారత్‌లో వర్షపాతం భారీగా తగ్గిపోవడం, లా నినో కారణంగా విస్తారంగా వర్షాలు కురవడం తెల్సిందే. ఆగస్ట్-సెప్టెంబర్ కల్లా భారత్‌లో లా నినో పరిస్థితులు ఏర్పడి చక్కటి వర్షాలు కురుస్తాయని ఇటీవల భారత వాతావరణ శాఖ అంచనావేయడం విదితమే. భారత్‌లో 52 శాతం సాగుభూమి వర్షాధారితం కావడంతో భారతరైతులకు వర్షాలకు అవినాభావ సంబంధం ఏర్పడింది. '' 2023 జూన్ నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రతి నెలా రికార్డు ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. మహాసముద్ర జలాల ఉపరితల ఉష్ణోగ్రతలది వచ్చే నెలల్లో కీలక భూమిక' అని డబ్ల్యూఎంఓ ఉప ప్రధాన కార్యదర్శి కో బారెట్ అన్నారు.

సాక్షి కరీంనగర్

మంగళవారం | 4 | జూన్ | 2024



రాజన్న దర్శనానికి 4 గంటలు
వేసవి సెలవులు దగ్గరపడుతుండడంతో రాజన్న దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సోమవారం దాదాపు 30వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. 8లో▸



గంజాయి అమ్మేందుకే వచ్చారా?
గంజాయి వ్యాపారం ఊపందుకుంటోంది. యువకులకు విక్రయించేందుకు గంజాయి మాఫియా వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
38.0/28.0

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌కు సీఎం సత్కారం



సాయికిరణ్‌ను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన సివిల్స్ 27వ ర్యాంకర్ నందాల సాయికిరణ్‌ను సోమవారం క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సన్మానించారు. భవిష్యత్‌లో ప్రజలకు ఉత్తమ సేవలు అందించి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు ఉన్నారు.

కౌంటింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలి

- కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానం వస్తే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలని బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి శుభ మంగళగార్డెన్‌లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. కౌంటింగ్ ప్రారంభంలో ఈవీఎం మిషన్ల సీళ్లను పరిశీలించాలని, కౌంటింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలపై సీల్ వేసి బాధ్యులైన అధికారులు సంతకాలు చేసేవరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలైన ఓట్లు, కౌంటింగ్‌లో వెల్లడైన ఓట్లలో తేడా ఉంటే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మీసాల చంద్రయ్య, బాస సత్యనారాయణ, బోయినిపల్లి ప్రవీణ్‌రావు, ఎర్రం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో అడ్మిషన్లు పెంచండి



మాట్లాడుతున్న ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి హమీద్

కరీంనగర్: సోషల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచేలా వార్డెన్లు దృష్టిసారించాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి ఎండీ హమీద్ ఆదేశించారు. సోమవారం ఎస్సీ సంక్షేమ శాఖ వార్డెన్ల సమావేశం డీడీ చాంబర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డెన్లు గ్రామాల్లోకి ప్రజాప్రతినిధులతో వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ఎస్సీ సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాలను వివరించి హాస్టళ్లలో పిల్లలను చేర్పించేలా ఒప్పించాలని పేర్కొన్నారు. వసతి గృహాలను తెరిచి పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. నాల్గో తరగతి సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఆదేశాలను తూచ తప్పకుండా పాటించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్‌డబ్ల్యూవో ఎం.తిరుపతి, జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

కరీంనగర్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రశాంతంగా జరిగాయని డీఈవో జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, హుజూరాబాద్ రెండు కేంద్రాల్లో ప్రథమ భాష పరీక్షలో మొత్తం 305 మంది విద్యార్థులకు 274 మంది హాజరు కాగా 31 మంది గైర్హాజరయ్యారని అన్నారు. పరీక్ష నిర్వహణలో భా గంగా రెండు తనిఖీ బృందాలు రెండు పరీక్ష కేంద్రాలను సందర్శించారని, డీఈవో రెండు ప రీక్ష కేంద్రాలను సందర్శించారని పేర్కొన్నారు.

ఎంపీ ఎవరో?



బండి సంజయ్ (బీజేపీ)



వినోద్‌కుమార్ (బీఆర్ఎస్)



రాజేందర్‌రావు (కాంగ్రెస్)

- మరికొన్ని గంటల్లో తీర్పు
- నేడు ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో మొదలు
- 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ పమేలా సత్పతి
- కరీంనగర్ పార్లమెంట్ బరిలో 28 మంది అభ్యర్థులు
- వేములవాడ ఫలితం త్వరగా వెలువడే అవకాశం


సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ పార్లమెంట్ ఫలితాల వెల్లడికి రంగం సిద్ధమైంది. గత నెల 13న ఎన్నికలు జరగగా, ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలు కానుంది. మొత్తం 28 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 17,97,150 మంది ఓటర్లు ఉండగా, 13,03,690 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 72.54 శాతం పోలింగ్ నమోదైంది. వేములవాడ (1,68,373 పోలైన ఓట్లు) ఫలితం త్వరగా, కరీంనగర్ 2,22,296(పోలైన ఓట్లు) ఫలితం ఆలస్యంగా వెలువడే అవకాశాలున్నాయి.

స్ట్రాంగ్ రూముల్లో భద్రంగా..
పోలింగ్ పూర్తయిన తర్వాత 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను కరీంనగర్‌లోని ఎస్సారార్ డిగ్రీ కాలేజీలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ మేరకు కళాశాలలో ఓట్ల లెక్కింపునకు కలెక్టర్ పమేలా సత్పతి సారథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆయా నియోజకవర్గాలకు వేర్వేరుగా ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

రౌండ్లవారీగా ఫలితాలు..
కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల కోసం సీట్లు కేటాయించారు. విద్యుత్ నిరంతరాయంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ కోసం నియోజకవర్గం వారీగా సిబ్బందిని అలాట్ చేశారు. దీనికోసం సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు 124 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 124, మైక్రోఅబ్జర్వర్లు 124 మందిని కేటాయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు 21, కౌంటింగ్ అసిస్టెంట్లు 35, మైక్రో అబ్జర్వర్లు 14 మందిని అలాట్ చేశారు. మంగళవారం ఉదయం 6 గంటలకు వీరిని టేబుళ్ల వారీగా కేటాయించనున్నారు. 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. 8.30 గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. ఎన్నికల ఫలితాలను రౌండ్లవారీగా ప్రకటించనున్నారు. ఫలితాలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌తోపాటు ఎన్‌కోర్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయనున్నారు.

144 సెక్షన్ అమలు..
కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి కౌంటింగ్ ముగిసేవరకు ఎస్సారార్ డిగ్రీ కాలేజీ ఎదుట ఉన్న రోడ్డుపై రాకపోకలకు అనుమతి లేదు. రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లకు గుర్తింపు కార్డులను అందించారు. సోమవారం ఎస్సారార్ కళాశాలలో కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పమేలా సత్పతి సాధారణ ఎన్నికల పరిశీలకులు అమిత్ కటారియా, కౌంటింగ్ పరిశీలకురాలు నజ్మాతో కలిసి పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో ఉత్కంఠ..
పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థులందరూ ఫలితాలపై ఉత్కంఠతో ఉన్నారు. వివిధ సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు భిన్నంగా ఉండటంతో ప్రధాన పార్టీల నాయకులు, వారి అనుచరులు ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా? కౌంటింగ్ మొదలవుతుందా? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రధాన పార్టీ నేతలంతా విజయంపై ధీమాగా ఉన్నారు. మరోవైపు ఎవరు గెలుస్తారనే విషయంలో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి.



నియోజక వర్గం	పోలింగ్ శాతం
కరీంనగర్	60.51
చొప్పదండి	75.36
వేములవాడ	74.44
సిరిసిల్ల	75.27
మానకొండూరు	77.75
హుజూరాబాద్	73.82
హుస్నాబాద్	77.25

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	హాల్ నెం.	టేబుళ్లు	రౌండ్లు
కరీంనగర్	395	75	18	22
చొప్పదండి	327	48	14	23
వేములవాడ	260	రూసాబిల్డింగ్	14	19
సిరిసిల్ల	287	రూసాబిల్డింగ్	14	21
మానకొండూర్	316	33, 34	14	23
హుజూరాబాద్	305	లైబ్రరీ రీడింగ్	14	22
హుస్నాబాద్	304	53, 54	14	22
పోస్టల్ బ్యాలెట్	--	82	14	--
మొత్తం	2,194	--	116	152

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఎన్నికల పరిశీలకులతో కలిసి ఎస్సారార్ కళాశాల సందర్శన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: ఓట్ల లెక్కింపునకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ పమేలా సత్పతి వెల్లడించారు. కరీంనగర్ ఎస్సారార్ డిగ్రీ కాలేజీలో కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ కటారియా, కౌంటింగ్ పరిశీలకురాలు జీ నజ్మాతో కలిసి పరిశీలించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ ఇక్కడే జరగనున్నందున సీసీ కెమెరాలు, బారికేడ్స్, పలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కేంద్రాల వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ హాల్లోకి గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తామని పేర్కొన్నారు. కౌంటింగ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఓట్లను లెక్కించాలని సూచించారు. స్ట్రాంగ్ రూముల్లో నుంచి కౌంటింగ్ హాల్లోకి ఈవీఎంలను జాగ్రత్తగా తరలించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు, రాజేశ్వర్, ఏసీపీ నరేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు భారీ బందోబస్తు

- నగరంలో 144 సెక్షన్ అమలు
- సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం నగరంలో 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు సీపీ అభిషేక్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటింగ్ సజావుగా సాగేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 4వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు.. ఒకవేళ రీ కౌంటిగ్ జరిగితే అవి ముగిసేవరకు ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఐదుగురికి మించి గుమిగూడరాదని తెలిపారు. అత్యవసరంగా సమావేశం కావాల్సి వస్తే సంబంధిత అధికారి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. 144 సెక్షన్ ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

దారి మళ్లింపు ఇలా..



- స్థానిక ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓట్ల లెక్కింపు ఉన్నందున ఉదయం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ముగిసే వరకు కౌంటింగ్ సెంటర్ ఎదుట గల రోడ్డు నుంచి వాహనాల రాకపోకలకు అనుమతి లేదని సీపీ ప్రకటించారు.
- జగిత్యాల నుంచి కరీంనగర్ వచ్చే వాహనాలు రేకుర్తి చౌరస్తా నుంచి శాతవాహన యూనివర్సిటీ, పద్మనగర్ మీదుగా నగరంలోకి చేరుకోవాలి. కరీంనగర్ నుంచి జగిత్యాల వెళ్లే వాహనాలు కోర్ట్ కాంప్లెక్స్ దాటగానే జ్యోతినగర్, కెమిస్ట్రీ భవన్, శాతవాహన యూనివర్సిటీ, రేకుర్తి చౌరస్తా మీదుగా వెళ్లాలి.
- బ్యాంకుకాలనీలోని డీమార్ట్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు బ్యాంకుకాలనీ రోడ్డు నంబర్ వన్ మీదుగా స్థానిక స్పెన్సర్స్ వద్ద గల రోడ్డు నుంచి నగరంలోకి వెళ్లాలి. స్పెన్సర్ నుంచి ఆర్టీసీ వర్క్‌షాప్, డీ మార్ట్ వరకు స్టెరైల్ జోన్‌గా నిర్ణయించారని, ఈ ఏరియాలో ఎలాంటి వాహనాలు తిరిగేందుకు అనుమతి లేదని సీపీ తెలిపారు.

మద్యం దుకాణాలు బంద్
ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం వైన్స్‌లు, బార్లు, క్లబ్‌లు, మిలిటరీ క్యాంటీన్‌లు మూసివేయాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు
ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్లు సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. సీపీ పర్యవేక్షణలో ఇద్దరు అడిషనల్ డీసీపీలు, 11 మంది ఏసీపీలు, 16 మంది సీఐలు, 39 మంది ఎస్సైలు, 46 మంది ఏఎస్సై/హెడ్‌కానిస్టేబుళ్లు, 220 మంది కానిస్టేబుళ్లు, 125 మంది హోంగార్డులు, 8 స్పెషల్ యాక్షన్ టీములు, 60మందికిపైగా స్పెషల్ పోలీసులు పాల్గొంటారని సీపీ పేర్కొన్నారు.

తొండల కొట్లాట.. తెగిన కరెంట్ వైర్లు



రెండు తొండల కొట్లాటతో విద్యుత్‌లైన్ తెగి కిందపడింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో 11కేవీ విద్యుత్‌లైన్ స్తంభంపై సోమవారం ఉదయం 11గంటలకు రెండు తొండలు కొట్లాడుకున్నాయి. ఈక్రమంలో విద్యుత్ లైనుకు తొండలు తగలడంతో తెగి కిందపడిపోయింది. సిబ్బంది వెంటనే తెగిపడిన విద్యుత్‌వైరును సరిచేశారు. తొండల నిర్వాకంతో ఉదయం 11.08 గంటల నుంచి మధ్యాహ్నం 12.07 గంటలవరకు నగరంలోని అపోలో ఆస్పత్రి, హన్మాన్‌నగర్, తెలంగాణ భవన్, విద్యారణ్యపురి కాలనీ, మానికేశ్వర్‌నగర్, విఘ్నేశ్వరకాలనీ, సరస్వతినగర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. – కరీంనగర్‌రూరల్

తెలంగాణ సాధించిన ఘనత కేసీఆర్‌దే



జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జీవీ రామకృష్ణారావు తదితరులు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: పద్నాలుగు ఏళ్ల పాటు ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్న ఘనత బీఆర్ఎస్ అగ్రనేత కేసీఆర్‌దేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తీగలగుట్టపల్లిలోని ఉత్తర తెలంగాణ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అని కరీంనగర్ నుంచే సింహగర్జన చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్, బీఆర్ఎస్‌ను విమర్శించే అర్హత ఎవరికీ లేదన్నారు. ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్న బీజేపీ, కాంగ్రెస్‌లతో ఒరిగేదేమి లేదని పేర్కొన్నారు. పదేళ్లల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా అభివృద్ధి చేసి అన్నపూర్ణ రాష్ట్రంగా మార్చుకుంటే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలల్లోనే ఆగం చేస్తుందని విమర్శించారు. అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని, విత్తనాలు, ఎరువుల కోసం క్యూలైన్లు కట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆరునెలల్లోనే రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో వెనకబాటుకు గురి చేసిన ఘనచరిత్ర కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. పాలనపై దృష్టి పెట్టకుండా కక్ష సాధింపు చర్యలతో కాంగ్రెస్, బీజేపీలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని మండిపడ్డారు. భూమి, ఆకాశం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీలు మార్చే నాయకులను ప్రజలు గమనిస్తున్నారని, మున్ముందు వారికి భంగపాటు తప్పదని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి పూర్వవైభవం తీసుకవచ్చేందుకు గ్రామస్థాయి నుంచి కృషి చేస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే బీఆర్ఎస్‌కు మంచిరోజులు రానున్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేసి బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పేలా తయారు కావాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ వై.సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నాయకులు పొన్నం అనిల్, ఏనుగు రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై కచ్చితమైన హామీ ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: డీడీలు తీసిన గొల్ల కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీపై కచ్చితమైన హామీ ఇవ్వాలని గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేశ్‌యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా పశువైద్యాధికారి బి.నరేందర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం జిల్లా వ్యాప్తంగా గొర్రెల పెంపకదారుల సహకార సంఘాల సభ్యులు 8,753 మంది ఎదురు చూస్తున్నారని తెలిపారు. వారిలో 3,414 మంది ఒక్కొక్కరు రూ.43,750 కలెక్టర్ అకౌంట్‌కు డీడీల రూపంలో చెల్లించి నెలలు గడుస్తుందని వివరించారు. ప్రస్తుతం వారందరి డబ్బులు వాపస్ తీసుకోవాలని అధికారులు అంటున్నారు కానీ, లబ్ధిదారులు అప్పు చేసి 25 శాతం వాటా ధనం చెల్లిస్తే వారికి నిరాశే ఎదురైందని అన్నారు. గొల్లకురుమలకు వడ్డీల భారం తప్ప ఏ న్యాయం జరగలేదని వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీలో అవకతవకలు జరిగాయనే సాకుతో మొత్తం పథకాన్ని పక్కదారి పట్టించడం సరికాదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు నగదు బదిలీ ద్వారా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పొనగాని మహేశ్, భూస అయిలయ్య, రాజయ్య, కొమ్ము శ్రీకాంత్, అజయ్ పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలతో ప్రజలకు చేరువ

- 500 పడకలకు ప్రధానాసుపత్రి అప్‌గ్రేడ్
- 'సాక్షి'తో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత



కరీంనగర్‌టౌన్: జిల్లాలో వైద్య పరంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా హైదారాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. స్వరాష్ట్రం ఏర్పడ్డాక అలాంటి పరిస్థితులు దూరమయ్యాయి. అంచలంచెలుగా వైద్యరంగంలో మార్పులు వచ్చాయి. ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందేలా అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆసుపత్రుల అప్‌గ్రేడేషన్, వైద్యులు, సిబ్బంది నియామకాలు, మందులు, పరికరాల సమకూర్పు, మెడికల్ కళాశాల ఏర్పాటు, ప్రజలకు చేరువలో పల్లె దవాఖానాలు.. ఇలా వైద్య రంగంలో అభివృద్ధి జరిగి ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా డీఎంహెచ్‌వోతో 'సాక్షి' ఇంటర్వ్యూ.

ప్రతీ వ్యక్తికి వైద్య సేవలందించడమే లక్ష్యం
జిల్లాలోని ప్రతీ వ్యక్తికి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రితో పాటు 2 కమ్యూనిటీ, 18 ప్రాథమిక, 6 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లు, పల్లె దవాఖానాలతో సేవలు అందిస్తున్నాం. వైద్యులు, మందులు ఉండేలా చర్యలు చేపడుతున్నాం.

కరోనాను కట్టడి చేశాం
ఇండోనేషియా నుంచి వచ్చిన మత ప్రచారకులతో కరీంనగర్‌లో కరోనా ప్రవేశించింది. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారి పెద్ద సంఖ్యలో కేసులు ఇక్కడే బయటపడ్డాయి. దీంతో నగరంలోని కొన్ని ప్రాంతాలను రెడ్‌జోన్‌లుగా ప్రకటించి వైరస్‌ను అరికట్టాం. ప్రభుత్వాసుపత్రిలో 100 పడకలతో ఐసోలేషన్‌తో పాటు క్వారంటైన్ సెంటర్, 21 వేల లీటర్ల ఆక్సిజన్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసి కరోనా కట్టడి చేశాం. వైద్యులు, సిబ్బంది, అధికార యంత్రాంగం నిర్విరామంగా సేవలందించారు.

రానున్నరోజుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యం
జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో ఏటా 100 మంది విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేందుకు అవకాశం కలిగింది. అలాగే కళాశాలకు అనుబంధంగా ప్రభుత్వాసుపత్రి సైతం అభివృద్ధి జరుగుతోంది. అన్ని విభాగాల వైద్యులు అందుబాటులోకి వచ్చారు. రాబోయే రోజుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యం కూడా ప్రజలకు లభించనుంది.

ప్రభుత్వాసుపత్రి అప్‌గ్రేడ్
ప్రభుత్వాసుపత్రి, ఎంసీహెచ్ 350 పడకల నుంచి 500 పడకలకు అప్‌గ్రేడ్ అయింది. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులోకి వచ్చాయి. ఆర్టీపీసీఆర్ ల్యాబ్, రేడియాలజీ విభాగం, అత్యాధునిక సౌకర్యాలతో తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్, ప్రమాదాల్లో గాయపడినవారిని కాపాడేందుకు రూ.2.3 కోట్లతో క్రిటికల్ కేర్ ప్రత్యేక విభాగం నిర్మాణం జరుగుతోంది.

నకిలీ వైద్యుల బెడద తగ్గింది
పల్లె దవాఖానాల ఏర్పాటుతో గ్రామీణ ప్రజలకు వైద్యం చేరువైంది. అలాగే నకిలీ వైద్యుల బెడద చాలా వరకు తగ్గింది. క్వాలిఫైడ్ డాక్టర్లు ఉండడంతో ప్రజలు మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారు. పల్లె దవాఖానాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. వందశాతం డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా చర్యలు చేపడుతున్నాం. గర్భిణులను 102 వాహనాల ద్వారా ఇంటి నుంచి తీసుకువచ్చి తిరిగి ఇంట్లో చేర్చే వరకు బాధ్యత తీసుకుంటున్నాం.

క్లుప్తంగా

పాల ట్యాంక్‌లో పడి.. అనంతలోకాలకు

- మృతుడు డెయిరీలో టెక్నికల్‌ ఆఫీసర్‌


ముజీజ్‌ మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్‌): ప్రమాదవశాత్తు పాల ట్యాంక్‌లో పడి, మృతిచెందాడు ఓ డెయిరీ టెక్నికల్‌ ఆఫీసర్‌. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం కృష్ణ జిల్లా నందిగామకు చెందిన షేక్‌ ముజీజ్‌(44) జమ్మికుంట మండలం వెంకటేశ్వరపల్లిలోని ఎస్‌ఆర్‌కే డెయిరీలో టెక్నికల్‌ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా సోమవారం ఈటీపీ ట్యాంక్‌ను పరిశీలిస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి, అందులోనే పడిపోయాడు. గమనించిన మేనేజర్‌, సిబ్బంది ఆయనను బయటకు తీసి, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య షేక్‌ కరీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌ సీఐ రవి పేర్కొన్నారు.

మృతదేహం అప్పగింత

జమ్మికుంట(హుజూరాబాద్‌): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మద్యం మత్తులో కిందపడి మృతి చెందిన రాకేశ్‌(30) వివరాలను గుర్తించామని టౌన్‌ సీఐ రవి తెలిపారు. మృతదేహాన్ని సోమవారం అతని తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. రాకేశ్‌ మహారాష్ట్రలోని చంద్రాపూర్‌ జిల్లా బల్హార్షా వాసి అని పేర్కొన్నారు. మృతుడి తండ్రి నాగేశ్వర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రెస్టారెంట్‌కు జరిమానా

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ అధికారులు స్థానిక ఐబీ కాలనీలోని వైష్ణవి రెస్టారెంట్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. పాడైపోయిన చికెన్‌, గడువు తేదీ దాటిన పదార్థాలతో ఆహారం తయారు చేయడాన్ని గుర్తించారు. నిర్వాహకులకు రూ.10 వేల జరిమానా విధించారు. చట్ట ప్రకారం సదరు రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవడానికి ఫుడ్‌ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్‌, నాగభూషణం, సునీల్‌, హెల్త్‌ అసిస్టెంట్లు కిరణ్‌, వైకుంఠం, ఎన్విరాన్‌మెంటల్‌ ఇంజినీర్‌ మధుకర్‌ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌ మెయిల్‌ చేసిన రిపోర్టర్‌పై కేసు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్‌ షాకీర్‌ను డబ్బుల కోసం బ్లాక్‌ మెయిల్‌ చేసిన ఓ న్యూస్‌ చానల్‌ రిపోర్టర్‌ గట్టిపెల్లి రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. షాకీర్‌పై ఓ వృద్ధుడు రెండు రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని తమ చానల్‌లో ప్రసారం చేయకుండా ఉండటానికి రూ.25 వేలు ఇవ్వాలని రాజశేఖర్‌ డిమాండ్‌ చేయగా, షాకీర్‌ రూ.5 వేలు ఫోన్‌ పే ద్వారా చెల్లించాడు. అడిగిన మొత్తం ఇవ్వకపోవడంతో రాజశేఖర్‌ ఆ డబ్బులను తిరిగి ఆయనకు పంపించాడు. అనంతరం చానల్‌లో న్యూస్‌ను ప్రసారం చేయించాడు. దీంతో డబ్బుల కోసం తనను బ్లాక్‌ మెయిల్‌ చేయడమే కాకుండా అసత్యపు వార్తను ప్రసారం చేసి, తన పరువుకు భంగం కలిగించాడని షాకీర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి అమ్మేందుకే కరీంనగర్‌ వచ్చారా?

- 70 కేజీల గంజాయితో దొరికిన ముగ్గురు జైలుకు..
- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- ప్రధాన నిందితుడి కోసం ఆంధ్రా పోలీసుల గాలింపు
- అతన్ని కస్టడీలోకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగులోకి?


గంజాయి, నిందితులను చూపుతున్న పోలీసులు (ఫైల్‌)

కరీంనగర్‌ క్రైం: యువత మత్తుకు బానిసవుతుండటంతో గంజాయి వ్యాపారం ఊపందుకుంటోంది. ఫలితంగా యువకులకు విక్రయించేందుకు గంజాయి మాఫియా వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. కరీంనగర్‌ జిల్లాకు ఒడిశా, విశాఖపట్నం, అరకు ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎక్కువగా దిగుమతి అవుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇటీవల కరీంనగర్‌ తీగల వంతెన వద్ద ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఇద్దరు, మహారాష్ట్రకు చెందిన ఒకరు 70 కేజీల గంజాయిని కారులో తరలిస్తుండగా వన్‌టౌన్‌ పోలీసులు పట్టుకున్నారు. సీజ్‌ చేసి, వారిని కరీంనగర్‌ జైలుకు తరలించారు. ఈ గంజాయిని మహారాష్ట్రకు తరలించి, అక్కడ విడిగా విక్రయించేందుకు నిందితులు సిద్ధమైనట్లు సమాచారం.

ఒకరు కరడుగట్టిన నేరస్తుడు..

వివిధ రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా చేస్తున్న నిందితులు కరీంనగర్‌కు దిగుమతి చేస్తున్నారు. వీరు ఇదే పనిగా దందా కొనసాగిస్తున్నారు. గతంలో అరకు, విశాఖపట్నం, భద్రాద్రి కొత్తగూడెం, ఛత్తీస్‌గఢ్‌ తదితర ప్రాంతాల నుంచి రవాణా చేస్తూ పలువురు పట్టుబడ్డారు. విచారణలో కరీంనగర్‌కు రైళ్లు, బస్సుల్లో తీసుకొచ్చి, ఇక్కడి కాలేజీ విద్యార్థులు, కార్మికులు, కూలీలను టార్గెట్‌గా చేసుకొని, అమ్మకాలు జరిపినట్లు తేలింది. తాజాగా ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా కరీంనగర్‌లో పట్టుబడిన వారిలో ఒకరు కరడుగట్టిన నేరస్తుడని, అతని కోసం ఆంధ్రా పోలీసులు కూడా కొన్ని రోజులుగా గాలిస్తున్నారని తెలిసింది. అయితే, ఆ వ్యక్తి పోలీసులు ఎంత విచారించినా నోరు మెదపకపోవడంతో జైలుకు తరలించారు. తిరిగి కస్టడీకి తీసుకుంటే మరింత సమాచారం వస్తుందని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. పట్టుబడిన ముగ్గురిలో ఇద్దరికి గతంలో నేరచరిత్ర ఉందని, ఒకరు మాత్రం తాజాగా గంజాయి రవాణాలో పాలుపంచుకుంటున్నట్లు గుర్తించారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలించే క్రమంలో కరీంనగర్‌లోనూ గంజాయి అమ్మేందుకే ఇటుగా వస్తున్నారా అని అనుమానిస్తున్నారు. గంజాయి పండించేవారు మొదలు కిందిస్థాయిలో దాన్ని సేవించేవారిని సైతం పట్టుకుంటేనే ఈ దందాకు అడ్డుకట్ట వేయవచ్చని సీనియర్‌ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. గంజాయి పట్టుబడిన కేసులో ప్రధాన నిందితుడిని కస్టడీకి తీసుకుంటే ఇంకెలాంటి విషయాలు బయటకు వస్తాయో చూడాలి.

రాజన్న దర్శనానికి నాలుగు గంటలు



క్యూలైన్లలో భక్తులు, కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఈవో రామకృష్ణ కుటుంబసభ్యులు

- వేములవాడలో పోటెత్తిన భక్తులు
- క్యూలైన్లలో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

వేములవాడ: వేసవి సెలవులు దగ్గరపడుతుండడంతో రాజన్న దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సోమవారం దాదాపు 30 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఒక్కో భక్తుడికి నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లు కిక్కిరిసి ఉండడంతో ఉక్కపోతతో భక్తులు ఇబ్బంది పడ్డారు. సోమవారం కావడంతో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మహానివేదన నిర్వహించగా.. ఈ సమయంలో దర్శనాలు నిలిపివేశారు. ప్రసాదాల కొనుగోలు వద్ద తోపులాట జరిగింది. స్వామి వారిని ఆలయ ఈవో రామకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో రామకృష్ణ, ఏఈవోలు శ్రీనివాస్‌, ప్రతాప నవీన్‌ పరిశీలించారు. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.

అంజన్న పెద్ద జయంతి ఆదాయం రూ.1.51 కోట్లు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న పెద్ద జయంతి సందర్భంగా ఆలయానికి భారీగా ఆదాయం సమకూరినట్లు అధికారులు సోమవారం తెలిపారు. గత నెల 30 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు నిర్వహించిన ఉత్సవాల సందర్భంగా రూ.1,51,38,490 వచ్చినట్లు పేర్కొన్నారు. అత్యధికంగా మాల విరమణ ద్వారా రూ.31 లక్షలు వచ్చాయన్నారు. గత కొన్నేళ్లలో ఎప్పుడూ లేనంతగా 48 గంటలపాటు భక్తుల రద్దీ కొనసాగిందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

- 24 గంటలైనా పోస్టుమార్టం చేయని వైనం
- పోలీసుల తీరుపై మృతుడి కుటుంబసభ్యుల ధర్నా


ఎల్లయ్య (ఫైల్‌)


ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సైకిల్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గంభీరావుపేట మండలంలోని గోరింట్యాలకు చెందిన గొల్లపల్లి ఎల్లయ్య(65) ఆదివారం ఉదయం గ్రామంలోనే సైకిల్‌పై వెళ్తుండగా.. కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతిచెందాడు. అయితే, చనిపోయి 24 గంటలు దాటినా అక్కడ పోస్టుమార్టం చేయించడంలో స్థానిక పోలీ సులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు సోమవా రం గోరింట్యాలలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఎల్లయ్య మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని త్వరగా అప్పగించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్‌ సంఘటన స్థలానికి చేరుకొని, గాంధీ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తామని, న్యాయం జరిగేలా చూస్తామనడంతో ఆందోళన విరమించారు.

పలువురిపై కేసు..

రోడ్డుపై ధర్నా చేశారని కుమిరిశెట్టి మహేందర్‌, మెండే సుమన్‌, అలివేలి మురళి, శనిగరపు ముత్తయ్య, అలివేలి లక్ష్మయ్య, దండవేని మురళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్‌ తెలిపారు.

బావిలో పడిన శునకాన్ని రక్షించారు..


కుక్కను పైకి తీసుకొస్తున్న ఫైర్‌ సిబ్బంది

కరీంనగర్‌రూరల్‌: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిన వీధికుక్కను అగ్ని మాపక సిబ్బంది రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌ మండలం దుర్శేడ్‌లోని ఓ వ్యవసాయ బావిలో నాలుగు రోజుల క్రితం ఓ శునకం పడిపోయింది. ఆహారం, నీరు లేక ఆకలితో అల్లాడుతోంది. సోమవారం దాని అరుపులు విన్న స్థానికులు స్ట్రే యానిమల్‌ ఫౌండేషన్‌ ప్రతినిధి గౌతం, శ్రీలక్ష్మి జంతుసంరక్షణ ప్రతినిధి ఆసిరి సుమన్‌కు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకొని, అగ్నిమాపక సిబ్బందికి ఫోన్‌ చేశారు. వారు వచ్చి, బావిలోకి నిచ్చెన ద్వారా దిగి, కుక్కను వలలో బంధించి బయటకు తీసుకొచ్చారు. ప్రస్తుతం దాని ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉంది. ప్రాణాపాయస్థితిలో ఉన్న శునకాన్ని కాపాడినందుకు జంతుప్రేమికులు వారిని అభినందించారు.

వలస కార్మికుడి మృతిపై విచారణ


ఆధారాల కోసం చూస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి(వేములవాడ): మండల కేంద్రంలో వలస కార్మికుడు నాయక్‌ రసూల్‌(36) ఆదివారం ఉదయం మృతిచెందిన విషయం విధితమే. అతని మృతిపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సోమవారం విచారణ చేపట్టారు. బంగ్లాపై మృతదేహం గుర్తించిన చోట రక్తపు మరకలు ఉండటం, బలమైన వస్తువుతో తలపై బాదడంతో చెవుల్లో నుంచి రక్తం వచ్చి చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. భవన యజమాని పుట్టయ్య కుటుంబసభ్యులను ఏవైనా శబ్దాలు వినిపించాయా అని అడిగారు. ఆధారాల కోసం బిల్డింగ్‌ చుట్టుపక్కల ప్రాంతాలను గంటకు పైగా పరిశీలించారు. రెండు, మూడు చోట్ల రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించారు. ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో వెనుదిరిగారు. బంగ్లాపై అక్కడక్కడ రక్తపు మరకలను తుడిచి, నీటితో కడిగేశారని స్థానికులు చర్చించుకుంటున్నారు. మృతుడి బంధువులపై అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారణ జరిపినట్లు సమాచారం.

దాడికి గురైన కాంగ్రెస్‌ నాయకుడి మృతి

- చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృత్యుఒడికి..
- పథకం ప్రకారమే చేశారన్న మృతుడి సోదరుడు
- ఆస్పత్రి వద్ద పోలీసులపైనా నిందితుల దాడి
- మాజీ సర్పంచ్‌ సహా ఆరుగురిపై కేసు
- ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు : విప్‌ 'అడ్లూరి'


నరేశ్‌ (ఫైల్‌)


పాడె మోస్తున్న ప్రభుత్వ విప్‌ లక్ష్మణ్‌కుమార్‌

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని కటికెనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ మండల మాజీ ప్రధాన కార్యదర్శి రేండ్ల నరేశ్‌(40) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయనపై దాడి చేసి, మృతికి కారణమైన ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నరేశ్‌ సోదరుడు సతీశ్‌ కథనం ప్రకారం.. రేండ్ల నరేశ్‌ కటికెనపల్లిలో గత ఐదేళ్లలో సిమెంట్‌ రోడ్ల అభివృద్ధి పనుల్లో జరిగిన నిధులు దుర్వినియోగంపై ఆర్టీఐకి దరఖాస్తు చేశాడు. పనుల విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, చామనపల్లి భూ విషయంలో అతని ప్రోత్సాహంతోనే తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని మాజీ సర్పంచ్‌ కారుపాకల రాజయ్య అనుమానించాడు. నరేశ్‌ను ఎలాగైనా చంపాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా తనకు ఆరోగ్యం బాగా లేదని చెప్పి, రాజయ్య హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరాడు. అంతకుముందే నరేశ్‌ను చంపాలని, ఎదైనా తాను చూసుకుంటానని తన కుమారులు కారుపాకల కుమార్‌, వెంకటేశ్‌లతోపాటు బోనగిరి శ్రీనివాస్‌, పాటకుల బుచ్చి రాములు, జంగిలి చిన్న రవిలకు చెప్పాడు. దీంతో వారు ఆదివారం ఎండపల్లి మండలంలోని రాజా రాంపల్లి వైన్స్‌లో మద్యం సేవించారు. వెంకటేశ్‌ అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్‌లో ఉన్న తండ్రి వద్దకు వెళ్లాడు. అదేరోజు రాత్రి బుచ్చిరాములు, చిన్న రవి రేండ్ల నరేశ్‌ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించగా కుమార్‌, శ్రీనివాస్‌ బైక్‌పై అతను కొత్తగా నిర్మిస్తున్న ఇంటి సమీపంలో ఉంటున్న గది వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లి నరేశ్‌పై పారలతో విచక్షణారహితంగా దాడి చేశారు. అతను చనిపోయాడని భావించి, అక్కడి నుంచి బుచ్చిరాములు ఇంటికి వెళ్లారు. నరేశ్‌ను కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి చనిపోయాడు. మృతుడి తమ్ముడు సతీశ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజయ్య, కుమార్‌, వెంకటేశ్‌, బుచ్చిరాములు, చిన్న రవి, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

పాడె మోసిన ప్రభుత్వ విప్‌..

నరేశ్‌ మృతదేహం సోమవారం కటికెనపల్లికి చేరింది. ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కుమారుడు రాంచందర్‌రెడ్డి వచ్చి, నివాళి అర్పించారు. అనంతరం భారీగా తరలివచ్చిన గ్రామస్తులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. విప్‌ లక్ష్మణ్‌కుమార్‌ పాడె మోశారు. మాజీ ఎంపీపీ కొడారి అంజన్న, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రూప్లానాయక్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ కొత్త నర్సింహులు, మాజీ వైస్‌ చైర్మన్‌ కాడె సూర్యనారాయణ తదితరులున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా..

బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వచ్చాక నరేశ్‌పై పలుమార్లు దాడులు జరిగాయని, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విప్‌ లక్ష్మణ్‌కుమార్‌ ఆరోపించారు. ప్రత్యర్థులతో ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పోలీసుల అడ్మినిస్ట్రేషన్‌ పూర్తిగా గాడితప్పిందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.

ఆస్పత్రి ఎదుట ఉద్రిక్తత


ఆస్పత్రి వద్ద మాట్లాడుతున్న ఎస్సై సత్యనారాయణ

కరీంనగర్‌క్రైం: రేండ్ల నరేశ్‌ను తీసుకెళ్లిన కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఆదివారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. స్థానిక సుభాష్‌నగర్‌కు చెందిన కొందరు యువకులు దవాఖానా వద్దకు రావడంతో ఘర్షణ వాతవరణం ఏర్పడింది. వీరు హత్య కేసులో ఉన్న ఒకరికి బంధువులు అని తెలిసింది. అక్కడే ఉన్న ధర్మారం ఎస్సై సత్యనారాయణ ఇరువర్గాల మధ్య గొడవ జరుగుతుందని భావించి, వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే, వారు వినలేదని, విధుల్లో ఉన్న తమపై దాడి చేశారని కరీంనగర్‌రూరల్‌ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి వద్ద ఘటనను కరీంనగర్‌ సీపీ అభిషేక్‌ మహంతి దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రభుత్వ విప్‌, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ తెలిపారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారన్నారు.

చెట్టు కొమ్మ పడి వృద్ధుడి మృతి

సుల్తానాబాద్‌రూరల్‌(పెద్దపల్లి): సుల్తానాబాద్‌ మండలంలోని మంచిరామికి చెందిన బొత్క్యారి చంద్రయ్య(60) చెట్టు కొమ్మ పడటంతో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. చంద్రయ్య సోమవారం తన ఇంటి సమీపంలోని చెట్టును నరికేస్తున్నాడు. ఈ క్రమంలో కొమ్మను తాడుతో లాగుతుండగా ఒక్కసారిగా విరిగి, అతని మీద పడింది. అక్కడున్నవారు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య అమృతమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కత్తితో దాడి.. ముగ్గురికి గాయాలు


గాయపడిన మొయినొద్దీన్‌

కోరుట్ల: అద్దె కుటుంబాల మధ్య బాత్‌రూం శుభ్రం చేసే విషయంలో జరిగిన గొడవ కత్తితో దాడి చేసేవరకు వెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ముగ్గురిపై కత్తిపోట్లకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణానికి చెందిన అజార్‌ పాషా, మహారాష్ట్రకు చెందిన సఫి–సరయ దంపతులు పట్టణంలోని హాజీపురలో గల ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో అద్దెకు ఉంటున్నారు. అజార్‌ పాషా పాత సామగ్రి కొనుగోలు వ్యాపారం చేస్తుండగా సఫి ప్రైవేట్‌ పనులు చేస్తుంటాడు. కాగా, సోమవారం బాత్‌రూం శుభ్రం చేసే విషయంలో రెండు కుటుంబాలవారు గొడవ పడ్డారు. దీంతో కోపోద్రిక్తుడైన అజార్‌ పాషా తన వద్ద ఉన్న కత్తితో సఫిపై దాడికి యత్నించాడు. సఫి మామయ్య సయ్యద్‌ మొయినొద్దీన్‌, కూతురు సనాపై, అదే దారిలో వెళ్తున్న గోదావరి అనే మహిళ అడ్డురావడంతో ఆమెపైనా దాడి చేశాడు. మొయినొద్దీన్‌, సనాకు తీవ్ర, గోదావరికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులకు కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. మొయినొద్దీన్‌ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సఫి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కిరణ్‌కుమార్‌ తెలిపారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

అప్పుల బాధతో మహిళ..


లక్ష్మి (ఫైల్‌)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అప్పులు చేసి, గల్ఫ్‌ వెళ్లిన భర్త అక్కడ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఇంటికి వచ్చాడు.. దీంతో అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపానికి గురైన అతని భార్య ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన బొదాసు లక్ష్మి(42) గ్రామంలో కూలీ పనులకు వెళ్తోంది. ఆమె భర్త నర్సయ్య 8 నెలల క్రితం అప్పులు చేసి, ఉపాధి నిమిత్తం గల్ఫ్‌ వెళ్లాడు. అక్కడి కంపెనీలో పని సరిగా దొరకలేదు. ఈ క్రమంలోనే రెండు నెలల క్రితం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని నడుము, కాలు విరగడంతో స్వగ్రామం తిరిగొచ్చాడు. భర్త డబ్బులు సంపాదించుకురాలేదని, అప్పులు ఎలా తీర్చేదని లక్ష్మి మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలికి కుమారుడు నాని, కూతురు చిన్ని ఉన్నారు. భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్‌ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్‌ కొండ రమేశ్‌గౌడ్‌ కోరారు.

పడకల్‌వాసి..

వెల్గటూర్‌ (ధర్మపురి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎండపల్లి మండలంలోని పడకల్‌ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పడకల్‌కు చెందిన వడకాపురం శ్రీనివాస్‌(44) గతంలో ప్రైవేటు ఫైనాన్స్‌ ద్వారా ట్రాక్టర్‌ కొనుగోలు చేశాడు. ఇందుకోసం చేసి అప్పు సమయానికి తీర్చలేకపోయాడు. మార్గం కనిపించకపోవడంతో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. సోమవారం గ్రామ శివారులోని ఒర్రె గడ్డపై కరెంట్‌ వైరుతో చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు మృతదేహాన్ని చూసి, పోలీసులకు సమాచారం అందించారు. వారు శ్రీనివాస్‌గా గుర్తించి, కుటుంబసభ్యులకు తెలిపారు. అప్పుల బాధ భరించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య శ్యామల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్‌ తెలిపారు.

భర్త మాట్లాడటం లేదని భార్య..


మమత (ఫైల్‌)

గన్నేరువరం(హుస్నాబాద్‌): భర్త మాట్లాడటం లేదని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన టేకు జోగయ్యకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కూతురు మమత(27)కు గ్రామానికే చెందిన పత్తి దుర్గాప్రసాద్‌తో వివాహం జరిపించారు. ఈ దంపతులకు పదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో జీవనోపాధి కోసం దుర్గాప్రసాద్‌ రెండు నెలల క్రితం ఝార్ఖండ్‌ వెళ్లాడు. వెళ్లినప్పటి నుంచి తనతో మాట్లాడటం లేదని, ఫోన్‌ లిఫ్ట్‌ చేయడం లేదని మమత మనస్తాపానికి గురైంది. సోమవారం ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి తండ్రి జోగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు.

వీర్నపల్లి మండలంలో బాలిక..

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రమేశ్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. తండ్రి సోమవారం ఉదయాన్నే మేకలను మేపేందుకు అడవికి, తల్లి ఉపాధిహామీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని, ఇంటికి వచ్చి చూడగా వారి కూతురు దూలానికి ఉరేసుకొని కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నాలుగేళ్లుగా మంచంపట్టి.. మృత్యుఒడికి

- అనారోగ్యంతో పవర్‌లూమ్‌ కార్మికుడి మృతి
- ఇద్దరు ఆడపిల్లలు సంతానం
- మొదటి కూతురి ఇద్దరు ఆడపిల్లల బాధ్యత ఈ కుటుంబానిదే..
- చివరకు చందాల ద్వారా అంత్యక్రియలు


భర్త శ్రీనివాస్‌ మృతదేహంపై పడి రోదిస్తున్న పద్మ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆయన పవర్‌లూమ్‌ కార్మికుడు.. ఈ పని చేస్తూనే భార్య, ఇద్దరు కూతుళ్లను పోషించాడు.. నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మంచం పట్టాడు.. పెద్ద కూతురు ఆత్మహత్య చేసుకుంది. అల్లుడు వదిలేయడంతో వారి ఇద్దరు ఆడపిల్లల బాధ్యత ఈ కుటుంబానిదే.. ఈ పరిస్థితుల్లో విధి ఆ కుటుంబాన్ని వెక్కిరించింది. పని చేయకున్నా ఇంటి పెద్ద ఉన్నాడన్న వారి ధైర్యాన్ని దూరం చేస్తూ ఆయనను తిరిగిరాని లోకాలకు తీసుకెళ్లిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కూచన శ్రీనివాస్‌(55) పవర్లూమ్‌ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ నాలుగేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. ఆయనకు భార్య పద్మ, కూతుళ్లు శిరీష, సాయిలత ఉన్నారు. పెద్ద కూతురికి పెళ్లి చేయగా ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. ఆమె గతంలో ఆత్మహత్య చేసుకుంది. అల్లుడు ఇద్దరు పిల్లలను వదిలేయడంతో వీరి వద్దే పెరుగుతున్నారు. ప్రస్తుతం పెద్ద పాప మూడోతరగతి, చిన్న పాప రెండో తరగతి స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు.

కుటుంబానిది దీనస్థితి..

శ్రీనివాస్‌ భార్య పద్మ ఎవరి ఇళ్లలోనైనా మంచం పట్టిన వృద్ధులుంటే వారికి సేవలందిస్తూ అలా వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తోంది. చిన్న కూతురు సాయిలత అమ్మకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు బీడీలు చుడుతోంది. శ్రీనివాస్‌కు కావాల్సిన మందులు తెస్తూ, ఇద్దరు చిన్నపిల్లల ఆలనాపాలన చూస్తున్న వీరికి పెద్ద కష్టం వచ్చింది. మృత్యువుతో పోరాడుతున్న ఇంటి పెద్ద శ్రీనివాస్‌ సోమవారం మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

చందాలతో దహన సంస్కారాలు

నిరుపేద కుటుంబం కావడంతో శ్రీనివాస్‌కు దహన సంస్కారాలు చేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబసభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గ్రామస్తులే తలాకొంత పోగేయడంతో రూ.10 వేలు జమయ్యాయి. దీంతో రాత్రి అంత్యక్రియలు పూర్తి చేశారు. శ్రీనివాస్‌ కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రోగులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సోమవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు పొన్నం అనిల్, ఏనుగు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ విషయంలో మోసం చేసిన నలుగురిపై కేసు

కరీంనగర్‌క్రైం: తప్పుడు పత్రాలు సృష్టించి ఒకే భూమిని పలువురికి అమ్మి కొనుగోలుదారును మోసం చేసిన ఘటనలో నలుగురిపై కరీంనగర్‌రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కాగా, అందులో ఒకరిని రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం గొడిశెలపేటకు చెందిన గంగిరెడ్డి భీంరెడ్డి ప్రస్తుతం మహారాష్ట్రలోని పూణెలో నివాసం ఉంటున్నాడు. కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లిలో గల భూమిని కొనుగోలు చేశాడు. భీంరెడ్డి ఏళ్ల తరబడి పూణెలో ఉండడం గ్రహించి అతడి స్నేహితులు లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, సునీల్ కలిసి సదరు స్థలాన్ని కాజేయాలనే ఉద్దేశంతో కిరణ్‌రెడ్డి తన భార్య సుకన్య పేరు మీద డబుల్ రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈక్రమంలో భీంరెడ్డి సదరు స్థలం వద్దకు వెళ్లగా చంపుతానని బెదిరించడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపిడి మాధవరావు, లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, సుకన్య, సునీల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సోమవారం లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలోని ఎల్లమ్మ గుడి వద్ద గంజాయి పట్టుకున్నట్లు కొత్తపల్లి ఎస్సై తెలిపారు. ఎలగందుల ఎల్లమ్మ గుడి వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆసిఫ్‌నగర్‌కు చెందిన రంగుల సురేశ్ వద్ద 5.224 కిలోల గంజాయి పట్టుకున్నామన్నారు. ఒడిశాలోని మోటో గ్రామం నుంచి ఫయాజ్ వద్ద వారం రోజుల క్రితం కొనుగోలు చేసి ఆసిఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని గ్రానైట్ క్వారీల్లో పనిచేస్తున్న కార్మికులకు అధిక ధరకు విక్రయించేందుకు తీసుకొస్తున్నారని తెలిపారు. నిందితుడు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఆంధ్రా, ఒరిస్సాకు గ్రానైట్ లారీ నడుపుతుండటం వల్ల పరిచయాలు పెరిగి గంజాయి విక్రయించి అధిక లాభం పొందాలన్న ఉద్దేశంతో తీసుకొస్తున్నాడని అన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్యదర్శిని దూషించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిని దూషించిన వ్యక్తిపై సోమవారం కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాచాపూర్ గ్రామ శివారులో అనుమతి లేకుండా క్రషర్ నిర్మాణ పనులు జరుగుతుండగా కార్యదర్శి పనులను నిలిపివేశారు. క్రషర్ అనుమతి కోసం గ్రామ పంచాయతీలో యజమాని దరఖాస్తు చేయగా ఎన్నికల కోడ్ ఉందని జాప్యం చేశారు. అనుమతి ఇవ్వలేదని ఈ నెల1న సమ్మయ్య అనే వ్యక్తి దూషించగా కేశవపట్నం పోలీసులకు కార్యదర్శి గంగాజమున ఫిర్యాదు చేశారు.

మందుల వివరాలు నమోదు చేయాలి



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న శివకుమార్

జమ్మికుంట: గడువు ముగిసే మందులను రిజిస్టర్‌లో నమోదు చేస్తూ పర్యవేక్షణ చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫార్మసీ ఆఫీసర్ బుస్సా శివకుమార్ సూచించారు. సోమవారం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసీ స్టోర్, మందుల పంపిణీ గదిలోని రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ- ఔషధి ద్వారా రోజు వారి మందులను అకౌంట్ చేయాలని, ఆసుపత్రిలో ఫార్మసిస్టు పోస్టు భర్తీ, మందుల సురక్షితకు నిలువ చేసే గదిలో ఎయిర్ కండిషన్ ఏర్పాటు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ సిబ్బంది ఉన్నారు.

ఇవేం నీళ్లు..!

- నల్లా నీటిలో వానపాములు
- అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా



మార్కెట్ సమీపంలో ఓ ఇంటిలో వచ్చిన నల్లా నీటిలో వానపాములు, నాచు

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం.. పర్యవేక్షించాల్సిన అధికారుల అలక్ష్యం కారణంగా ప్రజలు మున్సిపల్ నల్లా అంటేనే జడుసుకునే పరిస్థితి నెలకొంది. నగరంలోని ప్రశాంత్‌నగర్‌లో మురుగునీరు సరఫరా అయిన ఉదంతం మరవకముందే, మున్సిపల్ కార్పొరేషన్‌కు అత్యంత సమీపంలో ఉన్న మార్కెట్, గంజ్ ఏరియాల్లోనూ ఇలాంటి సమస్య తలెత్తింది. ఈ ప్రాంతంలో పదిరోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోగా, సోమవారం తిరిగి సరఫరా చేశారు. అయితే ఈ నల్లా నీటిలో వానపాములు, నాచు రావడంతో ఆ ప్రాంతవాసులు ఖంగుతిన్నారు.

నగరంలోని 51వ డివిజన్ మటన్‌మార్కెట్, గంజ్, దోబీఘాట్ ప్రాంతాల్లో పదిరోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ ప్రాంతానికి గతంలో ఉన్న పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా జరుగుతుండగా, వాల్వ్ సమస్యతో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కార్పొరేటర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ ఈ సమస్యను సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతులు చేపట్టలేదు. చివరకు సోమవారం నగరపాలక సంస్థ ఎస్ఈ మహేందర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లిన రవీందర్‌సింగ్, వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో హుటాహుటిన కదిలిన సిబ్బంది వాల్వ్‌ను సరిచేసి సోమవారం సాయంత్రం దాదాపు రెండు గంటల పాటు నీటి సరఫరా చేశారు. కానీ, పదిరోజులు నిరీక్షణ తర్వాత నల్లా వచ్చిందనే ఉపశమనంతో నల్లా తిప్పిన ఆయా ప్రాంతవాసులు జడుసుకొనే పరిస్థితి ఏర్పడింది. నల్లా తిప్పగానే నీళ్లతో పాటు నాచు, వానపాములు పడడమే ఇందుకు కారణం. కాగా పదిరోజుల పాటు నిలిచినపోయిన నీటి సరఫరా పునరుద్ధరించడంతో పైప్‌లో ఉన్న నాచు, వానపాములు వచ్చినట్లు సమాచారం. సిబ్బంది జాగ్రత్త తీసుకోకుండా నేరుగా ఇళ్లల్లోకి నీళ్లు పంపి, నల్లా నీళ్లంటేనే ప్రజలు భయపడే పరిస్థితికి తీసుకొచ్చారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న పరిస్థితుల్లో తాగునీటి నిర్వహణపై నగరపాలకసంస్థ అధికారులు మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది.



కరీంనగర్: నగరంలోని శ్రీనివాస ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యాసంవత్సరం పదోతరగతి చదువుకున్న విద్యార్థులంతా సోమవారం ఆవోపా బ్యాంకెట్ హాల్ వేదికగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఒక్కో రంగంలో స్థిరపడ్డ 80 మంది విద్యార్థులు ఒక చోట కలుసుకుని చిన్న నాటి అనుభవాలను పంచుకున్నారు. తమ జీవితంలో ఎదుగు బొదుగులు, ఇప్పుడున్న స్థితిగతులను ముచ్చటించుకున్నారు. ఫొటోల రూపంలో శాశ్వత జ్ఞాపకంగా మలుచుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, భగవాన్ దాస్, రామ్మోహన్‌రావు, వేణుమూర్తి, విశ్వనాథం, సత్యనారాయణ, మారుతి, మోహన్ రావు , రామనంద్, రేణుక, రమ, పూర్వ విద్యార్థులు మిర్యాలకర్ మునీందర్, రాజేశ్, షబొద్దీన్, గంగరాజు, మహేశ్, రాధిక, చందన, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌టీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏవో సత్యం

కరీంనగర్‌రూరల్: నిషేధిత హెచ్‌టీ పత్తి విత్తనాలను డీలర్లు విక్రయించిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడుతాయని మండల వ్యవసాయాధికారి బి. సత్యం అన్నారు. సోమవారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లోని రైతువేదికలో జరిగిన సీడ్స్, ఫర్టిలైజర్స్ డీలర్ల మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన దృష్ట్యా విత్తనాలు, ఎరువులను సరిపడా స్టాక్ పెట్టుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, రశీదుపై తప్పనిసరిగా రైతు సంతకాలు తీసుకోవాలని సూచించారు. సేల్స్ రిజిస్టర్‌లో విక్రయాల వివరాలను రాసి ప్రతిరోజూ సాయంత్రం 4గంటల్లోపు రిపోర్టు పంపాలని తెలిపారు. పత్తి విత్తనాల ప్యాకెట్‌ను రూ.864 చొప్పున మాత్రమే విక్రయించాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన డీలర్లు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో సమస్యకు వీవీప్యాట్‌తో చెక్

- ఈవీఎంలు మొరాయిస్తే ఇవే కీలకం
- ఇబ్బందులుంటే వినియోగించుకునే వెసులుబాటు



కరీంనగర్ అర్బన్: ఎన్నికల్లో చివరి ఘట్టం ఓట్ల లెక్కింపు. ఓట్లు లెక్కించే సమయంలో ఈవీఎంల సమస్య ఉంటే వీవీ ప్యాట్లే కీలకం కానున్నాయి. గత నెల 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌తో అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. మంగళవారం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ మేరకు ఎస్సారార్ కళాశాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఓట్లను లెక్కించే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

పారదర్శక ఎన్నికలకు వీవీ ప్యాట్లు

ఎన్నికల్లో పారదర్శకతను పెంచడంతో పాటు ఓటర్ల నమ్మకాన్ని చూరగొనేందుకు ఎన్నికల సంఘం 2014 రాష్ట్ర ఎన్నికల్లో వీవీప్యాట్లను అందుబాటులోకి తెచ్చింది. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లి అక్కడ అభ్యర్థుల ఫొటో, గుర్తులు ఉన్న ఈవీఎంను ఉపయోగించి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో ఒకరికి ఓటు వేస్తే మరొకరికి నమోదవుతుందన్న అపోహ క్రమంలో ఓటర్లతో పాటు నేతల్లో ఉండేది. ఓటర్ల సందేహాలకు తెరదించేందుకు ఎన్నికల సంఘం ఈవీఎంలతో వీవీప్యాట్లను అనుసంధానం చేసింది. పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోగానే వారు ఏ గుర్తుకు ఓటు వేశారో వీవీప్యాట్ అద్దంపై 7 సెకన్ల పాటు కనిపించడంతో ఓటరు సంతృప్తి చెందాడు. వారి సందేహాలు సైతం నివృత్తి అయ్యాయి. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏదైనా సమస్య వస్తే ఆందోళన చెందకుండా వీవీప్యాట్లకు అమర్చి ఉన్న పెట్టెల్లో ఓటరు వేసిన ఓట్లకు సంబంధించిన చీటీలు పడే ఏర్పాటు చేశారు. ఈసారి ఎన్నికల్లో బారులు తీరి ఓట్లేసిన వారు తాము మీట నొక్కిన గుర్తుకే ఓటు పడిందా.. లేదా.. అనే విషయాన్ని పరిశీలించుకున్నారు. ఎక్కడైనా తక్కువ మెజార్టీతో గెలుపొందడం, ఈవీఎంలు మొరాయించడం తదితర సమస్యలు తలెత్తితే ఇప్పుడు వీవీప్యాట్లలో భద్రపరచి ఉన్న చీటీలు సమస్యకు పరిష్కారం చూపనున్నాయి. సమస్య ఎదురైతే వీటి ద్వారా అనుమానాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. ఈవీఎంల నుంచి ఫలితాన్ని రాబట్టలేకపోవడంతో పాటు ఇతర సమస్యలు ఎదురైతే ఈ చీటీలను లెక్కించి ఫలితాన్ని ప్రకటించే వెసులుబాటు ఉంది. నియోజకవర్గంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని లాటరీ పద్ధతిలో ఎంపిక చేసుకొని ఈవీఎం ద్వారా లెక్కించిన తర్వాత వీవీప్యాట్‌లోని చీటీలను కూడా లెక్కించి ఫలితాన్ని సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

ఈవీఎంలు మొరాయించినా..

ఒక్కో ఈవీఎంలో నిక్షిప్తమైన ఓట్ల వివరాలను సాధారణంగా లెక్కించేందుకు గరిష్ఠంగా 2 నిమిషాల సమయం పడుతుంది. కొన్ని సందర్భాల్లో ఈవీఎంలు మొరాయిస్తే అగ్జిలరీ యూనిట్ ద్వారా పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరెవరికి ఎన్ని ఓట్లు పోలయ్యాయో తెలుసుకునే అవకాశం ఉంది. ఈ విధానం కూడా సాధ్యం కాకపోతే వీవీప్యాట్ చీటీలను లెక్కించేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఎక్కడైనా మెజార్టీ స్వల్పంగా ఉన్నప్పుడు వీవీప్యాట్ చీటీలను లెక్కించాలని అభ్యర్థులు పట్టుపడితే ఈ విషయాన్ని స్థానిక అధికారులు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితో తదుపరి చర్యలు తీసుకుంటారు. వీవీప్యాట్లను అమర్చడం వల్ల పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపులో కూడా ఎలాంటి అనుమానాలకు తావుండదు.

విత్తన దుకాణాల్లో తనిఖీ

రామడుగు: మండలంలోని షానగర్, రామడుగు, గోపాల్‌రావుపేట గ్రామాల్లోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి యాస్మిన్ సోమవారం తనిఖీ చేశారు. విత్తన డీలర్ల స్టాక్ రిజిస్టర్లు, ప్రిన్సిపుల్ సర్టిఫికెట్స్, బిల్ బుక్స్‌ను పరిశీలించారు. మండలంలో దాదాపు 5,800 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయనున్నారని, వీటికి సరిపడా పలు రకాల కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు పత్తి విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా రశీదు తీసుకోవాలని, షాపు యాజమానులు అన్ని రకాలుగా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

సంఘాలు బలోపేతం.. అదనపు ఆదాయం

- సమష్టిగా ధాన్యం కొనుగోళ్లు
- ఆదాయం గడిస్తున్న స్వశక్తి మహిళలు
- కమీషన్‌తో సంఘాలు బలోపేతం
- ఐకేపీ ఆధ్వర్యంలో మూడు గ్రామాల్లో కేంద్రాలు



బహుదూర్‌ఖాన్‌పేటలో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్న నిర్వాహకులు (ఫైల్)

కరీంనగర్‌రూరల్: ఈ మహిళలంతా పెద్దగా చదువుకోలేదు.. అందులోనూ కొంతమంది నిరక్షరాస్యులు.. అయినప్పటికీ ఏటా రూ.లక్షల్లో ధాన్యం కొనుగోళ్లు చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారు. తమ సంఘాన్ని బలోపేతం చేసుకుంటూ తాము ఎందులో తక్కువ కాదని నిరూపిస్తున్నారు గ్రామైక్య సంఘాల మహిళలు. రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం కొన్నేళ్ల నుంచి ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తోంది. ధాన్యం కొనుగోలులో గ్రామైక్య సంఘాల మహిళలు రాణిస్తూ సంఘానికి కమీషన్ ద్వారా ఆదాయం సమకూర్చిపెడుతున్నారు. కరీంనగర్ మండలంలోని 17గ్రామాల్లో మొత్తం 32 గ్రామైక్య సంఘాలున్నాయి. మొత్తం 897 స్వశక్తి మహిళ సంఘాల్లో 10,390 మంది సభ్యులున్నారు.

మూడు గ్రామాల్లో కొనుగోళ్లు

యాసంగి సీజన్‌లో కరీంనగర్ మండలంలో చామనపల్లి, ఎలబోతారం, బహుదూర్‌ఖాన్‌పేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ప్రతీ కేంద్రంలో వీవోఏ, గ్రామైక్య సంఘం సభ్యురాలు, బుక్‌కీపర్‌గా ముగ్గురు మహిళలు ఉంటారు. క్షేత్రస్థాయిలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ పట్టుదలతో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేశారు. కాంటా పెట్టగానే ధాన్యం, రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేశారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను సకాలంలో రైసుమిల్లులకు పంపించి రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులను జమచేయించారు.

యాసంగిలో 29వేలక్వింటాళ్ల సేకరణ

యాసంగిలో 665 మంది రైతుల నుంచి మొత్తం 29,304 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. చామనపల్లిలో 12,856క్వింటాళ్లు, ఎలబోతారంలో 10,270, బహుదూరఖాన్‌పేటలో 6,178 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. ధాన్యం కొనుగోలు చేసినందుకు కమీషన్ మొత్తం రూ.9,37,753 రావాల్సి ఉంది. గత యాసంగిలో మొత్తం ధాన్యం కొనుగోళ్లు 22,729 క్వింటాళ్లు కాగా కమీషన్ రూ. 7,27,328 వచ్చింది. గత వానాకాలం సీజన్‌లో 436మంది రైతుల నుంచి19,751 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. కమీషన్ రూ. 6,32,032 వచ్చింది.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

మహిళల ఆర్థికాభివృద్ధికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ధాన్యం కొనుగోలు ద్వారా వచ్చిన కమీషన్‌తో సంఘాలు ఆర్థికంగా బలోపేతమవుతున్నాయి. మహిళలు ధాన్యం కొనుగోళ్లు చేసి రైతులకు చేదోడుగా నిలుస్తున్నారు.

– భార్గవ్, ఏపీఎం, ఐకేపీ కరీంనగర్‌రూరల్

గుట్టు విప్పుతున్నా.. గుండె దిటవు చేసుకోండి

కరీంనగర్: 'ప్రియమైన నాయకులకు నమస్కారం.. ఐదేళ్ల కాలానికి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునే వ్యక్తిని ఎన్నుకునేందుకు ఎన్నికల పండుగ వచ్చింది. ఈ పండుగలో ఓటరు మహాశయులంతా మే 13న నన్ను ఆశ్రయించారు. వారికి నచ్చిన నాయకున్ని ఎన్నుకునేందుకు మీ మనసులోని మాట (ఓటు)ను నాలో దాచి ఉంచారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కరీంనగర్, చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూర్, హుస్నాబాద్, హుజురాబాద్ నియోజక వర్గాల పరిధిలో 13,03,690 మంది మీ మనసులో మాటను భద్రపరిచారు. 28 మంది అభ్యర్థులు ఎంపీగా పోటీ చేయగా ఎవరో ఒకరు విజేతగా మంగళవారం తేలనున్నారు. పటిష్ట బందోబస్తు మధ్య ఎస్సారార్ కళాశాలలోని చీకటి గదుల్లో 21 రోజుల పాటు బందీగా ఉంటూ మీ భారాన్ని మోశాం. ఈలోగా అంతుచిక్కని మీ అభిప్రాయాన్ని (ఓటింగ్ తీరును) తెలుసుకునేందుకు పోటీ చేసిన అభ్యర్థులంతా పడరాని పాట్లు పడ్డారు. అనుచర గణంతో కలిసి పెన్ను పేపర్లతో కుస్తీపట్టారు. కూడికలు, తీసివేతలు, అంచనాలు, సర్వేలతో ఎవరికి వారు ధీమా వ్యక్తం చేశారు. పోటీలో ఎంత మంది తలపడినా చివరకు విజయం వరించేది ఒక్కరినే. నాలో దాగి ఉన్న మీ అభిప్రాయాలను తెలుసుకునేందుకు అందరికీ ఆసక్తి ఉంది. ఇక ఈ భారాన్ని మోయలేను. నాలో నిక్షిప్తమై ఉన్న నిజాలను వెల్లడి చేస్తాను. ఫలితం అనుకూలం లేదా వ్యతిరేకత కావచ్చు. అందుకే నన్ను ఏమైనా అనుకోండి.. ప్రజలిచ్చిన తీర్పే నేను తెలుపుతా.. అందుకే మీ గుండె దిటవు చేసుకోవాలని చెబుతున్నా.

ఇట్లు..
ఈవీఎం

సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు



హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లావాదేవీల సమగ్ర సమాచారం కావాలంటూ జీకేఆర్ఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గూడురి స్వామిరెడ్డి సోమవారం జిల్లా సహకార అధికారికి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు పత్రం అందజేశారు. 2016 నుంచి 2024 వరకు సంఘంలో జరిగిన లావాదేవీలు, ట్రయల్ బ్యాలెన్స్ సీట్, ఇతర అంశాలు, సంఘానికి రావాల్సిన, ఇవ్వాల్సిన అనుమతుల లిస్టు, ఎనిమిదేళ్ల ఖర్చుల వివరాలు ఇవ్వాలని కోరారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి



పాఠశాలలోని వాటర్ ట్యాంక్ పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

చొప్పదండి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు కోరారు. మండలంలోని కొలిమికుంట, ఎన్‌టీఆర్‌కాలనీ, కుర్మపల్లి, కాట్నపల్లి, గ్రామాల్లో పనులను సోమవారం పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయించాలని ఎంఈవో వేణుగోపాల్‌ను ఆదేశించారు. కార్యక్రమాల్లో రఘు కిషోర్, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ స్వరూపరాణి

విద్యానగర్(కరీంనగర్): విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నగర డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి హరిశంకర్ అన్నారు. కరీంనగర్‌లోని బ్లూమెన్ డ్యాన్స్ అకాడమీలో నెల రోజులుగా జరుగుతున్న డ్యాన్స్ శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన సీనియర్స్‌కు సోమవారం నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. సమయాన్ని ఎప్పటికీ వృథాచేయొద్దన్నారు. తమలోని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర్ అధ్యక్షుడు చల్లా హరిశంకర్, గాయకులు చిలువేరు శ్రీకాంత్, సిద్ధి రమేశ్, కొరియోగ్రాఫర్ గజ్జెల ధర్మేందర్, ట్రాన్స్‌కో ఏఈ సంపత్‌కుమార్, డ్యాన్స్ మాస్టర్, డ్యాన్స్ అకాడమీ చైర్మన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎంకు గాయాలు

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నం ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం పైనుంచి పడటంతో గాయాలయ్యాయి. గ్రామంలో విద్యుత్ లైన్లు మరమ్మతు చేస్తుండగా స్తంభం పైనుంచి జారీ పడ్డాడు. తీవ్ర గాయాలు కాగా విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చిన్న విద్యుత్ సమస్య ఉన్నా తక్షణం పరిష్కరించే రత్నంకు ప్రమాదం జరగడం పట్ల గ్రామస్తులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

రామడుగు: మండలంలోని షానగర్ గ్రామం కొత్త భూమయ్యకు చెందిన పాడి ఆవు పిడుగుపాటుతో మృతి చెందింది. ఆదివారం సాయంత్రం పొలం వద్ద ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి పిడుగు పడటంతో ఆవు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

సన్మానం



సజ్జద్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నూతనంగా నియామకమైన మహమ్మద్ సజ్జద్‌ను పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నాయకులు సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ కోసం కృషి చేసిన సజ్జద్‌కు సముచిత స్థానం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రాసపల్లి రమేశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, దొగ్గల భాస్కర్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వాసాల సుధీర్, వేణు, సురేశ్, సల్లుబాబా, శివ, శశిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు నేడే తెర

21 రోజుల నిరీక్షణ తర్వాత వెల్లడి కానున్న ఎన్నికల ఫలితాలు

నేటి మధ్యాహ్నానికి పూర్తి స్థాయిలో స్పష్టత

- 175 అసెంబ్లీ స్థానాలకు 2,387 మంది, 25 లోక్‌సభ స్థానాలకు 454 మంది అభ్యర్థుల పోటీ
- వైఎస్ జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ఒంటరిగా పోటీ
- బీజేపీ, జనసేనలతో కలిసి కూటమిగా బరిలోకి దిగిన టీడీపీ
- ఓట్ల లెక్కింపు కోసం 33 చోట్ల 401 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు
- ఉదయం 8 గంటల నుంచే లెక్కింపు ప్రారంభం
- ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు.. 45 వేల మంది పోలీసులు, 67 కంపెనీల సాయుధ బలగాల వినియోగం
- పోలింగ్ కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలతో పహారా



మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

సాక్షి, అమరావతి: ఓటర్ల తీర్పు వెల్లడికి కౌంట్ డౌన్ ప్రారంభమైంది. మరి కొద్ది గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఫలితాలపై గత 21 రోజులుగా రాష్ట్ర ప్రజలు, రాజకీయ పార్టీల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను, ఆ తర్వాత 8.30 గంటల నుంచి ఈవీఎంలలో నిక్షిప్తం అయిన ఓట్లను లెక్కిస్తారు. ఇప్పటికే విడుదలైన మెజార్టీ సర్వేల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వైఎస్సార్‌సీపీ రెండోసారి అధికారం చేపట్టనుందని తేల్చాయి. గత నెల 13వ తేదీన రాష్ట్ర అసెంబ్లీకి, లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే దేశ వ్యాప్తంగా ఏడు దశల్లో పోలింగ్ నిర్వహించడం, శనివారంతో చివరి దశ పోలింగ్ ముగియడంతో ఫలితాల కోసం జూన్ 4 వరకు వేచి చూడాల్సి వచ్చింది. నేటి మధ్యాహ్నానికి ఫలితాలపై స్పష్టత వస్తుంది. అయితే ఈవీఎం కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తి అయినప్పటికీ, ప్రతి నియోజకవర్గంలో ఐదు వీవీప్యాట్‌లలోని స్లిప్‌లను కూడా చివర్లో లెక్కించాల్సి ఉంటుంది. అందువల్ల అధికారికంగా ఫలితాల ప్రకటనకు కొంత జాప్యం అవుతుంది.

ఫలితాలు ఇలా తెలుసుకోవచ్చు..

ఎన్నికల సరళిని, ఫలితాలను ఎప్పటికప్పుడు తెలియచేసేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. లెక్కింపులో ఒక రౌండు పూర్తి కాగానే ఆ ఫలితాలను కౌంటింగ్ సెంటర్ వద్ద మైక్‌లో వెల్లడించడంతో పాటు, మీడియా ప్రతినిధులకు కనపడే విధంగా డిస్‌ప్లే బోర్డులను కూడా ఏర్పాటు చేసింది. ప్రతి రౌండు ఫలితాలను సువిధా యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. నియోజకవర్గ ఫలితాలతో పాటు దేశ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల ఫలితాలను తెలుసుకోవడానికి ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను, యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

https://results.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చు. దీంతోపాటు 'ఓటర్స్ హెల్ప్‌లైన్' అనే యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఎన్నికల ఫలితాల సరళిని తెలుసుకోవచ్చు.

తొలి ఫలితం కొవ్వూరు, నరసాపురం

రాష్ట్రంలో మొత్తం 4.13 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ఇందులో ఈవీఎంల ద్వారా 3.33 కోట్ల మంది, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 5.15 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా రికార్డు స్థాయిలో 81.8 శాతం ఓటింగ్ నమోదైంది. 175 అసెంబ్లీ స్థానాలకు 2,387 మంది, 25 లోక్‌సభ స్థానాలకు 454 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఓట్ల లెక్కింపు కోసం 33 చోట్ల 401 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ తర్వాత కొన్ని చోట్ల హింసాత్మక సంఘటనలు చేటు చేసుకోవడంతో, ఓట్ల లెక్కింపు సందర్భంగా అటువంటి సంఘటలను పునరావృతం కాకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు 111 అసెంబ్లీ స్థానాల్లో 5 – 6 గంటల్లోనే పూర్తి కానుంది. 61 నియోజకవర్గాల్లో 6 – 8 గంటలు, మూడు నియోజకవర్గాల్లో 9 – 10 గంటల సమయం పట్టనుంది. పార్లమెంటు ఫలితాలకు సంబంధించి 13 రౌండ్లు ఉన్న రాజమండ్రి, నరసాపురం ఫలితాలు తొలుత వెల్లడి కానుండగా, 27 రౌండ్ల లెక్కింపు ఉన్న అమలాపురం ఫలితం ఆలస్యంగా రానుంది. అసెంబ్లీ విషయానికి వస్తే కేవలం అయిదు గంటలలోపే తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, నరసాపురం ఫలితాలు.. ఆలస్యంగా భీమిలి, పాణ్యం ఫలితాలు వెల్లడి కానున్నాయి.

ఒంటరిగా సిద్ధం

వైఎస్సార్‌సీపీ ఎవరితో పొత్తు లేకుండా ఒంటరిగానే 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసింది. తెలుగుదేశం పార్టీ జనసేన, బీజేపీలతో జట్టు కట్టి కూటమిగా పోటీలో నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం పేరుతో ముందస్తుగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోగా, తెలుగుదేశం పార్టీ సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపికపై సిగపట్లు పడుతూ ప్రచారంలో వెనుకబడ్డారు. టీడీపీ 144 అసెంబ్లీ, 17 పార్లమెంటు స్థానాల్లో, భారతీయ జనతాపార్టీ ఆరు పార్లమెంటు, 10 అసెంబ్లీ.. జనసేన రెండు పార్లమెంటు, 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ పడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాల్లో సామాన్యులను అభ్యర్థులుగా నిలబెట్టగా, తెలుగుదేశం పార్టీ పొత్తులు పెట్టుకొని తమ పార్టీకి చెందిన అభ్యర్థులను బీజేపీ, జనసేనల్లోకి పంపి అభ్యర్థులుగా నిలబెట్టింది.

మన పార్టీ కార్యకర్తలు గొప్ప పోరాట స్ఫూర్తిని చాటారు

ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలందరూ గొప్ప పోరాట స్ఫూర్తిని చాటారని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కౌంటింగ్ ప్రక్రియలో కూడా అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ.. ప్రజలు మనకు వేసిన ప్రతి ఓటునూ మన పార్టీ ఖాతాలోకి వచ్చేలా అప్రమత్తంగా వ్యవహరించి మన పార్టీకి అఖండ విజయం చేకూరుస్తారని ఆశిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో(ట్విట్టర్)లో పోస్టు చేశారు.

– సాక్షి, అమరావతి

ఫ్యాను గాలి వీచింది.. వైఎస్సార్‌సీపీదే విజయం

'సాక్షి' టీవీ చర్చలో ప్రముఖ సెఫాలజిస్టులు స్పష్టీకరణ



- సీఎం జగన్ అందించిన సంక్షేమం, సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా మారింది: ఆరా మస్తాన్
- 126 స్థానాలకంటే వైఎస్సార్‌సీపీకి అధికంగా వస్తాయి: ఆత్మసాక్షి మూర్తి
- సీఎం జగన్ చేసిన మంచికి కృతజ్ఞతలు చెబుతూ ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారు: రేస్ కిషోర్
- అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకూ ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే : ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్ ఇంద్ర నీల్

సాక్షి, అమరావతి: రాష్ట్రమంతా ఫ్యాను గాలి ఉధృతంగా వీచిందని, ఓటర్లలో అధిక శాతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని, ఆ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ప్రముఖ సెఫాలజిస్టులు స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో 50 శాతం కంటే ఎక్కువ ఓట్లతో అత్యధిక శాసన సభ, లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని తేల్చి చెప్పారు. 'సాక్షి' టీవీ సోమవారం రాత్రి నిర్వహించిన చర్చలో ప్రముఖ సెఫాలజిస్టులు 'ఆరా' మస్తాన్, 'ఆత్మసాక్షి' మూర్తి, 'రేస్' కిషోర్, 'ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్' ఇంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ సానుకూల ఓటుతో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించి అధికారంలోకి వస్తోందని వారంతా స్పష్టం చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎమ్మెల్సీ రఘురాజుపై అనర్హత వేటు

- టీడీపీతో కుమ్మక్కై వైఎస్సార్‌సీపీకి వ్యతిరేక కార్యకలాపాలు
- ఆయన సభ్యత్వాన్ని రద్దుచేసిన మండలి చైర్మన్ మోషేన్‌రాజు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు సాక్ష్యాలు బట్టబయలైన నేపథ్యంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై అనర్హత వేటు పడింది. ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దుచేస్తూ, ఆ స్థానం ఖాళీ అయిందని పేర్కొంటూ సోమవారం మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాలను ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురించారు. ప్రత్యర్థి పార్టీ టీడీపీతో కుమ్మక్కై వైఎస్సార్‌సీపీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపైన, పార్టీ నాయకులపైన అనుచిత వ్యాఖ్యలు చేశారని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. స్వయంగా హాజరై దీనిపై వివరణ ఇవ్వాలని నాలుగుసార్లు నోటీసులు పంపించినా రఘురాజు డుమ్మాకొట్టారు. మూడు నెలల కిందటే రఘురాజు భార్య, ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందుకూరి సుబ్బలక్ష్మి అలియాస్ సుధారాజు టీడీపీ నేత లోకేశ్ సమక్షంలో ఆ పార్టీ కండువా వేయించుకున్నారు. టీడీపీ ఎస్.కోట అభ్యర్థి కోళ్ల లలితకుమారితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. రఘురాజు దంపతుల నివాసంలోనే టీడీపీ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. మరోవైపు కోళ్ల లలితకుమారికి, ఎస్.కోట టికెట్ కోసం విఫల యత్నం చేసిన గొంప కృష్ణకు మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైదరాబాద్‌లో లోకేశ్ సమక్షంలో జరిగిన పంచాయితీలో మండల టీడీపీ నాయకులతో కలిసి రఘురాజు పాల్గొన్నారు. ఇలా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దుచేయాలని ప్రభుత్వ విప్ విక్రాంత్ ఫిర్యాదు చేశారు. రఘురాజు 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2027 వరకు పదవీ కాలం ఉన్నా పార్టీ వ్యతిరేక కలాపాలకు పాల్పడటంతో ఆయన సభ్యత్వం రద్దయింది.

ప్రతీపంటకు 'మద్దతు' ఉండాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణిలో మార్పు రావాలి
- రైతులు పంటల సరళిని మార్చాలి
- దుబారా ఖర్చులు తగ్గించుకోవాలి
- వ్యవసాయ వర్సిటీ సలహామండలి మాజీ సభ్యుడు వెల్మల రాంరెడ్డి

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్నా.. సరైన ధర రావడం లేదు. పంట మార్కెట్‌కు వచ్చేసరికే ధరలు ఒక్కసారిగా పడిపోతున్నాయి. ఫలితంగా పెట్టుబడి రాక రైతులు అప్పులో ఊబిలో కూరుకుపోతున్నారు. రైతులే తమ ఊపిరి అని చెప్పుకునే ప్రభుత్వాలు.. రైతులకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయకపోవడం దీనికి ప్రధాన కారణమన్నారు రైతు ఉద్యమ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వర్సిటీ సలహా మండలి మాజీ సభ్యుడు, అభ్యుదయ రైతు, కొడిమ్యాల మండలం పూడూరు గ్రామానికి చెందిన వెల్మల రాంరెడ్డి. వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు విషయాలను ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు.

ఇంటర్వ్యూ


వెల్మల రాంరెడ్డి

- రైతులకు విత్తనాలే ప్రధాన సమస్య. ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో సరఫరా చేయకపోవడంతో ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడుతున్నారు. దీంతో ప్రైవేటు కంపెనీలు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొచ్చి నాసిరకం విత్తనాలను అంటగడుతున్నాయి. తద్వారా రైతు శ్రమ వృథాతోపాటు పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే ప్రతి సీజన్‌కు ముందుగానే అవసరం మేరకు విత్తనాలు సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.
- ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమే. అందులో తలెత్తే లోపాలను సవరించలేకపోతున్నాయి. కేంద్రాల నుంచి వెళ్తున్న ధాన్యంలో క్వింటాల్‌కు రెండు కిలోలవరకు మిల్లర్లు కోత పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.
- ప్రతి పంటకూ ప్రభుత్వమే ఇన్సూరెన్సు చెల్లించాలి. పంటల బీమా పథకం అమలు చేయాలి. గ్రామం, మండలం యూనిట్‌గా కాకుండా రైతు యూనిట్‌గా తీసుకోవాలి. తెగుళ్లు, పురుగులు, అధిక వర్షాలు, వర్షాభావంతో నష్టం జరిగినప్పుడు రైతుకు పరిహారం ఇవ్వాలి. నామమాత్రంగా పంటల బీమా అమలు చేస్తే ఉపయోగం ఉండదు. కార్పొరేట్ కంపెనీలు వ్యాపార లాభాపేక్షను చూస్తాయిగానీ రైతులకు న్యాయం చేయవు.
- నిజానికి వ్యవసాయ రంగం యాంత్రీకరణగా మారింది. ఇది మంచిదే అయినా ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. ఇది రైతుకు వచ్చే ఆదాయంపై దెబ్బపడుతుంది. గతంతో పోల్చితే పంటల్లో తెగుళ్లు, పురుగులు విపరీతంగా పెరిగాయి. క్రిమిసంహారకాల పిచికారీ రైతులకు అదనపు భారంగా మారింది.
- వాస్తవానికి రైతును సాగులో అనేక సమస్యలు వేధిస్తున్నాయి. మొక్కజొన్న వేస్తే కోతులు, అడవిపందులు నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు వరి వైపు దృష్టి పెడుతున్నారు. ప్రతి సీజన్‌లో వరి విస్తీర్ణం పెరుగుతూ.. మిగిలిన పంటలు తగ్గుతున్నాయి. అలాకాకుండా చెరుకు, కంది, సోయాబీన్ వంటి పంటలు సాగు చేయాలి.
- ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్నందున స్వామినాథన్ సిఫార్సుల మేరకు పంటలకు మద్దతు ధర పెంచాల్సిందే. వరిలో గ్రేడ్-ఏ, కామన్ రకాలతోపాటు సూపర్ ఫైన్ రకాలు ఏర్పాటు చేసి క్వింటాకు రూ.3 వేల నుంచి రూ.4 వేల మద్దతు ధర ఇవ్వాలి. ప్రధాన పంటలకు బోనస్ ఇస్తే రైతులకు కాస్త మేలు. మార్కెట్లో ధర ఉన్న పంటలనే రైతులు సాగు చేస్తారు. ప్రస్తుతం పసుపు రేటు క్వింటాల్‌కు రూ.17వేలు ఉంది. పంట ఎక్కువైనప్పుడు ఆటోమెటిక్‌గా రేటు పడిపోతుంది. దీంతో రైతులు కొత్త పంటలు వేయాలంటే ఏ రేటు ఉంటుందో తెలియక భయపతున్నారు. ప్రస్తుతం టమాటా, ఉల్లిగడ్డలు కిలో రూ.5కు వస్తే, ఎకరాల కొద్ది సాగు చేసిన రైతులు ఆ పంట పెట్టేందుకు ముందుకు రావడం లేదు.
- హరిత విప్లవం రాకముందు పశువుల, గొర్రెల ఎరువుతోనే పంటలు పండించారు. ఇప్పుడు దిగుబడుల కోసం రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను ఇష్టారీతిన వాడుతున్నారు. తాజాగా సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ ఉత్పత్తులు అంటూ ప్రచారం జరుగుతోంది. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్లో రేటు ఉంటే.. రైతులు కూడా ఆ పద్ధతిలోనే పండించేందుకు ముందుకొస్తారు. సాధారణ పద్ధతిలో కంటే మంచి ధర వస్తే సేంద్రియ వ్యవసాయం తప్పక చేస్తారు.
- వ్యవసాయం చేస్తున్న తన బతుకే బాగా లేదు.. పిల్లల బతుకన్నా బాగుండాలని ప్రతి రైతు కోరుకుంటాడు. ఓ కంపెనీ తయారు చేసిన వస్తువుకు ఓ రేటు నిర్ణయిస్తుంది. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన తన పంటకు ఓ రేటు చెప్పుకోలేని దుస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న రైతు ఇక తమ పిల్లలను తెలిసితెలిసీ వ్యవసాయంలోకి ఎందుకు లాగుతాడు..? వ్యవసాయం చేసే వ్యక్తిని పెళ్లాడేందుకు ఏ ఆడపిల్లా ముందుకు రావడం లేదు. రైతులకు ప్రోత్సాహకాలు అందించి సాగును బాగు చేసినప్పుడే రైతు కూడా తమ పిల్లల విషయంలో ఆలోచన చేస్తాడు.
- ఇటీవల ఉద్యోగులు, వ్యాపారులు శుభకార్యాల్లో పెట్టే ఖర్చు భారీగా పెరుగుతోంది. వారిని చూస్తున్న రైతులు కూడా ఖర్చుకు వెనుకాడడం లేదు. తాహతుకు మించి ఖర్చు చేస్తుండడం.. సరైనా ఆదాయం లేకపోవడంతో అప్పులచక్రంలో చిక్కుకుంటున్నారు. భూముల ధరలు పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో ఖర్చుల పేరిట అమ్ముకుంటున్నారు. ఇలాంటి విషయాలు తెలిసినప్పుడు చాలా బాధ అనిపిస్తుంది.
- ఏ సంఘటిత రంగంలో పనిచేసే వారికైనా.. ఏదో ఓ రూపంలో సామాజిక భద్రత లభిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఉద్యోగ విరమణ అనంతరం కూడా భద్రత ఉంది. కానీ.. రైతులకు ఎలాంటి సదుపాయాలూ లేవు. గత ప్రభుత్వం రైతులకు రూ5 లక్షల బీమా కల్పించడం అభినందనీయం. అలాగే 60ఏళ్లు వచ్చిన రైతులకు పెన్షన్‌తో పాటు రైతు కుటుంబాలకు ఆరోగ్య బీమా కల్పించాలి. ప్రస్తుతం రైతు కుటుంబంలో ఏదైనా చెప్పుకోలేని వ్యాధి వస్తే తాను సంపాదించిందేమో కాని ఉన్న భూమి అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. ఉన్నత చదువులు చదువుకునే రైతు బిడ్డలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి.



ప్రజాపాలన కాదు.. ప్రతీకార పాలన

- మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ


రాకేష్‌ను పరామర్శిస్తున్న మాజీ విప్ బాల్క సుమన్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో ప్రజాపాలన కాదని, ప్రతీకార పాలన కొనసాగుతోందని, పగలు, కక్షలతో కూడిన పరిపాలనను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని, ప్రశ్నిస్తే దాడులు, ఎదిరిస్తే హత్యలు ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ తీరని మాజీ ప్రభుత్వ విప్, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రంగా విమర్శించారు. ఆదివారం జరిగిన దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ మంచిర్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి గడప రాకేష్‌ను సోమవారం ఆయన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావులతో కలిసి పరామర్శించారు. అనంతరం బాల్క సుమన్ మాట్లాడుతూ రాకేష్‌పై హత్యాయత్నం చేసిన కాంగ్రెస్ వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశాంతమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో హత్యా రాజకీయాలపై కాకుండా, జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యకర్తలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటామని, వారి జోలికి వస్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని అన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసానికి కూతవేటు దూరంలోనే ఇలాంటి దాడులు జరగడం దారుణమని తెలిపారు. ఇతర పార్టీల వారిని శత్రువులుగా చూడడం మానేసి, అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని, తాము పదేళ్ల అధికారంలో ఉన్నా ఇలాంటి హత్యా రాజకీయాలు మాత్రం చేయలేదని అన్నారు. ప్రశాంతమైన ఉమ్మడి జిల్లాలో ఇలాంటి హత్యా రాజకీయాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ ఉందని తాము శాంతియుతంగా మాట్లాడుతున్నామని, రాబోయే రోజుల్లో తాము రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

టైంపాస్.. పచ్చీస్!


పచ్చీస్ ఆడుతున్న మహిళలు

గుడిహత్నూర్: మండుతున్న ఎండ.. తోడైన ఉక్కపోత.. ఉపశమనం కోసం చెట్టు నీడన చేరిన మహిళలు చుట్టూ కూర్చొని పచ్చీస్ ఆట ఆడుతూ ఇలా కాలక్షేపం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఒకటో వార్డులో గల మహిళలు వేప చెట్టు నీడలో కూర్చొని పచ్చీస్ ఆటలో నిమగ్నమైన క్రమంలో 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

'భగీరథ'.. ఇక్కట్లు


క్యాన్లు, బిందెలు పట్టుకొని నీటి కోసం బయలుదేరిన మహిళలు

నేరడిగొండ: మండలంలోని దర్బతండా వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు వారానికోసారి మాత్రమే సరఫరా అవుతుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో మహిళలు బిందెలు పట్టుకొని సమీపంలోని చేతిపంపులు, వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలని వారు కోరుతున్నారు.

ఒకే ఈతలో ఐదు మేక పిల్లలు



భీమిని: మంచిర్యాల జిల్లా భీమిని మండలం పెద్దపేట గ్రామానికి చెందిన రైతు టకిరే శ్యాంరావుకు చెందిన మేక సోమవారం తెల్లవారు జామున ఒకే ఈతలో ఐదు మేకపిల్లలకు జన్మనిచ్చింది. మేకలు ఒకే ఈతలో ఒకటి రెండు పిల్లలను జన్మనిస్తాయి. కాని అరుదుగా ఇలా జరుగుతుంటుంది. ఒకే ఈతలో ఐదు పిల్లలకు జన్మనివ్వడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



అనూష అత్రీ, భావన సింగ్, ఖుషీ సింగ్, వశిఖా మెహతా

ఎండకు గొడుగు పట్టారు

మండుతున్న ఎండల్లో రోడ్డు మీద పుచ్చకాయ ముక్కలు కనిపిస్తే వెంటనే ఆగిపోతాం.ఓ కప్పు తాజా పుచ్చకాయ ముక్కలు తిని సేదదీరుతాం. ఇంటి నుంచి బయటకు వచ్చిన పని పూర్తి చేసుకుని తిరిగి ఇల్లు చేరేలోపు ఏర్పడే అవసరం అది. మరి అదే ఎండలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడి ప్రకోపాన్ని భరిస్తూ పుచ్చకాయ ముక్కల ముమ్మకునే వ్యక్తి పరిస్థితి ఏంటి? 52.9 డిగ్రీలకు చేరిన ఎండలో ఎన్ని పుచ్చకాయలు తింటే అతడికి సాంత్వన దొరుకుతుంది. తనకు, తన తల మీద నాట్యమాడుతున్న సూర్యుడికి మధ్య ఏ అడ్డూ లేదు. వర్షాకాలంలో మొక్కజొన్న కండెలు కాలుస్తూ, ఎండాకాలంలో పండ్ల ముక్కలమ్ముకుంటూ... బతుకు బండి ఈడ్చుదానికి ఏ ఎండకా గొడుగు పట్టే తనకు గొడుగుపట్టేదెవరు? ఎండనే గొడుగు చేసుకుని బతుకీడుస్తున్న ఇలాంటి వాళ్లకు గొడుగులు పంచుతున్నారు ఢిల్లీలోని నలుగురు యువతులు అనూష అత్రీ, భావని సింగ్, ఖుషీ సింగ్, వశిఖా మెహతా.'సమాజంలో సహాయం అవసరమైన వాళ్లు అనేక మంది ఉన్నారని కరోనా సమయంలో తెలిసింది' అంటూ తమ సేవా ప్రస్థానాన్ని వివరించారు.

'సేవ' అవసరం ఉంది!

"మా సర్వీస్ కరోనా సమయంలో మాస్కులు పంచడంతో మొదలైంది. కరోనా కరాళనృత్యం చేస్తున్న రోజుల్లో కూడా శ్రామికులు కొంత మంది మాస్కు కూడా లేకుండా పనులకు వెళ్లడం మమ్మల్ని ఆందోళన పరిచింది. తమ ఆరోగ్యభద్రత కోసం కనీసంగా కూడా జాగ్రత్తలు తీసుకోలేక పోతున్నారు. వాళ్ల అలసత్వం, నిర్లక్ష్యానికి కారణం చైతన్యం లేకపోవడంతోపాటు జాగ్రత్తలు తీసుకోవడానికి తగిన వెసులుబాటు లేకపోవడం. కనీసం మాస్కు అయినా ఇవ్వగలిగితే మంచిది కదా అనుకున్నాం. మా పేరెంట్స్ మాకు ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బులో కొంత తీసి మాస్కులు కొని పంచాం. ఒకసారి మురికి వాడల్లోకి అడుగుపెట్టిన తర్వాత ఆశ్చర్యం కలిగించే ఎన్నో విషయాలు తెలిశాయి. వాళ్లు ఆరోగ్యం పట్ల కనీస జాగ్రత్తలు కూడా పాటించడం లేదని తెలిసి హెల్త్ క్యాంపులు పెట్టి ఉచితంగా మందులిచ్చాం. సమాజానికి చేయాల్సిన సేవ చాలా ఉందని తెలిసి 'వారియర్స్ విత్‌వుట్ ఏ కాజ్' పేరుతో ఎన్‌జీవో ప్రారంభించాం. చదువు అవసరాన్ని తెలియచేయాల్సిన పరిస్థితి ఇంకా దేశంలో నెలకొని ఉందంటే నమ్ముతారా? చదువు జీవితాన్ని మెరుగుపరుస్తుందని వివరించినప్పటికీ వారిలో ఏదో నిర్లిప్తత. హెల్త్ అవేర్‌నెస్, ఎడ్యుకేషన్ అవేర్‌నెస్‌తోపాటు రుతుక్రమ పరిశుభ్రత కూడా నేర్పించాల్సిన అవసరం ఉంది. వీటితోపాటు ఫైనాన్షియల్ లిటరసీ కోసం వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాం. మేము సర్వీస్ అందిస్తున్న వాళ్లలో చాలామందికి తమకు చేతనైన పని చేసి ఓ వంద రూపాయలు సంపాదించుకోవడం తెలుసు. కానీ పని దొరకని రోజు కూడా భోజనం చేయాలంటే ఈ రోజు సంపాదించిన వందలో ఓ పది రూపాయలు దాచుకోవాలని తెలియదు. పని దొరక్కపోతే పస్తులుండడమే ఇంతవరకు వాళ్లకు తెలిసిన జీవితం. అలాంటి కుటుంబాలలో మహిళలను సమీకరించి వాళ్లు చేసే పనులతోనే డబ్బు సంపాదించుకునే వెసులుబాటు కల్పించాం. ఉత్తరాది రాష్ట్రాల్లో ఆడవాళ్లందరికీ ఊలుతో స్వెట్టర్లు, టోపీలు అల్లడం వచ్చి ఉంటుంది. వాళ్లను సంఘటిత పరిచి క్రోషియో నిట్టింగ్ బ్యాగ్‌లు, ఊలు ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించాం. ఆ మహిళలను స్థానికంగా ఎగ్జిబిషన్‌లు నిర్వహించే సంస్థలతో అనుసంధానం చేయగలిగాం. ఈ ఏడాది 'బీట్ ద హీట్' క్యాంపెయిన్ చేపట్టాం. ఇందులో భాగంగా రోడ్డు పక్కన బండి పెట్టుకుని పుచ్చకాయ ముక్కలమ్మేవాళ్లు ఇతర చిన్న చిన్న వస్తువులమ్ముకునే వాళ్లకు మొత్తం ఐదువేల మందికి గొడుగులిచ్చాం. పండ్లు, సోడాలమ్ముకునే వాళ్ల కంటే స్టవ్ పెట్టి వండే వాళ్ల పరిస్థితి ఇంకా ఘోరం. ఎర్రటి ఎండలో బండి మీద స్టవ్ పెట్టుకుని బ్రెడ్ ఆమ్లెట్, బజ్జీలు వేసే వాళ్ల తల కూడా పెనంతో సమానంగా వేడెక్కిపోతుంటుంది. అలాంటి ఎందరో మేమిచ్చిన గొడుగును వాళ్ల బండికి కట్టుకుని రోజంతా హాయిగా పని చేసుకుంటున్నారు. మా సర్వీస్‌ని ఢిల్లీ, నోయిడాల నుంచి దేశంలోని బెంగళూరు, చండీగఢ్, ముంబయి, హైదరాబాద్‌లకు విస్తరించాం. ఇంకా అన్ని రాష్ట్రాల్లో మా నెట్‌వర్క్‌ను విస్తరిస్తాం'' అని చెప్పారు.



నేర్చుకోవాలనే తపన ఉంటే... అదే తపస్సు. ఆ తపస్సు ఫలితాలు ఊరకే పోవు.
విజయాలకు బలాన్ని ఇస్తాయి. ఎలాంటి డిగ్రీలు, అనుభవం లేకుండానే ఎంటర్‌టైన్‌మెంట్ ప్రపంచంలోకి అడుగుపెట్టింది స్నేహిల్ దీక్షిత్ మెహ్రా.
వేగంగా నేర్చుకోవాలనే తపన ఆమె బలం.
సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రైటర్, కంటెంట్ క్రియేటర్, యాక్టర్, క్రియేటివ్ డైరెక్టర్‌గా బహుముఖ ప్రజ్ఞను సొంతం చేసుకుంది.

ఇంజినీర్ టు క్రియేటివ్ డైరెక్టర్

మల్టీ టాలెంట్

స్నేహిల్ దీక్షిత్ మెహ్రా



జర్నలిస్ట్ కావాలనుకుంది స్నేహిల్. 'అదేం కుదరదు. ప్రొఫెషనల్ డిగ్రీ ఉండాల్సిందే' అన్నారు తల్లిదండ్రులు. దీంతో భోపాల్‌లో ఇంజినీరింగ్ చేసింది. చదువు పూర్తయిన తరువాత ముంబైలోని ఒక ఐటీ సంస్థలో పనిచేసింది. ఉద్యోగం చేస్తున్న మాటేగానీ తన మనసంతా టీవీ రంగంపైనే ఉండేది. ఒక ఫైన్ మార్నింగ్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక చానల్‌లో ట్రైనీగా చేరింది.

తల్లిదండ్రులు ఆందోళన పడ్డారు.'జర్నలిజంలో ఎలాంటి డిగ్రీ లేకుండా నెగ్గుకు రావడం కష్టం' అన్నారు.

ఆ తరువాత తల్లి మాత్రం 'ఫరవాలేదు' అన్నట్లుగా మాట్లాడింది. అండగా నిలబడింది. ముంబైలో ఉండే సోదరుడు ప్రోత్సహించాడు.

కొత్త ప్రయాణంలో స్నేహిల్‌కు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి.

'ఓటమిని దరి చేరనివ్వవద్దు' అని బలంగా అనుకునే స్నేహిల్ ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. సవాళ్లను విజయవంతంగా అధిగమిస్తూ వెళ్లింది. సవాళ్లను అధిగమించే శక్తి తనకు త్వరగా నేర్చుకునే నైపుణ్యం నుంచి వచ్చింది.

స్టోరీ టెల్లింగ్‌పై ఉన్న పాషన్‌తో టెలివిజన్ నుంచి ఓటీటీకి అక్కడి నుంచి సోషల్ మీడియాకు వచ్చిన స్నేహిల్ ప్రతిచోటా తనను తాను నిరూపించుకుంది. ఎన్నో షోలు చేసి రైటర్‌గా, క్రియేటివ్ డైరెక్టర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. 'అప్‌హరణ్' వెబ్ సిరీస్‌లో నటించడం ద్వారా నటిగా కూడా మంచి మార్కులు తెచ్చుకుంది. ఇదంతా ఒక్క ఎత్తయితే 'హీరా మండీ' కోసం డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ టీమ్‌లో చేరడం మరో ఎత్తు.

రైటింగ్ విభాగంలో పనిచేసిన స్నేహిల్‌కు సంజయ్ లీలా భన్సాలీ కొన్ని సీన్‌లను డైరెక్ట్ చేసే అవకాశం ఇచ్చాడు. ఆ సీన్‌లు బాగా చేయడంతో 'హీరామండీ' సిరీస్‌కు అడిషనల్ డైరెక్టర్‌గా ప్రమోట్ అయింది.

'ఇది పదిహేడు సంవత్సరాల కష్టఫలితం. భన్సాలీతో పని చేయడం వరంలాంటిది. ఫిల్మ్‌మేకర్, ప్రొడ్యూసర్‌గా ఆయనకు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. ఆయన అనుభవాల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఆయనతో పనిచేయడం అంటే ఫిల్మ్ స్కూల్‌లో చేరి ఎన్నో విషయాలు నేర్చుకోవడంలాంటిది' అంటుంది స్నేహిల్.

ఇక ఇన్‌ఫ్లుయెన్సర్‌గా తన అనుభవాన్ని గురించి చెబుతూ...

'కామెడీ అనేది రిస్క్. కొన్నిసార్లు ప్రేక్షకులకు ఏది నచ్చుతుందో, ఏది నచ్చదో ఊహించలేము. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా నా వీడియోల నుంచి ఇన్‌స్టంట్ ఫీడ్‌బ్యాక్ తెలుసుకునేదాన్ని. ఫలానా వీడియో అభ్యంతరకరంగా, నొప్పించేలా ఉంది అనే కామెంట్స్ కనిపిస్తే వెంటనే ఆ వీడియోను తొలిగించేదాన్ని. ఎవరినీ నొప్పించకుండా అందరూ హాయిగా నవ్వుకునేలా కంటెంట్‌ను రూపొందించడం అనేది నిజంగా సవాలే' అంటుంది బహుముఖ ప్రజ్ఞాశాలి స్నేహిల్ దీక్షిత్ మెహ్రా.

కలల దారిలో...

కలలు కనడం అనేది నాకు చిన్నప్పటి నుంచే అలవాటు. కల కనడం గొప్ప ఉత్సాహాన్ని ఇస్తుంది. అయితే ఉత్సాహం దగ్గర మాత్రమే ఆగిపోకుండా నా కలను సాకారం చేసుకోవడానికి కష్టపడ్డాను. నేర్చుకోవాలనే ఉత్సాహం, నిరంతర కష్టం మనకు విజయాన్ని చేకూరుస్తాయి.

– స్నేహిల్ దీక్షిత్ మెహ్రా

బ్యూటిప్స్

మూడు నిమ్మకాయలు, టేబుల్ స్పూన్ చక్కెర, టీ స్పూన్ బాదం నూనె, పది నుంచి పదిహేను పుదీన ఆకులు తీసుకోవాలి. నిమ్మకాయలను ముక్కలు చేయాలి. పుదీన ఆకులు, నిమ్మకాయ ముక్కలను (తొక్కతో సహా) మిక్సీలో గ్రైండ్ చేయాలి. అందులో చక్కెర, బాదం నూనె కలిపితే పాదాలకు స్క్రబ్ రెడీ. దీనిని పాదాలు, మడమలు, వేళ్ల మధ్య పట్టించి ఆరిన తర్వాత చేత్తో ఐదు నుంచి పది నిమిషాల సేపు వలయాకారంగా మర్దన చేసి గోరు వెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఇది అన్ని కాలాల్లోనూ అవసరమే. వర్షాకాలంలో పాదాలు నాని ఇన్ఫెక్షన్‌లు సోకకుండా ఉండడానికి ఈ స్క్రబ్‌లో చిటికెడు పసుపు కలుపుకోవాలి.



సాగుబడి

రోహిణి కార్తె : జూన్ 8 వరకు
మృగశిర కార్తె : జూన్ 9 నుంచి

లానినా వస్తోంది...

పంట ఏదైనా.. ఎత్తుమడులే మేలు!



ట్రాక్టర్ ద్వారా ఇలా ఎత్తు మడులు/బోదెలు తోలుకోవాలి



మధ్య నుంచి వర్షపు నీరు కాలువల ద్వారా బయటకు వస్తుంది

భరించలేని ఎండలతో జనాన్ని భీతిల్లజేసిన ఎల్‌నినో ముగిసింది. అధిక వర్షాలతో కూడిన లానినా ప్రారంభం కానున్న నేపథ్యంలో అధిక వర్షాలకు పంటలు తట్టుకునే వ్యూహాలు అవసరం. అందులో ముఖ్యమైనది.. ఎత్తుమడులు లేదా బోదెల (రెయిజ్‌డ్ బెడ్స్)పై పంటలు విత్తుకోవటం. అది ఎర్ర నేలైనా, నల్ల నేలైనా.. పత్తి, కంది, మిర్చి, పసుపు, సోయా, వేరుశనగ, కూరగాయలతో పాటు ఇంకా ఏ ఇతర ఆరుతడి పంటలైనా సరే ఎత్తుమడులపై విత్తుకుంటే నీటి ముంపు నుంచి, ఉరకెత్తటం, అతివృష్టి/ అనావృష్టి బాధల నుంచి రక్షణ పొందవచ్చని ఆదిలాబాద్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డా. ప్రవీణ్‌కుమార్ రైతులకు సూచిస్తున్నారు. వర్షాలు తక్కువైనా, ఎక్కువైనా.. వర్షానికి వర్షానికి మధ్య ఎక్కువ రోజుల వ్యవధి వచ్చినా.. నల్ల రేగడైనా, ఎర్ర నేలైనా, బంక మట్టి అయినా సరే.. ఎత్తు మడులు చేసి లేదా బోదెలు తోలి పంటలు విత్తుకోవటం మేలని డా. ప్రవీణ్ కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా రైతులకు చెబుతూ వస్తున్నారు.

పత్తి సాగులో ఎత్తు మడి లాభాలు:

అతివృష్టి సమయాల్లో పంటల సంరక్షణకు సమర్థవంతమైన మురుగు నీటి పారుదల వ్యవస్థ కీలకం. ఎత్తు మడుల పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా సమస్యలను అధిగమించవచ్చు. ఎత్తుమడులు చేసుకోవడానికి ట్రాక్టర్‌తో అనుసంధానం చేసే రిడ్జర్ లేదా బెడ్ మేకర్‌ను ఉపయోగిస్తారు. పత్తికి ఉద్దేశించిన మడి 15–20 సెం.మీ.ల ఎత్తు ఉంటుంది. మడి వెడల్పు నేల స్వభావం, ఆ ప్రాంతంలో నమోదయ్యే వర్షపాతాన్ని బట్టి ఎంత కావాలంటే అంత పెట్టుకోవచ్చు. పత్తి సాళ్ల మధ్య 180/ 150/ 120 సెం.మీ., మొక్కల మధ్య 30/20/30 సెం.మీ.ల దూరంలో పత్తి పంటను సాగు చేయవచ్చు. సాధారణంగా ఒక ఎకరంలో ఎత్తు మడులు చేయడానికి సుమారు 45 నిమిషాల నుంచి ఒక గంట సమయం పడుతుంది. ఎత్తు మడుల మీద విత్తిన విత్తనం సాధారణ పొలంలో కన్నా ఒకటి రెండు రోజులు ముందే మొలకెత్తుతుంది. సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే, మొలక శాతం ఎక్కువ. దాదాపు 90 శాతం విత్తనాలు మొలుస్తాయి. ఎత్తు మడుల వలన మురుగు నీటి వ్యవస్థ మెరుగవుతుంది. వర్షపు నీరు పొలంలో నిలవకుండా, కాలువల ద్వారా బయటికి వెళ్లిపోతుంది. దీనివలన తొలిదశలో మొక్క పెరుగుదల కుంటుపడదు. భారీ వర్షాలు కురిసినప్పుడు నల్లరేగడి నేలల్లో వరద పారుతుంది. ఆ ప్రవాహంలో మొక్కలు కొట్టుకుపోకుండా ఎత్తు మడులు కాపాడుతాయి. వర్షాభావ పరిస్థితుల్లో మడుల్లో నిల్వ ఉండే తేమ పంటకు ఉపయోగపడుతుంది. సాంప్రదాయ పద్ధతిలో పత్తి మొక్కల కింది కొమ్మలకు మొదట్లో వచ్చే 5 నుండి 10 కాయలు కుళ్లాపోతూ ఉంటాయి. ఎత్తు మడులు చేయడం వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి కాయకుళ్లు, ఇతర చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుంది. యాంత్రీకరణ ద్వారా కలుపు యాజమాన్యం సులభమవుతుంది. సాధారణ పద్ధతితో పోలిస్తే ఎత్తు మడుల పద్ధతిలో 10–20 శాతం అధిక దిగుబడులు సాధించవచ్చు. నల్లరేగడి నేలలు, తేలికపాటి ఎర్రనేలల్లో ఎత్తు మడుల పద్ధతిలో పత్తిని సాగు చేయవచ్చు. పత్తిలో అంతరపంటగా కందిని విత్తు కుంటే, ఒకవేళ ఏ కారణంగానైనా ఒక పంట దెబ్బతింటే, మరో పంట రైతును ఆదుకుంటుంది.



డా. ప్రవీణ్ కుమార్

ఇతర వివరాలకు డా. ప్రవీణ్ కుమార్‌ను 99896 23829 నంబరులో సంప్రదించవచ్చు.

ఎత్తు మడులపై పత్తి పంటను విత్తుకునే మెళకువలను తెలిపే వీడియో 'కేవీకే ఆదిలాబాద్' యూట్యూబ్ ఛానల్‌లో ఉంది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేసి చూడొచ్చు.

ప్రకృతి ఆహారం పక్కా లోకల్!

- ఏపీలో ప్రకృతి వ్యవసాయదారుల పంటలకు స్థానిక మార్కెట్లు, రైతుబజార్లలో మంచి గిరాకీ
- ప్రతి సోమవారం జిల్లా, మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లో నేరుగా ప్రజలకు విక్రయిస్తున్న రైతులు
- ప్రయోగాత్మకంగా 5 చోట్ల 'కంటెయినర్ రైతుబజార్లు'... త్వరలో మరో 33 ఏర్పాటుకు సన్నాహాలు

తొలకరితో పాటే వచ్చే అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం (జూన్ 5) ఈ ఏడాది లక్ష్యం: 'భూముల పునరుద్ధరణ, ఎడారీకరణను, కరువును తట్టుకునే దిశగా పనిచేయటం'. మట్టిలో సేంద్రియ కర్బనం 0.3%కి పడిపోయింది. దీన్ని పెంపొందించుకోవటానికి, పనిలో పనిగా భూతాపాన్ని తగ్గించడానికి సేద్యం మొత్తాన్నీ ప్రకృతి/సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించటం తప్ప మరో మేలైన దారి లేదన్నది నిపుణుల మాట. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సంఖ్యలో చిన్న, సన్నకారు రైతులు భూమిని శాశ్వతంగా బాగుచేసుకుంటూ ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని పండిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాదు.. వారు పండించిన అమృతాహారాన్ని స్థానిక మార్కెట్లలోనే నేరుగా ప్రజలకు అమ్ముతున్నారు. ఈ విధంగా ప్రకృతి/సేంద్రియ రైతులతో పాటు ఈ ఆహారాన్ని కొనుగోలు చేస్తున్న వినియోగదారులు కూడా పర్యావరణ పరిరక్షణకు పరోక్షంగా దోహదపడుతున్నారు. ఈ ఏడాది పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఆహార రంగంలో చోటు చేసుకుంటున్న గుణాత్మక మార్పుల గురించి ప్రత్యేక కథనం..!

ప్రకృతి వ్యవసాయంలో మన దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. ఏపీలోని అన్ని జిల్లాల్లో ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) విస్తారంగా సాగవుతోంది. రసాయనాలు వాడకుండా ఆరోగ్యదాయకంగా పండించిన ధాన్యం, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను స్థానిక మార్కెట్ల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు మార్కెటింగ్ శాఖ తోడ్పాటుతో ఏపీ రైతు సాధికార సంస్థ కృషి చేస్తోంది. ప్రకృతి వ్యవసాయంలో స్థానిక రైతులు పండించిన ఆహారోత్పత్తులను స్థానిక ప్రజలకే తొలుత అందుబాటులోకి తేవాలన్నది లక్ష్యం. స్థానిక మార్కెట్లలో, రైతుబజార్లలో, వైఎస్సార్ చేయూత మహిళా రూరల్ మార్ట్‌లలో రైతుల ద్వారా నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు కృషి చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం ఎన్టీఆర్ జిల్లా నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. విజయవాడ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయోత్పత్తులను విక్రయిస్తున్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమానికి ప్రజలు తరలి వస్తారు కాబట్టి అదే రోజు నమ్మకమైన ఆరోగ్యదాయక ఆహారోత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని, సాధారణ మార్కెట్‌తో పోల్చినప్పుడు ఇక్కడ 10–15% అదనపు ధర రైతులకు లభిస్తోందని ఏపీ రైతు సాధికార సంస్థ సీనియర్ మార్కెటింగ్ లీడ్ బి. ప్రభాకర్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.



బి.ప్రభాకర్
సీనియర్ మార్కెటింగ్ లీడ్
ఏపీ ఆర్‌వైఎస్ఎస్

427 మండల కేంద్రాల్లో అమ్మకాలు

ఏపీలోని 26 జిల్లా కేంద్రాలకు గాను 22 చోట్ల, 663 మండలాలకు గాను 427 మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయోత్పత్తులను రైతులు అమ్ముతున్నారని ప్రభాకర్ వివరించారు. అదే విధంగా, 113 మునిసిపాలిటీలకు గాను 24 మునిసిపాలిటీలలోనూ తాము పండించే ఉత్పత్తులను గత 2–3 నెలలుగా ప్రకృతి వ్యవసాయదారులు విక్రయిస్తున్నారు. వైఎస్సార్ చేయూత మహిళా గ్రామీణ మార్ట్‌లు 47 ఉండగా ఇప్పటికి 32 మార్ట్‌లలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన బియ్యం, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను అందుబాటులోకి తెచ్చారు.

ఆకర్షిస్తున్న 'కంటెయినర్ రైతుబజార్లు'

ఏపీలో 96 రైతుబజార్లు పట్టణ ప్రాంత వినియోగదారులకు నిత్యావసరాలను అందుబాటులోకి తెస్తున్నాయి. వీటిలో ఇప్పటికే 47 రైతుబజార్లలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించే స్టాల్స్ ఏర్పాటయ్యాయి. 3 ఉత్తరాంధ్ర జిల్లాల్లో 5 రైతుబజార్లలో మార్కెటింగ్ శాఖ తోడ్పాటుతో అవని ఆర్గానిక్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా ప్రయోగాత్మకంగా ప్రత్యేక కంటెయినర్లు ఏర్పాటు చేసింది. వీటిలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన బియ్యం, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలను విక్రయించటం ఇటీవలే ప్రారంభించారు. పట్టణ ప్రాంతీయులను ఈ కంటెయినర్ రైతుబజార్లు విశేషంగా ఆకర్షిస్తున్నాయని, మరో 33 రైతుబజార్లలో జూన్ రెండో వారంలో కంటెయినర్ దుకాణాలను ప్రారంభించనున్నామని ప్రభాకర్ వివరించారు. ముమ్ముందు దశలవారీగా ప్రతి రైతుబజారులోనూ కంటెయినర్ దుకాణాలు తెరుస్తామన్నారు.



వైజాగ్ సీతమ్మధార రైతు బజార్‌లోని 'కంటెయినర్ రైతుబజార్'



జిల్లా, మండల కేంద్రాల్లో ఉత్పత్తులు విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయదారులు

లోకల్ మార్కెటింగే మా వ్యూహం!

రసాయనాలతో పండించిన ఆహారోత్పత్తులతో పోల్చితే.. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఆహారోత్పత్తుల్లో అధిక పోషక విలువలు ఉండటమే కాకుండా ఆరోగ్యకరమైనవి కూడా. ఈ ఆహారోత్పత్తులను స్థానిక మార్కెట్ల ద్వారా సాధారణ ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి తేవటమే మా మార్కెటింగ్ వ్యూహం. మార్కెటింగ్ శాఖ, జిల్లా కలెక్టర్లు ఈ విషయంలో మాకు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

– టి. విజయకుమార్,
ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ,
కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు,
ఏపీఆర్‌వైఎస్ఎస్.



గ్రామాల్లో 'ఫుడ్ బాస్కెట్లు'!

ఏపీలో ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా స్వయం సహాయక బృందాలు కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ బృందాల సభ్యుల కుటుంబాలలోని వారందరికీ అవసరమయ్యే అన్ని రకాల ఆహారోత్పత్తులను ప్రకృతి వ్యవసాయంలో పండించినవే అందించాలన్న లక్ష్యంతో ఫుడ్ బాస్కెట్స్ కార్యక్రమానికి రైతుసాధికార సంస్థ 7 నెలల క్రితం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతానికి 76 గ్రామాల్లో ఈ ఫుడ్ బాస్కెట్ స్కీమ్ ప్రారంభమైందని, త్వరలో 129 గ్రామాలకు విస్తరించనున్నామన్నారు. వీరికి ఆయా గ్రామాల్లో పండించేవి చాలకపోతే, పక్క గ్రామాలు, మండలాల నుంచి సేకరించి అందిస్తున్నారు.

గ్రామీణులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న లక్ష్యంతో ఈ ఫుడ్ బాస్కెట్స్ అందిస్తుండటం విశేషం. తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రకృతి వ్యవసాయంలో పండించిన బియ్యం, బెల్లం, శనగలను సరఫరా చేస్తున్నారు. అమరావతిలోని ఏపీ సచివాలయంలో సిబ్బంది, సందర్శకులకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులన్నిటినీ విక్రయించేందుకు జూన్ రెండో వారం నుంచి ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించనున్నామని ప్రభాకర్ (97714 63539) చెప్పారు. స్థానిక మార్కెట్ల ద్వారా స్థానిక ప్రజలకు ప్రకృతి ఆహారాన్ని విస్తృతంగా అందుబాటులోకి తేవటం సంతోషదాయకం.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



ప్రజ్ఞానంద, వైశాలి, హంపి పరాజయం

నార్వే చెస్ టోర్నమెంట్‌లో ఆరో రౌండ్ భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, వైశాలి, కోనేరు హంపిలకు కలిసి రాలేదు. ఈ ముగ్గురు భారత గ్రాండ్‌మాస్టర్లు తమ ప్రత్యర్థుల చేతుల్లో ఓటమి చవిచూశారు. పురుషుల విభాగంలో ఫిరూజా అలీరెజా (ఫ్రాన్స్)తో జరిగిన క్లాసికల్ గేమ్‌ను ప్రజ్ఞానంద 34 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. విజేతను నిర్ణయించేందుకు 'అర్మగెడాన్' గేమ్ నిర్వహించగా... తెల్ల పావులతో ఆడిన ఫిరూజా 60 ఎత్తుల్లో గెలిచాడు. మహిళల విభాగంలో ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్‌తో జరిగిన క్లాసికల్ గేమ్‌లో ప్రజ్ఞానంద సోదరి వైశాలి 102 ఎత్తుల్లో ఓడిపోయింది. పియా క్రామ్లింగ్ (స్వీడన్)తో జరిగిన క్లాసికల్ గేమ్‌ను కోనేరు హంపి 37 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. విజేతను నిర్ణయించేందుకు 'అర్మగెడాన్' గేమ్‌ను నిర్వహించగా... తెల్ల పావులతో ఆడిన హంపి 60 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. దాంతో 'అర్మగెడాన్' గేమ్ నిబంధనల ప్రకారం నల్ల పావులతో 'డ్రా'గా ముగించిన పియా క్రామ్లింగ్‌ను విజేతగా ప్రకటించారు.



ఉత్కం'టై'న పోరులో నమీబియా 'సూపర్' గెలుపు



డేవిడ్ వీస్

విజయం దోబూచులాడిన మ్యాచ్‌లో ఒమన్ ఓటమి • డేవిడ్ వీస్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

సూపర్ ఓవర్‌కు ముందు...

నమీబియా గెలిచేందుకు 6 బంతుల్లో 5 పరుగులు కావాలి. క్రీజులో పాతుకుపోయిన ఫ్రయ్‌లింక్ (48 బంతుల్లో 45; 6 ఫోర్లు) ఉండటంతో నమీబియా గెలుపు లాంఛనం. కానీ మెహ్రాన్ ఖాన్ అద్భుతమైన బౌలింగ్ వల్ల ఆఖరి బంతి బౌల్ అయ్యేసరికి ఒమన్ గెలవాలి! ఫ్రయ్‌లింక్, గ్రీన్ వికెట్లు తీసిన మెహ్రాన్ 4 పరుగులే ఇచ్చాడు. చివరి బంతికి 2 పరుగులపుడు మెహ్రాన్ చక్కని బంతి వేయగా... వికెట్ కీపర్ మిస్ ఫీల్డింగ్, మిస్ త్రో వల్ల ఒక పరుగు వచ్చి స్కోరు 'టై' అయింది. తుది ఫలితం కోసం మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది.

సూపర్ ఓవర్లో...

ఒమన్ బౌలర్ బిలాల్ ఖాన్ వేసిన ఈ ఓవర్‌లో నమీబియా బ్యాటర్లు డేవిడ్ వీస్ తొలి నాలుగు బంతుల్లో 4, 6, 2, 1 కొట్టగా... చివరి రెండు బంతులు ఆడిన ఎరాస్మస్ 4, 4 బాదడంతో ఆ జట్టు వికెట్ కోల్పోకుండా 21 పరుగులు చేసింది. విజయం సాధించేందుకు 22 పరుగులు చేయాల్సిన ఒమన్ జట్టు నసీమ్ (2) వికెట్ కోల్పోయి 10 పరుగులే చేయడంతో నమీబియా 'సూపర్' విక్టరీ నమోదు చేసింది.

బ్రిడ్జ్‌టౌన్: లాంఛనమైన (ఆఖరి ఓవర్ 6 బంతుల్లో 5 పరుగులు) విజయానికి దూరమైన నమీబియా 'సూపర్ ఓవర్'తో చేజారిన విజయాన్ని చేజిక్కించుకుంది. ఒమన్ పేసర్ మెహ్రాన్ (3-1-7-3) అసాధారణ బౌలింగ్‌ను... డేవిడ్ వీస్ 'షో' సూపర్ ఓవర్లో మాయం చేసింది. 'సూపర్ ఓవర్'లో 13 పరుగులు చేసిన వీస్ వెంటనే బౌలింగ్‌కు దిగి వికెట్ కూడా తీసి 10 పరుగులిచ్చాడు. 20 జట్లు బరిలో ఉన్న ఈ టి20 ప్రపంచకప్‌లో 'బోర్' మ్యాచ్‌లే బోలెడనుకున్న క్రికెట్ ప్రేక్షకులు, విశ్లేషకుల అంచనాల్ని గ్రూప్ 'బి'లోని ఈ మ్యాచ్ తారుమారు చేసింది. బోరా అనిపించేలా ఈ కూనల తక్కువ స్కోర్ల మ్యాచ్ వరల్డ్‌కప్‌కే వన్నె తెచ్చింది. సూపర్ ఓవర్లో నమీబియా గెలిచినా... మ్యాచ్ చూసిన ప్రతి మదిని ఒమన్ పోరాటం తాకింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ జట్టు 19.4 ఓవర్లలో 109 పరుగులకే ఆలౌటైంది. ఖాలిద్ కైల్ (39 బంతుల్లో 34; 1 ఫోర్, 1 సిక్స్), జీషాన్ (20 బంతుల్లో 22; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. నమీబియా బౌలర్లలో రూబెన్ ట్రంపుల్‌మన్ (4/21), వీస్ (3/28), కెప్టెన్ గెరార్డ్ ఎరాస్మస్ (2/20) అదరగొట్టారు. తర్వాత నమీబియా కూడా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 109 పరుగులే చేయడంతో సూపర్ ఓవర్ అనివార్యమైంది. జాన్ ఫ్రయ్‌లింక్‌తో పాటు నికోలస్ డేవిన్ (31 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు.

3 టి20 ప్రపంచకప్ చరిత్రలో 'సూపర్ ఓవర్'లో ఫలితం తేలిన మ్యాచ్‌లు. శ్రీలంక ఆతిథ్యమిచ్చిన 2012 ప్రపంచకప్‌లో సెప్టెంబర్ 27న న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక జట్టు.. అక్టోబర్ 1న న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు 'సూపర్ ఓవర్'లో విజయం సాధించాయి.

టి20 ప్రపంచకప్ విజేతకు రూ.20.35 కోట్లు

న్యూయార్క్: అమెరికా, వెస్టిండీస్‌లు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ప్రస్తుత టి20 ప్రపంచకప్ విజేతకు ఈసారి గతం కంటే రెట్టింపు ప్రైజ్‌మనీ లభించనుంది. కప్ గెలిచిన జట్టుకు రూ. 20.35 కోట్లు (2.45 మిలియన్ అమెరికా డాలర్లు), రన్నరప్ జట్టుకు రూ. 10.63 కోట్లు (1.28 మిలియన్ డాలర్లు) అందజేస్తారు. సెమీఫైనల్స్‌తోనే ఆగిపోయిన ఇరుజట్లకు రూ. 6.54 కోట్లు (7,87,500 మిలియన్ డాలర్లు) చొప్పున ఇస్తారు. ఈనెల 29వ తేదీన ముగిసే ఈ టోర్నీలో తొలిసారి 20 జట్లు పోటీపడుతున్నాయి. ఈ టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 93.48 కోట్లు (11.25 మిలియన్ డాలర్లు)గా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సోమవారం ప్రకటించింది. ఇది గత 2022 ప్రపంచకప్ టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 46.53 కోట్ల (5.6 మిలియన్ డాలర్లు)కి రెట్టింపు మొత్తం. ట్రోఫీ గెలిచిన ఇంగ్లండ్‌కు రూ. 13.29 కోట్లు (1.6 మిలియన్ డాలర్లు) లభించాయి.

టి20 ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ X ఉగాండా
వేదిక: గయానా : ఉదయం గం. 6 నుంచి

ఇంగ్లండ్ X స్కాట్లాండ్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్ : రాత్రి గం. 8 నుంచి

నెదర్లాండ్స్ X నేపాల్
వేదిక: డాలస్ : రాత్రి గం. 9 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

దక్షిణాఫ్రికా బోణీ

- శ్రీలంకపై 6 వికెట్లతో విజయం
- 7 పరుగులిచ్చి 4 వికెట్లు తీసిన నోర్జే



నోర్జే

న్యూయార్క్: మెరుపుల్లేవు... విధ్వంసక షాట్లు అసలే కనిపించలేదు... రెండు పెద్ద జట్ల మధ్య జరిగిన టి20 వరల్డ్ కప్ నాలుగో మ్యాచ్ కనీస వినోదాన్ని అందించలేకపోయింది. అనూహ్య బౌన్స్‌తో బ్యాటింగ్‌కు ఏమాత్రం అనుకూలంగా లేని పిచ్‌పై స్వల్ప స్కోర్లతో మ్యాచ్ ముగిసింది. ముందుగా శ్రీలంక పేలవ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చగా, చిన్న లక్ష్యాన్ని ఛేదించేందుకు దక్షిణాఫ్రికా కూడా చాలా సమయం తీసుకుంది. మొత్తం 35.3 ఓవర్ల మ్యాచ్‌లో పోరులో కేవలం 6 ఫోర్లు, 3 సిక్స్‌లు మాత్రమే వచ్చాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి ఆడిన 214 బంతుల్లో 127 డాట్ బాల్స్ ఉన్నాయి. టి20 వరల్డ్ కప్ చరిత్రలో ఎక్కువ డాట్ బాల్స్ ఆడిన మ్యాచ్ ఇదే కావడం గమనార్హం.సోమవారం నాసా కౌంటీ క్రికెట్ స్టేడియంలో జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక 19.1 ఓవర్లలో 77 పరుగులకే కుప్పకూలింది. టి20ల్లో లంకకు ఇదే అత్యల్ప స్కోరు. కుశాల్ మెండిస్ (30 బంతుల్లో 19; 1 ఫోర్), ఏంజెలో మాథ్యూస్ (16 బంతుల్లో 16; 2 సిక్స్‌లు), కామిందు మెండిస్ (11) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆన్రిచ్ నోర్జే (4/7) తన స్పెల్‌లో ఓవర్‌కు ఒకటి చొప్పున నాలుగు వికెట్లు పడగొట్టడం విశేషం. కేశవ్ మహరాజ్ వరుస బంతుల్లో 2 వికెట్లు తీసి లంకను దెబ్బ కొట్టాడు. అనంతరం దక్షిణాఫ్రికా 16.2 ఓవర్లలో 4 వికెట్లకు 80 పరుగులు సాధించింది. డి కాక్ (27 బంతుల్లో 20; 1 సిక్స్), క్లాసెన్ (22 బంతుల్లో 19 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) గెలుపు తీరం చేర్చారు. హసరంగకు 2 వికెట్లు దక్కాయి.

క్వార్టర్ ఫైనల్లో సబలెంకా, రిబాకినా



సబలెంకా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా (బెలారస్), ప్రపంచ నాలుగో ర్యాంకర్ రిబాకినా (కజకిస్తాన్) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. సోమవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సబలెంకా 6-2, 6-3తో ఎమా నవారో (అమెరికా)పై, రిబాకినా 6-4, 6-3తో స్వితోలినా (ఉక్రెయిన్)పై గెలుపొందారు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో జాస్మిన్ పావోలిని (ఇటలీ) 4-6, 6-0, 6-1తో ఎలీనా అవానెస్యాన్ (రష్యా)పై, మిరా ఆంద్రీవా 7-5, 6-2తో వర్వారా గ్రచెవా (ఫ్రాన్స్)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

మెద్వెదెవ్‌కు చుక్కెదురు

పురుషుల సింగిల్స్‌లో ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) ప్రిక్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగాడు. అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా) 4-6, 6-2, 6-1, 6-3తో మెద్వెదెవ్‌ను ఓడించి ఎనిమిదో ప్రయత్నంలో ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6-7 (2/7), 6-3, 7-6 (10/8)తో శ్రీరామ్ బాలాజీ (భారత్)-మిగెల్ వరేలా (మెక్సికో) జోడీని ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.

వైదొలిగిన సాత్విక్-చిరాగ్ జోడీ



జకార్తా: ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీ నేడు ప్రారంభంకానుంది. పురుషుల డబుల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్స్, ప్రపంచ నంబర్‌వన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) చివరి నిమిషంలో ఈ టోర్నీ నుంచి వైదొలిగింది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ కూడా ఈ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. మంగళవారం జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రియాన్షు రజావత్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్; వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా)తో కిరణ్ జార్జి తలపడతారు. బుధవారం జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో వెన్ చి సు (చైనీస్ తైపీ)తో పీవీ సింధు ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో సింధు గెలిస్తే ప్రిక్వార్టర్ ఫైనల్లో ఒలింపిక్, ప్రపంచ మాజీ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) ఎదురయ్యే అవకాశముంది.

క్రికెట్‌కు కేదార్ జాదవ్ వీడ్కోలు



పుణే: భారత క్రికెటర్ కేదార్ జాదవ్ ఆటకు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించిన కేదార్... ఎమ్మెస్ ధోని శైలిలో తన రిటైర్మెంట్ ప్రకటన చేశాడు. 'నా కెరీర్‌లో అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు. 1500 గంటల సమయం నుంచి నేను రిటైర్ అయినట్లుగా గుర్తించగలరు' అని ట్వీట్ చేశాడు. మహారాష్ట్రకు చెందిన కేదార్ 2014లో భారత్ తరఫున తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. 73 వన్డేల్లో 42.09 సగటుతో 2 సెంచరీలు, 6 అర్ధసెంచరీలు సహా 1389 పరుగులు చేశాడు. 9 టి20ల్లో 122 పరుగులు సాధించాడు. తన 'స్లింగ్' తరహా ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌తో అతను 27 వికెట్లు కూడా పడగొట్టాడు. కేదార్ అత్యుత్తమ ప్రదర్శన సొంతగడ్డ పుణేలో వచ్చింది. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డేలో అతను 76 బంతుల్లోనే 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో అజేయంగా 120 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. 2019 వన్డే వరల్డ్ కప్ ఆడిన అతను చివరిసారిగా 2020లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో కేదార్ ఢిల్లీ, కొచ్చి, చెన్నై, హైదరాబాద్ జట్ల తరఫున ఆడాడు.

సినిమా

వారం తర్వాత కూలీగా...



రజనీకాంత్

'కూలీ'గా మారిపోవడానికి రెడీ అవుతున్నారు రజనీకాంత్. ఆయన హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనున్న చిత్రం 'కూలీ'. ఈ చిత్రంలో సత్యరాజ్, శోభన కీలక పాత్రల్లో నటించనున్నారని, కమల్‌హాసన్ ఓ అతిథి పాత్రలో కనిపిస్తారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. కాగా 'కూలీ' సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 10న ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని ఇటీవల ఓ ఆధ్యాత్మిక గురువు దగ్గర పేర్కొన్నారు రజనీకాంత్. తొలి షెడ్యూల్ చిత్రీకరణ చెన్నైలో ప్రారంభం కానుందని తెలిసింది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్న 'కూలీ' సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది. అలాగే రజనీకాంత్ హీరోగా నటించిన మరో చిత్రం 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను అక్టోబరులో విడుదల చేయనున్నట్లుగా చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. కాగా 'వేట్టయాన్'ను అక్టోబరు 10న విడుదల చేసే ఆలోచనలో ఉన్నట్లుగా కూడా రజనీకాంత్ పేర్కొన్నారు.

పడమ్ బిగిన్స్



సూర్య

కొత్త సినిమా షురూ చేశారు సూర్య. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జోజూ జార్జ్, జయరామ్, కరుణాకరన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ అండమాన్‌లో ఆరంభమైంది. సూర్య కెరీర్‌లోని ఈ 44వ చిత్రం చిత్రీకరణ మొదలైనట్లుగా చెబుతూ, 'పడమ్ బిగిన్స్' (సినిమా ఆరంభమైంది) అంటూ చిన్న వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు కార్తీక్ సుబ్బరాజ్. ప్రేమ, యుద్ధం, నవ్వు అంశాల నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలోని సూర్య లుక్‌ని బట్టి ఇది పీరియాడికల్ మూవీ అని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్స్ చేస్తున్నారు.

పద్దెనిమిదేళ్ల తర్వాత...



శోభన

ప్రభాస్ హీరోగా నటించిన సైన్స్ ఫిక్షన్ అండ్ ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్ 'కల్కి 2898ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. కాగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుక ఈ నెల 7న ముంబైలో ఉండొచ్చనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఇక ఈ సినిమాలో నాని, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ అతిథి పాత్రల్లో నటించారనే టాక్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో శోభన పేరు కూడా చేరింది. అయితే ఈ పాత్రల గురించి ప్రస్తుతానికి చిత్రబృందం రహస్యంగా ఉంచుతోంది. 'కల్కి 2898 ఏడీ'లో శోభన ఓ కీలక పాత్రలో కనిపించనున్నారట. 2006లో వచ్చిన 'గేమ్' సినిమా తర్వాత శోభన తెలుగులో మరో సినిమా చేయలేదు. ఒకవేళ 'కల్కి 2898 ఏడీ'లో ఆమె నటించినది వాస్తవం అయితే పద్దెనిమిదేళ్ల తర్వాత శోభన నటించిన తెలుగు సినిమా ఇదే అవుతుంది.

ఆ ఇమేజ్ ఇబ్బందిగానే ఉంది

- సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల



అనన్యా పాండే



కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సత్యభామ'. ఓ కీలక పాత్రలో నవీన్‌చంద్ర నటించారు. సుమన్ చిక్కాల దర్శకత్వంలో బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ చరణ్ పాకాల మాట్లాడుతూ– ''ఓ పోలీసాఫీసర్ ఎమోషనల్ జర్నీయే ఈ చిత్రం. థ్రిల్లర్ మూవీస్ ఇష్టపడేవారికి 'సత్యభామ' చిత్రం బాగా నచ్చుతుంది. ఈ సినిమాలో ఐదు పాటలు ఉన్నాయి. కాజల్, నవీన్‌చంద్రల మధ్య 'కళ్లారా చూసాలే..' అనే లవ్ సాంగ్ ఉంటుంది. అలాగే 'వెతుకు వెతుకు' పాట ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో ఉంటుంది. ఈ పాటను కీరవాణిగారు పాడారు. గతంలో 'ఆపరేషన్ గోల్డ్ ఫిష్' సినిమాకు నా మ్యూజిక్‌లో కీరవాణిగారు పాడారు. 'సత్యభామ' పాటకు ఆయన స్టూడియోకు వస్తూనే 'నేను పాడిన ఏ పాట విని నన్ను నీ పాటకు పాడేందుకు పిలిచావ్' అని అడిగారు. లిరిక్స్ అందించిన చంద్రబోస్‌గారు కూడా పాట పూర్తయ్యేంతవరకు చర్చిస్తూనే ఉన్నారు. 'సత్యభామ'లో ఓ ఇంగ్లిష్ సాంగ్ కూడా ఉంది. ఇతర పాటలను త్వరలోనే విడుదల చేస్తాం. నేను థ్రిల్లర్ మూవీస్‌కు ఎక్కువగా పని చేస్తాననే పేరొచ్చింది. ఈ ఇమేజ్ నాకు ఇబ్బందిగానే ఉంది. ఎందుకంటే మొత్తం థ్రిల్లర్ మూవీస్‌కు నేనే సంగీతం అందించడం లేదు. చెప్పాలంటే.. 'కృష్ణ అండ్ హిస్ లీల, డీజే టిల్లు, గుంటూరు టాకీస్' వంటి లవ్ అండ్ కమర్షియల్ చిత్రాలకూ సంగీతం అందించాను. కానీ థ్రిల్లర్స్ మ్యూజిక్ డైరెక్టర్ అనే ముద్ర వచ్చేసింది. నాకైతే అన్ని జానర్ సినిమాలకూ సంగీతం అందించాలని ఉంది. ప్రస్తుతం 'గూఢచారి 2'కు పని చేస్తున్నాను. మరో నాలుగైదు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.

టీనేజ్ గుర్తొచ్చింది!

టీనేజ్ జ్ఞాపకాలు గుర్తొచ్చాయని సంబరపడిపోతున్నారు బాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్యా పాండే. హఠాత్తుగా అనన్యా పాండేకు టీనేజ్ జ్ఞాపకాలు గుర్తుకు రావడానికి కారణం 'ఇన్‌సైడ్ అవుట్ 2' అనే అమెరికన్ యానిమేటెడ్ ఫిల్మ్. కెల్సీ మన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో హాలీవుడ్ తారలు అమీ పోహ్లర్, ఫిలిస్ స్మిత్, లూయిస్ బ్లాక్, టోనీ హేల్ వంటి వారు ఈ సినిమాలోని హ్యాపీ, సాడ్‌నెస్, యాంగర్ వంటి ఎమోషన్స్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చారు. రిలే ఆండర్సన్ అనే ఓ 13 ఏళ్ల టీనేజ్ అమ్మాయి పాత్రకు హిందీ వెర్షన్‌లో వాయిస్ ఓవర్ ఇచ్చారు అనన్యా పాండే. సినిమాలో కెన్సింగ్టన్ తాల్మన్ ఈ పాత్ర చేసింది. రిలే ఆండర్సన్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చిన సందర్భంగా అనన్యా పాండే మాట్లాడుతూ– ''పిక్సర్ అండ్ డిస్నీ స్టూడియోల యానిమేషన్ చిత్రాలకు నేను అభిమానిని. ఈ సంస్థల నుంచి వస్తున్న 'ఇన్‌సైడ్ అవుట్ 2'కి వాయిస్ ఓవర్ ఇవ్వడం హ్యాపీగా ఉంది. రిలే పాత్రకు వాయిస్ ఓవర్ చెబుతున్నప్పుడు నాకు నా టీనేజ్ గుర్తొచ్చింది'' అని పేర్కొన్నారు. కాగా 'ఇన్‌సైడ్ అవుట్ 2' ఈ నెల 14న రిలీజ్ కానుంది.

థ్రిల్... కామెడీ



సుస్మితా ఛటర్జీ

వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'వాట్ ది ఫిష్'. 'వెన్ ద క్రేజీ బికమ్స్ క్రేజియర్' అనేది ట్యాగ్‌లైన్. విశాల్ బెజవాడ, సూర్య బెజవాడ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ముఖ్య తారాగణంగా అదితి, జాన్సన్, హరినాథ్ పొలిచెర్ల, సుస్మితా ఛటర్జీ, సత్యలను ఎంపిక చేసినట్లు సోమవారం చిత్రబృందం పేర్కొంది. ''ఇప్పటికే విడుదల చేసిన నిహారిక కొణిదెల, వెన్నెల కిశోర్‌ల ఫస్ట్ లుక్ పోస్టర్‌లకు మంచి స్పందన వచ్చింది. యునిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో ఎంటర్‌టైన్‌మెంట్ కూడా ఉంది. వివిధ భాషల్లో చిత్రీకరిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ తెలియజేసింది. ఈ చిత్రానికి సంగీతం: శక్తికాంత్ కార్తీక్.

యూత్‌ఫుల్ లవ్

ఓ వాస్తవ ఘటన ఆధారంగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు-500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఇంటర్మీడియట్ టీనేజ్ లవ్‌స్టోరీగా రూపొందిన ఈ చిత్రంలో ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞ శ్రీ వేణున్, రామ్ పటాస్, తేజ గౌడ్, బాంబే పద్మ, శ్రీమునిచంద్ర, మండపేట మల్లిక జాగుల ముఖ్యపాత్రల్లో నటించారు. ''ఈ చిత్రంలోని ప్రేమకథ ప్రేక్షకుల మనసులను హత్తుకునేలా ఉంటుంది'' అని శ్రీనాథ్ పులకురం అన్నారు. ''ఇప్పటివరకు విడుదల చేసిన మా సినిమా టీజర్, రెండు పాటలకు మంచి స్పందన లభించింది. మా సినిమాని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ శంకర్ పిక్చర్స్ ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయనుంది. ఈ లవ్‌స్టోరీ యూత్‌ని ఆకట్టుకుని, మంచి వసూళ్లు రాబడుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు భువన్ రెడ్డి.



షాజ్ఞ, ప్రణవ్

క్రైమ్ రీల్‌కు విజయం దక్కాలి

- సముద్ర ఖని

సిరి చౌదరి, పింక్ పాక్ సూర్య, జబర్దస్త్ అభి, భరత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'క్రైమ్ రీల్'. అన్నే క్రియేషన్స్ పతాకంపై సంజన అన్నే తెరకెక్కించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. జూన్ 14న ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు నటుడు-దర్శక-నిర్మాత సముద్ర ఖని ముఖ్య అతిథిగా హాజరై, ఈ సినిమా ప్రేక్షకులను అలరించి, విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. సంజన మాట్లాడుతూ – ''సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత ఏ విధంగా చెడిపోతున్నారో తెలియజేసే చిత్రం ఇది'' అన్నారు.



సంజన, సముద్ర ఖని

సాక్షి బిజినెస్
మంగళవారం
4-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	2,507	76,469
నిఫ్టీ ▲	733	23,264

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

● నాస్‌డాక్	16,735	▲	1
● డోజోన్స్	38,375	▽	311
● ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,263	▽	13
● డాక్స్	18,608	▲	110
● షాంఘై	3,078	▽	8
● నికాయ్	38,923	▲	435

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	71,776
బంగారం (99.5 స్వచ్ఛత)	71,489
వెండి (కేజీ)	90,217

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.61	83.63
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.63	107.19
€	యూరో	ఎస్‌బీఐ	89.02	91.38
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.28	53.43
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.31	56.24
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.27	63.96
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.28	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.75	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.35	12.43

మేలో తయారీ మందగమనం



ముంబై: భారత్ తయారీ రంగం మే నెల్లో నెమ్మదించింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ఏప్రిల్‌లో 58.8 వద్ద ఉంటే, మేలో 57.5కు తగ్గింది. మార్చిలో సూచీ 16 నెలల గరిష్ఠ స్థాయి 59.1ని చూసిన సంగతి తెలిసిందే. కాగా, సూచీ 50పైన ఉంటే దానిని వృద్ధి ధోరణిగానే పరిగణిస్తారు. ఈ దిగువకు పడిపోతేనే క్షీణతగా భావిస్తారు.

హైదరాబాద్‌లో క్యాష్‌ఈ ఎక్సలెన్స్ సెంటర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫిన్‌టెక్ సంస్థ క్యాష్‌ఈ హైదరాబాద్‌లో కొత్తగా టెక్నాలజీ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. రుణాలు, బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్ తదితర సర్వీసులు అందిస్తున్న తమ టెక్నాలజీ అవసరాల కోసం ఇది ఉపయోగపడనున్నట్లు సంస్థ సీఈవో యశోరాజ్ త్యాగి తెలిపారు. దీనికోసం 150 మందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు, ఈ ఏడాది ఆఖరు నాటికి మొత్తం మీద 300 మంది ఉద్యోగులను తీసుకోనున్నట్లు వివరించారు.

ఆరిజీన్ ఫార్మా కొత్త ఫెసిలిటీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన ఆరిజీన్ ఫార్మాస్యూటికల్ సర్వీసెస్ తాజాగా బయాలాజిక్స్ ఫెసిలిటీ ప్రారంభించింది. హైదరాబాద్ సమీపంలోని జీనోమ్ వ్యాలీలో 70,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది ఏర్పాటైంది. ఆరిజీన్ ఫార్మా కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-6-2024	
విశాఖ	450-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	450-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

ఎగ్జిట్ పోల్ జోష్..

కుమ్మేసిన బుల్స్

- 2,507 పాయింట్ల పోల్‌వాల్ట్
- కొత్త రికార్డ్ 76,469కు సెన్సెక్స్
- నిఫ్టీ 733 పాయింట్ల హైజంప్
- చరిత్రాత్మక గరిష్ఠం 23,264కు
- 5 ట్రిలియన్ డాలర్లకు మార్కెట్ల విలువ



ముంబై: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి మోదీ 3.0 ప్రభుత్వం ఏర్పాటు కానుందని వెలువడిన ఎగ్జిట్ పోల్ అంచనాలతో మార్కెట్ కొత్త శిఖరాలకు పరుగులు తీసింది. ఎన్‌డీఏ భారీ మెజారిటీని సాధించనుందన్న అంచనా కొనుగోళ్ల జోరుకు దారిచూపింది. ఒక్కసారిగా ఊపందుకున్న పెట్టుబడులతో స్టాక్ బుల్ లాభాలతో కుమ్మేసింది. దీంతో సెన్సెక్స్ 2,507 పాయింట్ల(3.5 శాతం) పోల్‌వాల్ట్ చేసింది. 76,469 వద్ద ముగిసింది. నిఫ్టీ 733 పాయింట్లు(3.3 శాతం) ఎగసి 23,264 వద్ద స్థిరపడింది, బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలో అన్ని రంగాలూ లాభాలతో ముగిశాయి. గతంలో 2021 ఫిబ్రవరి 1న బడ్జెట్ రోజున సెన్సెక్స్, నిఫ్టీ 5 శాతం చొప్పున జంప్ చేశాయి. అంతక్రితం అంటే 2019 మే 20న సైతం ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఎన్‌డీఏ కూటమి రెండోసారి విజయాన్ని అంచనా వేయడంతో మార్కెట్లు 3 శాతానికిపైగా పురోగమించాయి. ఇంట్రాడేలోనూ స్టాక్ మార్కెట్లు సరికొత్త రికార్డు గరిష్ఠాలకు చేరాయి.

మార్కెట్లు కదం తొక్కడంతో ఒకే ఒక్క రోజులో స్టాక్ ఇన్వెస్టర్ల సంపద ఏకంగా రూ. 13.78 లక్షల కోట్లు పెరిగింది. ఫలితంగా బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ. 426 లక్షల కోట్లకు చేరింది. వెరసి సరికొత్త రికార్డ్ 5.13 ట్రిలియన్ డాలర్లను తాకింది. ఈ బాటలో

సంపదే సంపద



ఎన్‌ఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ సైతం 5.09 లక్షల కోట్ల డాలర్ల(రూ. 422.48 లక్షల కోట్లు)కు చేరింది. స్పష్టమైన మెజారిటీతో వరుసగా మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకానుండటంతోపాటు.. గతేడాది(2023-24) దేశ జీడీపీ ప్రపంచ దేశాలలోనే అత్యధికంగా 8.2 శాతం వృద్ధిని సాధించడం ఇన్వెస్టర్లకు ఎనలేని ప్రోత్సాహాన్నిచ్చినట్లు విశ్లేషణ.

రిలయన్స్ భళా..

సెన్సెక్స్ 30 షేర్లలో 25 కౌంటర్లు భారీ లాభాలతో నిలవగా.. కేవలం సన్ ఫార్మా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఏషియన్ పెయింట్స్, నెస్లే, ఇన్ఫోసిస్ నామమాత్రంగా డీలా పడ్డాయి. వీటితోపాటు ఇక నిఫ్టీ 50లో ఐషర్, ఎల్‌టీఐఎం, బ్రిటానియా స్వల్ప వెనకడుగు వేశాయి. ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ, ప్రయివేట్ బ్యాంక్స్, మెటల్, మీడియా, ఆటో 7-2.5 శాతం మధ్య జంప్‌చేశాయి. హెవీవెయిట్ షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్ 6 శాతం జంప్ చేసి మార్కెట్లకు దన్నునిచ్చింది. రూ. 3,021కు చేరడం ద్వారా రూ. లక్ష కోట్ల మార్కెట్ విలువను జమ చేసుకుంది. దీంతో మొత్తం మార్కెట్ క్యాప్ రూ. 20.44 లక్షల కోట్లను దాటింది. షేరు తొలుత రూ. 3,029 వద్ద రికార్డ్ గరిష్టానికి చేరింది.

ప్రభుత్వ షేర్ల పరుగు



తాజా ర్యాలీలో పలు ప్రభుత్వ రంగ కౌంటర్లు **లాభాల పరుగు** తీశాయి. దీంతో ఎస్‌బీఐ, **ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్**, ఓఎన్‌జీసీ, బీపీసీఎల్, కోల్ **ఇండియా 9.5-4.5** శాతం మధ్య దూసుకెళ్లాయి. **ఇతర బ్లూచిప్స్‌లో** శ్రీరామ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ, **యాక్సిస్ బ్యాంక్**, ఎంఅండ్‌ఎం, అల్ట్రాటెక్, ఇండస్ **ఇండ్, టాటా స్టీల్**, ఐసీఐసీఐ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ **స్టీల్, బజాజ్ త్రయం**, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, గ్రాసిమ్, కొటక్ బ్యాంక్ 7-2.5 శాతం మధ్య ఎగశాయి. పీఎస్‌యూ బ్యాంక్స్‌లో బీవోబీ, ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్ ఒక దశలో 52 వారాల గరిష్ఠాలకు చేరాయి. పీఎస్‌యూగా ఎస్‌బీఐ తొలిసారి రూ. 8 లక్షల కోట్ల మార్కెట్ విలువను సాధించడం విశేషం!

విదేశీ పెట్టుబడుల జోరు



బీఎస్‌ఈ నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లుతాజాగా రూ. 6,851 కోట్ల పెట్టుబడులను పంప్ చేశారు. డీఐఐలు సైతం రూ. 1,914 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి. గత వారాంతాన సైతం ఎఫ్‌పీఐలు రూ. 1,613 కోట్లను ఇన్వెస్ట్ చేసిన విషయం విదితమే. బీఎస్‌ఈ సూచీలలో మిడ్ క్యాప్ 3.5 శాతం, స్మాల్ క్యాప్ 2 శాతం చొప్పున బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 2,346 లాభపడితే.. 1,615 మాత్రమే నష్టపోయాయి.

అదానీ షేర్ల మెరుపులు



ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి కేంద్రంలో సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న అంచనాలకుతోడు, జఫరీస్ బ్రోకింగ్ బయ్ రేటింగ్‌తో తాజాగా అదానీ గ్రూప్ కౌంటర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో గ్రూప్‌లోని అన్ని లిస్టెడ్ షేర్లు 4% నుంచి 16% వరకు భారీ లాభాలతో దూసుకెళ్లాయి. ఫలితంగా గ్రూప్‌లోని మొత్తం 10 కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 19.42 లక్షల కోట్లను అధిగమించింది.

రూపాయి ర్యాలీ



సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ మెజారిటీపై అంచనాలతో స్టాక్ మార్కెట్లతోపాటు దేశీ కరెన్సీ సైతం జోరందుకుంది. దీంతో డాలరుతో మారకంలో రూపాయి 28 పైసలు బలపడింది. తద్వారా 2023 నవంబర్ 15 తదుపరి(24 పైసలు) ఒకే రోజు రూపాయి అత్యధికంగా పుంజుకుంది. వెరసి రెండు నెలల గరిష్ఠం 83.14 వద్ద ముగిసింది. ఇంతక్రితం మార్చి 21న 83.13 వద్ద నిలిచింది. ఉత్పత్తిని యథాతథంగా కొనసాగించే ఒపెక్ నిర్ణయంతో చమురు ధరలు బలహీనపడటం సైతం రూపాయికి ప్రోత్సాహాన్నిచ్చినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి తొలుత 83.09 వద్ద హుషారుగా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82.95 వద్ద గరిష్ఠాన్ని తాకగా.. 83.17 వద్ద కనిష్ఠానికీ చేరింది. చివరికి 83.14 వద్ద స్థిరపడింది. వారాంతాన రూపాయి 13 పైసలు నీరసించి 83.42 వద్ద నిలిచిన సంగతి తెలిసిందే. స్టాక్స్‌లో విదేశీ పెట్టుబడులు, జీడీపీ, జీఎస్‌టీ గణాంకాలు సైతం రూపాయికి దన్నునిచ్చినట్లు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

సెబీ నుంచి అప్‌డేటెడ్ మొబైల్ యాప్ సారథి2.0

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా పర్సనల్ ఫైనాన్స్‌పై విస్తృత సమాచారంతో సారథి2.0(Saarthi2.0) మొబైల్ యాప్‌ను విడుదల చేసింది. ఇన్వెస్టర్లకు ఉద్దేశించిన ఈ యాప్‌లో సమీకృత టూల్స్‌కు చోటు కల్పించింది. సంక్లిష్టమైన ఫైనాన్షియల్ కాన్సెప్ట్స్‌ను సరళతరం చేయడమే లక్ష్యంగా అప్‌డేటెడ్ వెర్షన్‌ను ప్రవేశపెట్టినట్లు సెబీ పేర్కొంది. వినియోగదారులకు సులభరీతిలో అర్థమయ్యే విధంగా సమాచారాన్ని క్రోడీకరించినట్లు తెలియజేసింది. యాప్‌లో ఫైనాన్షియల్ కాల్క్యులేటర్లు, కేవైసీ విధానాలు వివరించే మాడ్యూల్స్, ఎంఎఫ్‌లు, ఈటీఎఫ్‌లతోపాటు స్టాక్ ఎక్స్ఛేంజీలలో షేర్ల కొనుగోళ్లు, అమ్మకాలు, ఇన్వెస్టర్ల సమస్యల పరిష్కార విధానాలు తదితర పలు అంశాలను చేర్చినట్లు వివరించింది.

జపాన్ ఎయిర్‌లైన్స్‌తో ఇండిగో కోడ్‌షేర్ ఒప్పందం

ముంబై: జపాన్ ఎయిర్‌లైన్స్‌తో (జేఏఎల్) కోడ్‌షేర్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు దేశీ విమానయాన సంస్థ ఇండిగో వెల్లడించింది. ఇండిగో నెట్‌వర్క్‌లోని 14 ప్రాంతాలకు జేఏఎల్ సేవలు విస్తరించేందుకు ఇది ఉపయోగపడనుంది. జపాన్ ఎయిర్‌లైన్స్ ప్రస్తుతం అది టోక్యో నుంచి ఢిల్లీ, బెంగళూరుకు ఫ్లయిట్ సర్వీసులు అందిస్తోంది. ఈ భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా పెద్ద నగరాలైన హైదరాబాద్, ముంబై, చెన్నై, కోల్‌కతా, అహ్మదాబాద్, అమృత్‌సర్, కొచ్చి, కోయంబత్తూర్, తిరువనంతపురం, తిరుచిరాపల్లి, పుణె, లక్నో, వారణాసి తదితర ప్రాంతాలకు సర్వీసులు విస్తరించేందుకు వీలవుతుంది. తదుపరి జేఏఎల్ నెట్‌వర్క్ రూట్లలో తమ సేవలు విస్తరించేందుకు ఇండిగో కోడ్‌షేర్ కుదుర్చుకోనుంది.



విద్య, ఉద్యోగ సమాచారం

ట్రిపుల్‌ఐటీ బాసరలో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్‌జీయూకేటీ).. 2024-25 విద్యాసంవత్సరంలో ట్రిపుల్ ఐటీలో ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.

» **కోర్సు:** ఇంటిగ్రేటెడ్ బీటెక్(ఇంటర్ + బీటెక్)
» **మొత్తం సీట్లు:** 1500
» **అర్హత:** ఈ సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
» **వయసు:** 31.12.2024 నాటికి 18 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 21ఏళ్లలోపు ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వారి పదో తరగతి గ్రేడ్‌కు 0.40 స్కోర్ కలుపుతారు. మొత్తం సీట్లలో 85 శాతం రాష్ట్ర విద్యార్థులకు కేటాయిస్తారు. మిగతా 15 శాతం సీట్లకు తెలంగాణ రాష్ట్ర విద్యార్థులతోపాటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 01.06.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 22.06.2024
» **వెబ్‌సైట్:** http://rgukt.ac.in

నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో యూజీ, పీజీ కోర్సులు

మణిపూర్‌లోని నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ.. 2024-25 విద్యాసంవత్సరానికి స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రవేశ పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, గేమ్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

కోర్సులు- సీట్లు

» **మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్(ఎంపీఈఎస్):** కోర్సు వ్యవధి రెండేళ్లు,సీట్లు-30.
» **బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్(బీపీఈఎస్):**కోర్సు వ్యవధి మూడేళ్లు,సీట్లు-50.
» **మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ స్పోర్ట్స్ కోచింగ్:** కోర్సు వ్యవధి రెండేళ్లు, సీట్లు-20.
» **బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ స్పోర్ట్స్ కోచింగ్:** కోర్సు వ్యవధి నాలుగేళ్లు, సీట్లు-80.
» **మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ స్పోర్ట్స్ సైకాలజీ:** కోర్సు వ్యవధి రెండేళ్లు, సీట్లు-15.
» **మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ అప్లయిడ్ స్పోర్ట్స్ న్యూట్రిషన్:** కోర్సు వ్యవధి రెండేళ్లు, సీట్లు-15.
» **అర్హత:** కోర్సును అనుసరించి 12వ తరగతి, డిప్లొమా/పీజీ డిప్లొమా, డిగ్రీ తదితరాల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక ప్రక్రియ:** ప్రవేశ పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్, గేమ్ ప్రొఫిషియన్సీ టెస్ట్, వైవా వోస్ తదితరాల ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 27.06.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 09.07.2024
» **వెబ్‌సైట్:** www.nsu.ac.in/admission

నిట్ రూర్కెలాలో ఎంఏ

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్).. మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్‌లో 2024-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు గాను ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

» **కోర్సు వివరాలు:** ఎంఏ (డెవలప్‌మెంట్ స్టడీస్)
» **మొత్తం సీట్ల సంఖ్య:** 39
» **అర్హత:** బీటెక్ , బీఏ, బీఎస్సీ, బీకాం డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. డిగ్రీ హానర్స్ ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యం ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది:** 20.06.2024
» **వెబ్‌సైట్:** http://eapplication.nitrkl.ac.in

నిట్ రూర్కెలాలో పీహెచ్‌డీ

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్).. 2024-25 విద్యా సంవత్సరానికి సెల్ఫ్ ఫైనాన్స్ స్కీం కింద పీహెచ్‌డీ ప్రోగ్రాంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

» **ప్రోగ్రామ్ వివరాలు:** పీహెచ్‌డీ
» **విభాగాలు:** బయోటెక్నాలజీ అండ్ మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎర్త్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్స్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, వ్యాలిడ్ గేట్/నెట్/బెట్/ జీప్యాట్ స్కోరు లేదా ఏదైనా జాతీయ స్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక ప్రక్రియ:** అకడమిక్ రికార్డ్, విద్యార్హత, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 15.06.2024.
» **రాత పరీక్ష, ఇంటర్వ్యూ తేదీలు:** 28.06.2024.
» **వెబ్‌సైట్:** http://eapplication.nitrkl.ac.in

ఐఐఎంలకు క్యాట్ దారి!

» నవంబర్ 24న క్యాట్-2024
» జూలై నెలాఖరులోపు నోటిఫికేషన్
» క్యాట్ తర్వాత దశలో జీడీ, పీఐలు
» ప్రాక్టీస్‌తోనే సక్సెస్ అంటున్న నిపుణులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. సంక్షిప్తంగా ఐఐఎంలు! ఇవి మేనేజ్‌మెంట్ విద్యలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన క్యాంపస్‌లు. అందుకే ఐఐఎంల్లో చేరితే ఉజ్వల కార్పొరేట్ కెరీర్ ఖాయమైనట్లేనని భావిస్తారు. ఇలాంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్)!! దేశంలో అత్యంత క్లిష్టమైన పరీక్షల్లో ఒకటిగా భావించే క్యాట్.. ఈ ఏడాది నవంబర్ 24న జరుగనుంది. ఈ నేపథ్యంలో.. క్యాట్ ప్రత్యేకత, పరీక్ష విధానం, సిలబస్, ఐఐఎంల మలిదశ ఎంపిక ప్రక్రియ తదితర వివరాలు..

మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థుల్లో అధిక శాతం మంది లక్ష్యం.. ఐఐఎంలు. వీటిల్లో ప్రవేశాలకు నిర్వహించే క్యాట్‌లో విజయం సాధించాలని డిగ్రీ స్థాయి కోర్సుల ఫైనల్‌లో ఉండగానే ప్రిపరేషన్ ప్రారంభిస్తారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 21 ఐఐఎం క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిల్లో ఎంబీఏ, పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్, పీహెచ్‌డీ(ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్) కోర్సులను అందిస్తున్నారు. గత ఏడాది వరకు 20 ఐఐఎం క్యాంపస్‌లనే పేర్కొనగా.. ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రెనింగ్ ఇన్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ (ఎన్ఐటీఐఈ)కు తాజాగా ఐఐఎం హోదా లభించింది. దీంతో క్యాట్ 2024 ద్వారా ప్రవేశాలు కల్పించే ఐఐఎంల సంఖ్య 21కు పెరిగింది. వీటిల్లో దాదాపు అయిదు వేల సీట్లు ఉన్నాయి.

క్యాట్‌తో ఐఐటీల్లోనూ ప్రవేశం

క్యాట్ స్కోర్‌తో ఐఐఎంలే కాకుండా.. ఇంజనీరింగ్ విద్యను అందించడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఐఐటీల్లోనూ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరే అవకాశముంది. వీటితోపాటు దేశంలోని పలు ఇతర ఇన్‌స్టిట్యూట్స్ సైతం క్యాట్ స్కోర్ ఆధారంగా మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

రెండు లక్షలకు పైగా పోటీ

క్యాట్‌ను ప్రతి ఏటా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. దీనికి రెండు లక్షల మందికిపైగా పోటీ పడుతున్నారు. గత మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే.. క్యాట్-2023కు 2.8 లక్షల మంది; క్యాట్-2022కు 2.22 లక్షల మంది; క్యాట్-2021కు 1.91 లక్షల మంది హాజరయ్యారు.



అర్హతలు

కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు కనీసం 45 శాతం మార్కులు) ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఇంటర్వ్యూ సమయానికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.

మూడు విభాగాల్లో పరీక్ష

క్యాట్-2024 తేదీపై స్పష్టత వచ్చింది. దీంతో క్యాట్ పరీక్ష విధానంలో ఏమైనా మార్పులు జరిగే అవకాశం ఉందా అనే సందేహం అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. సాధారణంగా క్యాట్ పరీక్ష మొత్తం మూడు విభాగాల్లో జరుగుతుంది. విభాగం-1లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్; విభాగం-2లో డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, విభాగం-3లో క్వాంటిటేటివ్ ఎబిలిటీలపై ప్రశ్నలు అడుగుతారు.

విభాగాల వారీగా ప్రశ్నల సంఖ్య

క్యాట్-2023లో వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 24 ప్రశ్నలు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 22 ప్రశ్నలు చొప్పున మొత్తం 66 ప్రశ్నలతో.. 198 మార్కులకు పరీక్ష నిర్వహించారు. క్యాట్-2024 పరీక్ష కూడా ఇదే విధానంలో జరుగుతుందని, పెద్దగా ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాత పరీక్షలో బెస్ట్ స్కోర్ ఇలా

వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్

ఈ విభాగంలో స్కోర్ కోసం ఇంగ్లిష్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ గ్రామర్‌పై దృష్టిపెట్టాలి. యాంటానిమ్స్, సినానిమ్స్, బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా ఫ్యాక్ట్స్, ఇన్ఫరెన్సెస్, జంబుల్డ్ పారాగ్రాఫ్స్‌లను ప్రాక్టీస్ చేయాలి. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగే రీడింగ్ కాంప్రహెన్షన్‌లో రాణించేందుకు అసెంప్షన్, స్టేట్‌మెంట్స్‌పై పట్టు సాధించాలి.

డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్

క్యాట్‌లో డీఐఎల్‌ఆర్‌గా పేర్కొనే ఈ విభాగంలో రాణించేందుకు విశ్లేషణాత్మక నైపుణ్యం, తార్కిక విశ్లేషణ పెంచుకోవాలి. టేబుల్స్, గ్రాఫ్స్, చార్ట్స్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. లాజికల్ రీజనింగ్‌లో క్యూబ్స్, క్లాక్స్, నంబర్ సిరీస్, లెటర్ సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

మ్యాథమెటికల్, అర్థమెటికల్ స్కిల్స్‌ను పరీక్షించే విభాగం ఇది. ఇందులో అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించాలంటే.. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, రేషియోస్, టైం-డిస్టెన్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి అల్జీబ్రా, మోడ్రన్ మ్యాథ్స్, జామెట్రీలపై దృష్టిపెట్టాలి.

కటాఫ్ పర్సంటైల్

క్యాట్‌లో ప్రతి సెక్షన్‌లోనూ నిర్దిష్ట కటాఫ్ మార్కులు పొందేలా కృషి చేయాలి. ఎందుకంటే.. ఐఐఎంలు మలి దశ ఎంపిక ప్రక్రియకు అభ్యర్థులను పిలిచేందుకు ఓవరాల్ కటాఫ్‌తోపాటు సెక్షనల్ కటాఫ్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఓవరాల్ కటాఫ్ కనిష్ఠంగా 85, గరిష్ఠంగా 90 పర్సంటైల్ సాధించాలి. అదే విధంగా సెక్షనల్ కటాఫ్ 75 నుంచి 80 పర్సంటైల్ కోసం కృషి చేయాలి.

కాన్సెప్ట్స్, ప్రాక్టీస్

క్యాట్ అభ్యర్థులు తొలుత సిలబస్‌ను, గత ప్రశ్నపత్రాలను పరిశీలించి.. పరీక్ష విధానంపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత ప్రామాణిక మెటీరియల్ ఆధారంగా ప్రిపరేషన్ సాగించాలి. దీంతోపాటు ప్రతి టాపిక్ పూర్తయిన తర్వాత ప్రాక్టీస్ చేయడం ఎంతో మేలు చేస్తుంది. క్యాట్ ప్రిపరేషన్‌లో అభ్యర్థులు..ఎక్కువ వెయిటేజీ ఉన్న అంశాలను పరిశీలించి వాటిపై దృష్టి సారించాలి. ప్రతి యూనిట్ తర్వాత ఉండే మోడల్ కొశ్చన్స్‌ను సాధన చేయాలి.

నమూనా, మోడల్ టెస్ట్‌లు

క్యాట్ అభ్యర్థులు మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరుకావడం మేలు చేస్తుంది. మాక్ టెస్టులకు హాజరై.. వాటి ఫలితాలను విశ్లేషించుకోవాలి. తద్వారా తాము ఇంకా పట్టు సాధించాల్సిన టాపిక్స్ గుర్తించి, వాటిపై ఫోకస్ పెట్టాలి. ఇలా ఒకవైపు సబ్జెక్ట్ ప్రిపరేషన్ సాగిస్తూనే.. మరోవైపు నిరంతరం తమ ప్రతిభను పరీక్షించుకుంటూ.. నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి.

మలి దశకు సన్నద్ధత

ఐఐఎంలు క్యాట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి.. మలిదశలో గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయి. వీటికి నిర్దిష్ట వెయిటేజీ కేటాయించే విధానాన్ని అనుసరిస్తున్నాయి. తుది విజేతల ఎంపికలో క్యాట్ స్కోర్‌కు 50 నుంచి 70 శాతం, జీడీ/పీఐలకు 30 నుంచి 50 శాతం మధ్యలో వెయిటేజీ ఇస్తున్నాయి. కాబట్టి క్యాట్‌లో బెస్ట్ స్కోర్ కోసం ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు.. మలిదశ ఎంపిక ప్రక్రియపైనా ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలి. ఇందులో రాణించేందుకు సమాంతరంగా ప్రిపరేషన్ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

జీడీ, పీఐ

మలిదశలో నిర్వహించే గ్రూప్ డిస్కషన్స్(జీడీ)లో అభ్యర్థులను పలు బృందాలుగా విభజించి.. ఒక్కో బృందానికి ఏదైనా ఒక టాపిక్ ఇచ్చి దానిపై మాట్లాడమంటారు. ఒక్కో బృందంలో ఎనిమిది నుంచి పది మంది అభ్యర్థులు ఉంటున్నారు. జీడీ సమయంలోనే కొన్ని ఐఐఎంలు రిటెన్ ఎబిలిటీ టెస్ట్ నిర్వహిస్తున్నాయి. ఈ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థులు నిర్దిష్టంగా ఒక టాపిక్‌పై తమ అభిప్రాయాలను పద పరిమితితో రాయాలని కోరుతున్నారు. ఈ రెండు దశల్లోనూ విజయం సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూ సమయంలో మేనేజ్‌మెంట్ కోర్సులో చేరడానికి కారణాలు.. భవిష్యత్తు లక్ష్యాలు, ఆసక్తులు తదితర ప్రశ్నలు అడుగుతున్నారు. అభ్యర్థులు ఇప్పటి నుంచి తొలి, మలి దశ ఎంపిక ప్రక్రియపై అవగాహన పెంచుకొని ప్రిపరేషన్ కొనసాగిస్తే విజేతలుగా నిలిచే అవకాశం ఉంటుంది.

క్లుప్తంగా...

జస్టిస్ నందా రికార్డు

ఒకేరోజు అత్యధిక తీర్పులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నందా ఒకేరోజు రికార్డు స్థాయిలో తీర్పులు చెప్పారు. వేసవి సెలవుల తర్వాత సోమవారం కోర్టు పునఃప్రారంభమైంది. జస్టిస్ నందా ధర్మాసనం ముందు 136 పిటిషన్లు లిస్ట్ కాగా, 76 వేర్వేరు పిటిషన్లపై తీర్పులు వెలువరించారు. జస్టిస్ నందా ఈ తీర్పులన్నిటినీ కోర్టు హాల్‌లోనే చెప్పడం గమనార్హం.

టెట్ ప్రాథమిక కీ విడుదల

12న టెట్ ఫలితాల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఎస్‌టెట్) ప్రాథమిక కీని సోమవారం విడుదల చేశారు. పేపర్ల వారీగా కీని అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. ఈ నెల 12వ తేదీన టెట్ ఫలితాలను విడుదల చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా మే 20వ తేదీ నుంచి జూన్ 2 వరకూ టెట్ పరీక్ష జరిగింది. పేపర్–1కు 99,958 మంది, పేపర్–2కు 1,86,423 మంది దరఖాస్తు చేశారు. వీరిలో పేపర్–1కు 86.03 శాతం, పేపర్–2కు 82.58 శాతం హాజరయ్యారు.

హైదరాబాద్ ట్రిపుల్‌ఐటీలో మరో కొత్త కోర్సు

- పార్ట్ టైమ్ ఇండస్ట్రీ స్పాన్సర్డ్ మాస్టర్స్ (ఎంఎస్) కోర్సు
- ఆగస్టు నుంచి ప్రారంభం

రాయదుర్గం: హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ మరో సరికొత్త కోర్సుకు శ్రీకారం చుట్టింది. ట్రిపుల్ ఐటీ కొత్త పార్ట్ టైమ్ పరిశ్రమ సహకారంతో మాస్టర్స్(ఎంఎస్) కోర్సును పరిచయం చేస్తోంది. పనిచేసే నిపుణులను లక్ష్యంగా చేసుకొని రెగ్యులర్ ఎంఎస్ బై రీసెర్చ్ కోర్సు చుట్టూ రూపొందించిన కోర్సు ఇది. ప్రస్తుత ఉద్యోగాలతోపాటు రెగ్యులర్ మాస్టర్స్, పార్ట్ టైమ్‌ను చేపట్టడానికి అవకాశం కల్పిస్తారు. సైన్స్/ఇంజనీరింగ్ డిగ్రీతోపాటు కనీసం ఒక ఏడాది టెక్ ఇండస్ట్రీ అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ కోర్సులో పాల్గొనేవారు ప్రతి సెమిస్టర్‌లో కోర్సులను ఎంచుకునే అవకాశం ఉంటుంది. థీసిస్ ప్రాజెక్ట్‌తోపాటుగా మూడేళ్ల పదవీ కాలంలో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో పూర్తి సమయం విద్యార్థులతోపాటు నమోదు చేసుకోవచ్చు. కంపెనీలు తమ ఉద్యోగులను మాస్టర్స్ కోసం నామినేట్ చేయడానికి కోర్సు కోసం నమోదు చేసుకోవచ్చు. ఆగస్టు 2024లో ఈ కోర్సు ప్రారంభమవుతుంది. దరఖాస్తులను ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ముందస్తు రిజిస్ట్రేషన్‌ను ప్రీ-రిజిస్ట్రేషన్ ఫారమ్‌లో చేసుకోవచ్చు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించేందుకు అవసరమైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లార్నింగ్ బిజినెస్ అనలిటిక్స్, దేవోప్స్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, పైథాన్, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్, ప్రాజెక్ట్ మేనేజిమెంట్, బ్లాక్ చైన్ వంటి 50కి పైగా కంప్యూటర్ సర్టిఫికేషన్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ విదేశాలలో ఉత్తమ ఉపాధి అవకాశాలున్నట్లు తెలిపారు. వివరాలకు ఆన్‌లైన్‌లో www.nationalskillacade.my.in వెబ్‌సైట్ ద్వారా లేదా ఫోన్ నంబర్ 9505 800050 లో సంప్రదించాలని సూచించారు.

హెచ్‌సీయూలో పీహెచ్‌డీకి దరఖాస్తుల ఆహ్వానం

జూలై 7న ప్రవేశ పరీక్ష..

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని వివిధ కోర్సులలో పీహెచ్‌డీ కోసం 2024–25 విద్యాసంవత్సరానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. ప్రవేశ పరీక్ష ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. వివరాలకు http://acad.uohyd.ac.inని సందర్శించాలని అధికారులు కోరుతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ జూన్ 18వ తేదీ కాగా, హాల్ టికెట్లను 28వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో మాత్రమే నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షను జూలై 7వ తేదీన నిర్వహిస్తారు. ప్రతిభ చాటిన వారిని ఇంటర్వ్యూలకు పిలిచి అందులో పాసైన వారికి పీహెచ్‌డీ సీటు కేటాయిస్తారు. ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఇంగ్లిష్ ల్యాంగ్వేజ్ స్టడీస్, హెల్త్ సైన్సెస్, విజన్ సైన్సెస్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి సబ్జెక్టులలో రిజర్వేషన్ల ఆధారంగా మొత్తం 34 సీట్లు ఉంటాయని అధికారులు తెలిపారు.

పాలిసెట్‌లో 84% అర్హత

ఎంపీసీ, ఎంబైపీసీ విభాగాల్లో అమ్మాయిలదే హవా ● ఫలితాలు విడుదల చేసిన బుర్రా వెంకటేశం



పాలిటెక్నిక్ ప్రవేశ ఫలితాలను విడుదల చేస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇతర అధికారులు

ఎంపీసీ విభాగంలో టాపర్స్ వీరే...

తూమాటి హరీశ్ - మందలపాడు
లలిత్ మనోహర్ కటకం - మీర్‌పేట, హైదరాబాద్
జి భవిత - మహబూబ్‌నగర్
గోపగాని శ్రీనిక - సూర్యాపేట
నవ్వతి సుశాంత్ - పినపాక

ఎంబైపీసీ విభాగంలో టాపర్స్

సామా అశువర్ధన్ రెడ్డి - మిథాన్‌పల్లె
జి భవిత - మహబూబ్‌నగర్
గోపగాని శ్రీనిక - సూర్యాపేట
కట్టా హరీశ్ - మారేపల్లి
మోతోజు విష్ణువర్ధన్ - మల్కాజిగిరి

సాక్షి, హైదరాబాద్, సూర్యాపేట టౌన్, కామారెడ్డి టౌన్: పెనుబల్లి, మీర్‌పేట: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి మే 24వ తేదీన నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్ పాలిసెట్–2024) ఫలితాలను సోమవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ పరీక్షలో 84.20 శాతం మంది అర్హత సాధించారు. బాలుర కన్నా బాలికలే ఎంపీసీ, ఎంబైపీసీ రెండు విభాగాల్లోనూ ఎక్కువ ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశారు. పాలిసెట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 92,808 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 82,809 మంది పరీక్ష రాశారు. పరీక్ష రాసిన వారిలో 69,728 (84.28 శాతం) అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో 84.20 శాతం పాసయితే, ఎంబైపీసీ విభాగంలో 82.48 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 120 మార్కుల ప్రశ్నపత్రానికి విద్యార్థులు 36 (30 శాతం) మార్కులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఎంపీసీ విభాగంలో బాలురు 80.47 శాతం, బాలికలు 88.94 శాతం పాలిసెట్ అర్హత సాధించారు. ఎంబైపీసీ విభాగంలో బాలురు 77.90 శాతం, బాలికలు 88.30 శాతం అర్హత పొందారు. త్వరలో పాలిసెట్ అర్హులకు పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన తేదీలను ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

బాంబేలో ఐఐటీ సాధించడమే లక్ష్యం



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ ఒలంపియాడ్ పాఠశాలలో 3వ తరగతి నుంచి చదివాను. ఎంబైపీసీ విభాగంలో 120 మార్కులకు 119.5 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంకు సాధించాను. అలాగే ఎంపీసీ విభాగంలో 120 మార్కులకు 119 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించాను. బాంబేలో ఐఐటీ సాధించడమే నా లక్ష్యం. తల్లిదండ్రులు జ్యోతి. సోమయ్య, పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించగలిగాను.

– గోపగాని శ్రీనిక, సూర్యాపేట, పాలిసెట్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు

ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చేయాలని..



టీఎస్ పాలిసెట్ ఫలితాల్లో ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం మండలపాడుకు చెందిన రమేష్ సైకిస్కూల్ విద్యార్థి తుమ్మటి హరీశ్‌కు రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు లభించింది. ఎంపీసీ విభాగంలో ఆయన 120కి 120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి మొదటి స్థానంలో నిలిచాడు. హరీశ్ తల్లి అంగన్‌వాడీ టీచర్ కాగా, తండ్రి షాపులో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలనే తన లక్ష్యమని హరీశ్ వెల్లడించాడు.

– హరీశ్, మొదటి ర్యాంకర్

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ర్యాంకు



"నేను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ ఒలంపియాడ్ పాఠశాలలో 4వ తరగతి నుంచి చదువుతున్నాను. పాఠశాల ఉపాధ్యా యులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాలిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించలిగాను. నాన్న మల్లారెడ్డి ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, అమ్మ రజిత గృహిణి. నా చదువుకు ఇద్దరి ప్రోత్సాహం ఎంతో ఉంది. ఎంబైపీసీ విభాగంలో 120 మార్కులకు 118 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో 120 మార్కులకు 118 మార్కులు పొంది రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు సాధించాను. ఐఐటీ చెన్నైలో సీటు సాధించి ఉన్నత హోదాలో ఉండటమే లక్ష్యం."

– సామ అషువర్ధన్‌రెడ్డి, ఎంబైపీసీ రాష్ట్ర 2వ ర్యాంకు, సూర్యాపేట

శాస్త్రవేత్త కావాలనే ఆశయం..

పాలిసెట్‌లో 120 మార్కులకు 118 మార్కులు సాధించా. మా తల్లిదండ్రులు ఇద్దరు ఉపాధ్యాయులు. వారి సూచనలు, సలహాలతో మంచి మార్కులు సాధించాను గణితం, కెమిస్ట్రీ, ఫిజిక్స్, సైన్స్ సబ్జెక్టలపై ఆసక్తి ఉంది. అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకొని పెద్ద శాస్త్రవేత్త కావాలనేది నా కోరిక.

– ముత్యాల పార్థసారథి, పాలిసెట్ ఐదో ర్యాంకర్, మహబూబాబాద్

పేదింటి 'అక్షర' ప్రతిభ



పాలిసెట్ పరీక్ష ఫలితాల్లో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని గోత్రాల అక్షర రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించి ప్రతిభ ఛాటింది. ఎంపీసీలో 120 మార్కులకు గాను, 118 మార్కులు సాధించింది. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంది. పదవతరగతి ఫలితాల్లో సైతం 10 జీపీఏ మార్కులు సాధించింది. వీరిది పేద కుటుంబం. తండ్రి ఎయిర్‌టెల్ టవర్ కంపనీకి టెక్నీషియన్‌గా పని చేస్తుండగా తల్లి గృహిణి. ఐఐటి సాధించాలన్నదే తన లక్ష్యమని అక్షర 'సాక్షి'తో పేర్కొంది.

ఐఐటీలో బీటెక్ చదవాలన్నదే ధ్యేయం



పాలిసెట్– 2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా మీర్‌పేట త్రివేణినగర్ కాలనీకి చెందిన కే.లలిత్ మనోహర్‌గుప్తా రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. 120 మార్కులకు గాను 119 మార్కులు సాధించడంపై తల్లిదండ్రులు కే.కిషోర్, శ్రీవేణి హర్షం వ్యక్తం చేశారు. ఐఐటీలో బీటెక్ చదవాలన్నదే తన లక్ష్యమని లలిత్ తెలిపాడు.

– లలిత్, 2వ ర్యాంకర్

గ్రూప్‌-1 హాల్‌టికెట్లలో మార్పులు

- బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో క్రిమీలేయర్‌తో కొత్త హాల్ టికెట్లు
- అభ్యర్థులు హాల్‌టికెట్లను మళ్లీ డౌన్‌లోడ్ చేసుకోవాలన్న టీజీపీఎస్సీ
- మూడు నెలల్లోపు ఫొటోను మాత్రమే హాల్‌టికెట్‌లో జత చేయాలని స్పష్టీకరణ
- నిబంధనలో పాటించకుంటే పరీక్ష హాలులోకి ప్రవేశముండదని హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: ఈనెల 9న జరిగే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి అభ్యర్థుల హాల్‌టికెట్లలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నెల 1వ తేదీ నుంచి అభ్యర్థుల హాల్‌టికెట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికే జారీ చేసిన హాల్‌టికెట్లలో స్వల్ప మార్పులు చేస్తూ కమిషన్ తాజాగా నిర్ణయించింది. దీంతో మార్పులతో కూడిన కొత్త హాల్‌టికెట్లను కమిషన్ వెబ్‌సైట్ నుంచి తిరిగి డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ సోమవారం ఉదయం నుంచి అభ్యర్థులకు సంక్షిప్త సమాచారం ద్వారా విషయాన్ని విస్తృతం చేసింది. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి మార్పు చేసిన హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

చేసిన మార్పు ఏమిటంటే..

ఈ నెల 1వ తేదీన అభ్యర్థుల హాల్‌టిక్కెట్లను కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్నారు. అయితే అభ్యర్థి కమ్యూనిటీని హాల్‌టికెట్‌లో ప్రస్తావిస్తూ వాటిని అందుబాటులో ఉంచింది. రిజర్వేషన్ కేటగిరీల్లోని అభ్యర్థుల క్రిమీలేయర్‌ను హాల్‌టికెట్‌లో స్పష్టం చేయాలని నిర్ణయించిన కమిషన్... ఆ మేరకు మార్పు చేసింది. దీంతో అభ్యర్థి కమ్యూనిటీ పక్కన క్రిమిలేయర్/నాన్ క్రిమీలేయర్ కనిపించేలా మార్పులు చేస్తూ నూతన హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ హాల్‌టికెట్ ఉద్యోగ నియామకాల ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు జాగ్రత్త చేసుకోవాలని కమిషన్ స్పష్టం చేసింది. హాల్‌టికెట్‌లో అభ్యర్థి ఫొటో అతికించాల్సిన చోట కూడా... మూడు నెల ల్లోపు దిగిన పాస్‌ఫొటోను మాత్రమే జత చేయా లని, పరీక్షకు సంబంధించిన నియమ, నిబంధనల ను హాల్‌టికెట్‌లో సూచించినట్లు కమిషన్ వివరించింది. ప్రతి నిబంధనను కచ్చితంగా పాటించాలది.

7 నుంచి టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ

6న బడిబాట ప్రారంభం : విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం

సాక్షి, హైదరాబాద్ : ఈనెల 7వ తేదీ నుంచి టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభిస్తామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు టెట్‌తో సంబంధం లేకుండానే ప్రమోషన్లు ఇస్తామన్నారు. సోమవారం ఆయన తనను కలిసి విలేకరులతో మాట్లాడారు. టీచర్ల, బదిలీలు, ప్రమోషన్లకు అడ్డంకులు తొలగిపోయాయని, ఎన్నికల కోడ్ పూర్తికాగానే ఈ ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఈనెల 20వ తేదీలోగా ఈ ప్రాసెస్ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ నెల 6 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం మొదలుపెడతామన్నారు. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఒకవేళ అది సాధ్యం కాకపోతే, విద్యాసంవత్సరం ప్రారంభం రోజు జూన్12న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు పాఠశాలలను సందర్శిస్తారని, ఈ సందర్భంగా పిల్లలకు యూనిఫామ్, పుస్తకాలు, నోట్ బుక్స్ అందించే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారని చెప్పారు.

సర్కారు బడుల వల్ల కలిగే లాభాలను వివరిస్తాం

సర్కారు బడుల్లో చదివితే కలిగే లాభాలను బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించనున్నట్టు బుర్రా వెంకటేశం తెలిపారు. పేరెంట్స్‌కు ఫీజుల భారం ఉండబోదని, యూనిఫామ్, బుక్స్, పుస్తకాల ఖర్చు ఉండదని చెప్పారు. సర్కారు బడుల్లో క్వాలిఫైడ్ టీచర్లుంటారని, ప్రైవేట్ బడులతో పోలిస్తే సర్కారు విద్యాసంస్థల్లో రిజల్ట్ ఎక్కువగా ఉంటుందనే విషయాలను పేరెంట్స్‌కు వివరిస్తామన్నారు.

టీఎస్ ఐసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- 5, 6 తేదీల్లో.. మూడుసెషన్లలో నిర్వహణ
- నిమిషం ఆలస్యమైతే నో ఎంట్రీ
- పరీక్షకు హాజరుకానున్న 86,184మంది అభ్యర్థులు
- తెలంగాణలో 111, ఏపీలో 5 పరీక్ష కేంద్రాలు
- టీఎస్ ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్ నర్సింహాచారి వెల్లడి



కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం (2024–2025)లో ప్రవేశాలకు గానూ ఈ నెల 5, 6 తేదీల్లో జరగనున్న టీఎస్ ఐసెట్–2024కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ, ఏపీలో కలిపి 86,184మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో (కంప్యూటర్ బేస్డ్)లో ఈ ప్రవేశ పరీక్షలకు హాజరు కానున్నారని టీఎస్ ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు కళాశాల ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి సోమవారం తెలిపారు. విద్యార్థులు 41,203 మంది, విద్యార్థినులు 44,980మంది, ట్రాన్స్‌జెండర్ ఒకరు ప్రవేశ పరీక్ష రాయనున్నారు. తెలంగాణలో 111, ఆంధ్రప్రదేశ్‌లో ఐదు పరీక్ష కేంద్రాలు.. మొత్తంగా 116 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

28న ఫలితాలు

133 మంది అబ్జర్వర్లను నియమించామని, మూడు సెషన్లలో పరీక్ష ఉంటుందని నర్సింహాచారి తెలిపారు. ఈ నెల 5న మొదటి సెషన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12–30గంటల వరకు, అదే రోజు రెండో సెషన్ మధ్యాహ్నం 2–30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 6వ తేదీన ఉదయం ఒకటే సెషన్ 10 నుంచి మధ్యాహ్నం 12–30గంటల వరకు ఉంటుందని వెల్లడించారు. నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. నిర్దేశించిన సమయానికి నిమిషం ఆల్యసమైనా కేంద్రాల్లోకి అనుమతించబోరని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి ఎల్రక్టానిక్ పరికరాలను అనుమతించబోరని, హాల్‌టికెట్‌తో హాజరుకావాలన్నారు. ఈ నెల 15న ప్రాథమిక కీని విడుదల చేస్తారని, దీనిపై అభ్యంతరాలను ఈ నెల 16నుంచి 19వ తేదీ వరకు స్వీకరిస్తారని తెలిపారు. ఫైనల్ కీతోపాటు ప్రవేశ పరీక్ష ఫలితాలను 28న విడుదల చేస్తామని టీఎస్ఐసెట్‌కన్వీనర్ నర్సింహాచారి తెలిపారు.

గతేడాది కంటే భారీగా పెరిగిన దరఖాస్తులు

గత ఏడాది కంటే ఈసారి టీఎస్ ఐసెట్‌కు భారీగా దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది 75,540మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా, ఈసారి 86,184మంది దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది తోపోల్చితే 10,644 దరఖాస్తులు పెరిగాయి.

గురుకుల డిగ్రీ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఏప్రిల్ 28న నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. విద్యార్థులు సాధించిన మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం పూర్తయింది. ఆ వివరాలను https://tgrdccet.cgg.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు టీజీఆర్‌డీసీసెట్–2024 కన్వీనర్ బి.సైదులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కుల ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించామని, సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 5వ తేదీ నుంచి 13వ తేదీలోపు నిర్దేశించిన కాలేజీల్లో రిపోర్ట్ చేయాలన్నారు. రిపోర్టు చేసే సమయంలో విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకెళ్లాలన్నారు. బీసీలకు 30 గురుకుల డిగ్రీ కాలేజీలున్నాయని, ఇందులో బాలికలకు 15, బాలుర కోసం 15 కాలేజీలున్నట్లు తెలిపారు. మొత్తం 9,220 సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 26 మహిళా డిగ్రీ కాలేజీల్లో 7,080 సీట్లు, గిరిజన సొసైటీ పరిధిలో 15 బాలికలు, 6 బాలుర కాలేజీల్లో 4,040 సీట్లు భర్తీ చేయనున్నట్లు వివరించారు. డిగ్రీ కాలేజీల్లో జనరల్ కోర్సులతో పాటు మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, క్లౌడ్ టెక్నాలజీ, న్యూట్రిషన్ ఫుడ్ టెక్నాలజీ, ఫ్యాషన్ టెక్నాలజీ, టెక్స్ టైల్ టెక్నాలజీ, బీబీఏ, బీకాం కంప్యూటర్స్, ఎంపీసీఎస్, ఎంఎస్సీఎస్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, మరిన్ని వివరాలకు https://tgrdccet.cgg.gov.in వెబ్‌సైట్ సంప్రదించాలని ఆయన సూచించారు.



సివిల్స్ ర్యాంకర్‌కు సీఎం అభినందన

సాక్షి, హైదరాబాద్: సివిల్స్–2023 ఫలితాల్లో జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించిన నందాల సాయికిరణ్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందించారు. సాయికిరణ్ సోమవారం సీఎంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సాయికిరణ్ స్వస్థలం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెల్చాల గ్రామం.

ఐదో తరగతే చదివినా..
ఔరా! అనిపిస్తున్నాడు..



దండేపల్లి: ఐదో తరగతి మాత్రమే చదివిన ఓ వ్యక్తి తన ఆవిష్కరణలతో ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన సంబారి మల్లేశ్ బ్యాటరీతో నడిచే సైకిల్‌ను తయారు చేసి పలువురి దృష్టిని ఆకర్షిస్తున్నారు. గతంలో కొన్నాళ్లు ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేసి పలు ఆవిష్కరణలు చేశాడు. ఇంటినుంచే సెల్‌ఫోన్ సాయంతో పొలంలోని మోటార్‌ను ఆన్ ఆఫ్ చేయడం, చప్పట్లతో వెలిగే విద్యుత్ దీపాలను తయారు చేశారు. కొన్నేళ్లు ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లి ఇటీవల స్వగ్రామానికి వచ్చిన మల్లేశ్ మళ్లీ ఆవిష్కరణలపై దృష్టి సారించాడు. రూ.5 వేలతో సైకిల్, ఆన్‌లైన్‌లో బ్యాటరీతోపాటు పీఎండీసీ మోటార్‌కిట్ (రూ.15వేలు) కొనుగోలు చేసి సైకిల్‌కు బిగించాడు. ఈ బ్యాటరీ రెండు గంటలు చార్జింగ్ చేస్తే తొక్కే అవసరం లేకుండా 35 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు. అనుకోకుండా చార్జింగ్ అయిపోతే, మళ్లీ సైకిల్‌లా తొక్కుతూ వెళ్లవచ్చు కూడా. ఇలాంటి సైకిల్ అవసరమున్నవారు ఆర్డర్ ఇస్తే తయారు చేసి ఇస్తానని కూడా మల్లేశ్ చెబుతున్నారు.

అగ్నివీర్ విన్యాసాలు అదుర్స్



గోల్కొండ: అగ్నివీర్‌ల విన్యాసాలు అదరగొట్టాయి. గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లోని మాకన్‌సింగ్ స్టేడియంలో సోమవారం మూడో బ్యాచ్ అగ్నివీర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారి పాసింగ్ పరేడ్ జరిగింది. ఈ సందర్భంగా అగ్నివీర్‌లు ప్రదర్శించిన విన్యాసాలు ఒళ్లు గగురుపొడిచాయి. వందేమాతరం, మా తుఝే సలామ్‌తో పాటు దేశభక్తి గీతాలపై అగ్నివీర్ యోధుల విన్యాసాలు అదరగొట్టాయి. 2517 మంది అగ్నివీర్‌లు శిక్షణ పూర్తి చేసుకున్నారని ఆర్టిలరీ సెంటర్ లెఫ్టినెంట్ కల్నల్ వీఎస్ఎం రాహుల్ ఆర్ సింగ్, తూకార్స్ అండ్ కర్నల్ కమాండెంట్ వివరించారు. అత్యాధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి 31 వారాల పాటు అగ్నివీర్‌కు ఎంపికైన యువకులకు శిక్షణ ఇచ్చి యోధులుగా తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో పాసింగ్ పెరేడ్‌లో పాల్గొన్న అగ్నివీర్‌ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. జాతీయ గీతంపై శిక్షణ పూర్తి చేసుకున్న 2517 అగ్నివీర్‌ల పరేడ్‌ను వారు తిలకించారు.

వాన కురిస్తే వజ్రాల వేట

అప్పలనరసింహాపురంలో వజ్రాల కోసం అన్వేషణ!



నేలకొండపల్లి: వర్షాలు కురుస్తుండటంతో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అప్పలనరసింహాపురంలో వజ్రాల కోసం జోరుగా వేట మొదలైంది. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ప్రజలతో గ్రామంలో సందడి నెలకొంది. గ్రామానికి సోమవారం ప్రత్యేక వాహనాల్లో పలువురు చేరుకోగా.. ఏపీలోని జగ్గయ్యపేట మండలానికి ఓ యువకుడికి వజ్రం దొరికింది. దీని విలువ దాదాపు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉంటుందని అంచనా. ముందుగానే అక్కడ మకాం వేసిన దళారులు వ్యాపారులకు సమాచారం ఇచ్చి వారి వద్దకు తీసుకెళ్లారు. కాగా, సోమవారం మరికొందరికి కూడా విలువైన వజ్రాలు లభించినట్లు తెలుస్తోంది. వజ్రాల వేటలో నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం రూరల్, చింతకాని, బోనకల్ తదితర ప్రాంతాల వారు పాల్గొన్నారు.

ఆర్బిట్రేషన్‌పై పోస్టు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేషన్ కోర్సు

'ఎస్కీ'లో మరో కొత్త కోర్సుకు శ్రీకారం



రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో మరో కొత్తకోర్సును ప్రారంభిస్తున్నారు. దీనిలో భాగంగా ఆర్బిట్రేషన్‌పై పోస్టు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేషన్ కోర్సును నిర్వహిస్తారు. ఈ కోర్సు కాలపరిమితి ఒక ఏడాది. జేఎన్‌టీయూ హైదరాబాద్–ఎస్కీ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం జేఎన్‌టీయూ గుర్తింపు కలిగిన ఈ కోర్సుకు దరఖాస్తులను కోరుతున్నారు. ఏ యూనివర్సిటీ నుంచైనా బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఈ కోర్సులో చేరడానికి అవకాశం కల్పిస్తారు. దరఖాస్తులు ఎస్కీ కార్యాలయం నుంచి పొందవచ్చని, జూలై 30 లోపు సమర్పించాలని సూచించారు. గచ్చిబౌలిలోని ఎస్కీ కార్యాలయంలో ఈ కొత్త కోర్సు బ్రోచర్‌ను సోమవారం సాయంత్రం ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు ఆవిష్కరించారు. రాత పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన వారికి ఇంటర్వ్యూ నిర్వహించి అడ్మిషన్ కల్పిస్తామని ఆయన చెప్పారు. ఎస్కీలోని సివిల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ చివరి సంవత్సరం పరీక్షలు రాసేవారు, గ్రాడ్యుయేట్లు, గ్రాడ్యుయేషన్ చివరి ఏడాది పరీక్షలు రాసేవారు, అయిదేళ్ల ఎల్ఎల్‌బి కోర్సులో మూడేళ్లు పూర్తి చేసుకున్న వారికి కూడా ఈ ఆర్బిట్రేషన్ పోస్టు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేషన్ కోర్సులో చేరడానికి అవకాశం కల్పిస్తామన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.